
www.andhrajyothy.com srikakulam

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

శ్రీకాకుళం

16

శనివారం 12 ఆగస్టు 2017



నారుకు ఊపిరి పోయాలని..

9 లో

ఓవైపు చినుకులు పడుతున్నా...నారు గొంతు తడవడం లేదు. భూమి దాహం తీరడం లేదు. వర్షాన్నే నమ్ముకున్న అన్నదాతలు చేసదేమీలేక బిందెలను ఆశ్రయిస్తున్నారు. ఇంటిల్లిపాదీ వెళ్లి సమీప చెరువుల్లోని నీటిని బిందెలతో పట్టుకొని ఒకరి తరువాత ఒకరుగా పొలంలో చల్లుతున్నారు. నారుకు ఊపిరి పోసే ప్రయత్నం చేస్తున్నారు. ఇదీ ఇచ్ఛాపురం మండలంలోని ఈదుపురం, కేశుపురం తదితర గ్రామాల దుస్థితి.



సన్యాసిపుట్టుగలో నారుమడిని బిందెతో తడుపుతున్న దృశ్యం



7 లో

నిఘా నీడలో...

వంశధార రిజర్వాయర్ నిర్మాణ పనులు పోలీసుల రక్షణ వలయంలో చురుగ్గా సాగుతున్నాయి. గురువారం నిర్వాసితులు పనులు అడ్డగించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో శుక్రవారం భారీగా పోలీసు బలగాలు మోహరించాయి. గార్ల పాడు వద్ద గట్టు నిర్మాణ పనులు చేపట్టారు. నిర్వాసితుల నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదురవుతుందని భావించిన పోలీసు ఉన్నతాధికారులు... అటువంటిదేమీ లేకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఎస్పీ త్రివిక్రమవర్మ పనులను పర్యవేక్షించారు.

- హిరమండలం

విశ్రాంతి... వినోదం

జాతీయ రహదారిపై ప్రయాణించే వారు ఇకపై అలసట లేకుండా సాగ వచ్చు. ఎక్కడ బడలిక అనిపిస్తే అక్కడ ఆగిపోవచ్చు. హాయిగా విశ్రాంతి తీసుకొని... ఇష్టమైన వంటకాలు ఆరగించి...ముందుకు వెళ్లవచ్చు. ఈ దిశగా అధికారులు కసరత్తు చేస్తున్నారు.

- జిల్లాలో జాతీయ రహదారిపై మూడు వినోద కేంద్రాలు
- ప్రతి 50కి.మీ.కు ఒకటి
- ఒక్కోదానికి అయిదెకరాల స్థలం
- పార్కింగ్, ఫుడ్‌కోర్టులు



(శ్రీకాకుళం,ఆంధ్రజ్యోతి)

జిల్లాలో జాతీయ రహదారి 193 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. రోజూ వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రయాణ బడలిక తీర్చుకోవడంతో పాటు భోజనం, టిఫిన్ చేసేందుకుగాను వాహన చోదకులు హైవే హోటళ్లు, దాబాలను ఆశ్రయిస్తుంటారు. అటువంటి వారి కోసం ఎన్‌హెచ్ అధికారులు సరికొత్త సౌకర్యాలను అందుబాటులోకి తేనున్నారు. హైవేపై

- మిగతా 14లో

జిల్లా పరిశ్రమల కేంద్రం




గ్రామాల్లో చిన్న రైస్‌మిల్లు పెట్టుకుందామంటే సవాలక్ష అనుమతులు అవసరం. ప్రభుత్వ శాఖల అనుమతులు తెచ్చుకునేందుకు తల ప్రాణం తోకకు వచ్చేది. కొందరైతే సంబంధిత పరిశ్రమల భవన నిర్మాణం పూర్తి చేసుకొని.. సంవత్సరాల తరబడి అనుమతుల కోసం తిరగాల్సి వచ్చేది. ఇదంతా గతం..ప్రస్తుతం ప్రభుత్వం సింగిల్ విండో విధానాన్ని ప్రవేశపెట్టింది. అర్హత ఉన్నవారికి మూడువారాల్లో అనుమతులు మంజూరు చేస్తోంది. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తోంది.


రాయితీ... ఓ బహుమతి

- పరిశ్రమల స్థాపనకు మూడు వారాల్లో అనుమతులు
- సింగిల్ విండో విధానంతో సత్ఫలితాలు
- రికార్డు స్థాయిలో 1,189 పరిశ్రమలకు గ్రీన్‌సిగ్నల్
- చిరు పారిశ్రామికవేత్తలుగా నిరుద్యోగ యువత
- మేలు చేకూర్చుతున్న స్వచ్ఛాంద్ర రాయితీలు

(శ్రీకాకుళం సిటీ)

పారిశ్రామికంగా జిల్లా వెనుకబడి ఉంది. అందుకే ఉద్యోగ, ఉపాధి మార్గాల కోసం యువత సుదూర ప్రాంతాలకు వలసపోతున్నారు.దీనిని గుర్తించిన ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు పరిశ్రమల స్థాపనను ప్రోత్సహిస్తోంది. వీటి - మిగతా 14లో





ప్రేమగా ఓ మొక్క...!

- నూతన జంట వినూత్న కానుక

వివాహ సమయంలో వధూవరులకు బహుమతులు ఇవ్వడం సర్వ సాధారణం. కొన్నిచోట్ల దంపతుల కుటుంబ సభ్యులు అతిథులకు తమకు తోచిన వస్తువులను కానుకలుగా ఇవ్వడమూ పరిపాటే. ఇవన్నీ ఎక్కువగా బంగారం..వెండి...ఇతర వస్తువుల రూపాల్లో ఉంటాయి. ఆ నూతన వధూవరులు మాత్రం వినూత్నంగా ఆలోచించారు. కొత్తబాట నడిచారు. పెళ్లికి వచ్చిన అతిథులకు మొక్కలను కానుకలుగా ఇచ్చారు. నరసన్నపేట మండలం నడగాం పంచాయతీ కొల్లవానిపేటకు చెందిన ఆబోతుల చంద్రబాబునాయుడు, మీనాక్షి శుక్రవారం ఓ ఇంటి వారయ్యారు. బంధు, మిత్రులకు ఈ నూతన జంట ఒక్కో మొక్కను బహూకరించారు. మొక్కలను సంరక్షించి.. పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. చంద్రబాబు ఇండియన్ ఆర్మీలో విధులు నిర్వర్తిస్తున్నారు.

- నరసన్నపేట

పోస్టు మెట్రిక్ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు

జ్ఞానభూమి వెబ్‌సైట్‌లో పేర్ల నమోదు

డీఎస్‌డబ్ల్యూవో పట్నాయక్ వెల్లడి



(గార)

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన జ్ఞానభూమి వెబ్ సైట్‌లో పోస్టుమెట్రిక్ విద్యార్థుల వివరాలను పొందుపరిచి ఇక నుంచి విద్యార్థుల ప్రతినెల స్కాలర్‌షిప్‌లు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా సాంఘిక సంక్షేమాధికారి పీజేఎస్ఎన్ పట్నాయక్ పేర్కొన్నారు. ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ పలు వివరాలు తెలిపారు.

ప్రశ్న: జిల్లాలో విద్యార్థులకు ఇంత వరకు స్కాలర్‌షిప్‌లు ఎలా ఇచ్చేవారు?

జవాబు: జిల్లాలో పోస్టుమెట్రిక్ విద్యార్థులకు ఇంతవరకు ప్రతి ఏడాది స్కాలర్‌షిప్‌లు ఇచ్చేవాళ్లం. అయితే ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన జ్ఞానభూమి సైట్‌లో విద్యార్థుల వివరాలను పొందుపర్చి ఇకనుంచి ప్రతినెల ఉపకారవేతనాలను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఈ మేరకు ఇటీవల ప్రతి రెవెన్యూ డివిజన్‌లోని కళాశాలల్లోని విద్యార్థులకు అవగాహన సదస్సులను నిర్వహించాం.

ప్రశ్న: జిల్లాలో సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఎన్ని వసతిగృహాలు నిర్వహిస్తున్నారు? ఎంత మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు?

జవాబు: జిల్లాలో 26 ప్రిమెట్రిక్ వసతిగృహాలు నిర్వహిస్తున్నాం. ఇందులో 2,900 మంది విద్యార్థులు, 13 పోస్టుమెట్రిక్ వసతిగృహాల్లో 1,800 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు.

ప్రశ్న: జిల్లాలో వసతిగృహ విద్యార్థులకు ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి యూనిఫారాలు, నోట్‌బుక్‌లు పంపిణీ జరిగిందా?

జవాబు: జిల్లాలో వసతిగృహాల విద్యార్థులకు ఈ విద్యా సంవత్సరంలో నాలుగు జతల యూనిఫారాలు, నోట్‌పుస్తకాలు పంపిణీ చేశాం. ఇంకా ఆరు వేల లాంగ్ నోట్ పుస్తకాలు ఇవ్వాల్సి ఉంది.

ప్రశ్న: వసతిగృహ విద్యార్థులకు అందించే సౌకర్యాలు ?

జవాబు: వసతిగృహంలో చదువుతున్న విద్యార్థులకు దుప్పట్లు, కార్పెట్లు అందజేశాం. ప్లేట్లు, గ్లాసులు ప్రతి ఐదేళ్లకొకసారి ఇస్తాం. అలాగే ప్రతినెల విద్యార్థులకు కాస్మొటిక్ బిల్లులు చెల్లిస్తున్నాం.

ప్రశ్న: జిల్లాలో వసతిగృహ విద్యార్థులు గత విద్యా సంవత్సరంలో పదో తరగతిలో సాధించిన ఫలితాలు?

జవాబు: జిల్లాలో గత విద్యా సంవత్సరంలో 792 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షకు హాజరు కాగా వారిలో 772 మంది ఉత్తీర్ణులై 97.47 శాతం ఉత్తీర్ణత సాధించి రాష్ట్రంలో జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది.

ప్రశ్న: జిల్లాలో బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌లో ప్రవేశాలు ఎలా ఉన్నాయి?

జవాబు: జిల్లాలో బెస్ట్ అవైలబుల్ స్కీంలో భాగంగా ఒకటో తరగతిలో 200 మంది విద్యార్థులకు డేస్కాలర్స్‌గా, ఐదో తరగతిలో 250 మంది విద్యార్థులకు హాస్టల్ సౌకర్యంతో వసతి కల్పించే విధంగా చేర్పించడం జరిగింది. వీరిలో ఒకటో తరగతి విద్యార్థికి ఏడాదికి ప్రభుత్వం రూ. 20 వేలు, ఐదో తరగతి విద్యార్థికి రూ.30 వేలు వంతున ఆయా పాఠశాలలకు చెల్లిస్తోంది.

ప్రశ్న: జిల్లాలో సంక్షేమ వసతి గృహాలకు సొంత భవనాలు ఉన్నాయా?

జవాబు: జిల్లాలో ఉన్న అన్ని వసతిగృహాలకు సొంతభవనాలు ఉన్నాయి. శ్రీకాకుళంలో ఉన్న పోస్టు మెట్రిక్ హాస్టల్‌ను అద్దె భవనంలో నిర్వహిస్తున్నాం. దీనికి కూడా సొంత భవనం నిర్మించేందుకు చర్యలు చేపడుతున్నాం.

పంటకు వెలుగు



అన్నదాతకు తీపి కబురు

వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు రాయితీ

ఒక్కో రైతుకు సగటున రూ.70 వేల ఆదా

శ్రీకారం చుట్టిన తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ

(శ్రీకాకుళం సిటీ)

వ్యవసాయ విద్యుత్ సరఫరాకు సంబంధించి ఇప్పటి వరకూ రైతులకు ప్రభుత్వం అనేక రాయితీలు అందజేస్తోంది. వీటితోపాటు తాజాగా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లలో భారీ రాయితీ కల్పించేందుకు నిర్ణయించింది. అందుకు ఇటీవలే మార్గదర్శకాలు జారీ చేసింది. ఇప్పటి వరకూ ఒక వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ పొందడానికి సుమారు రూ.40 వేల నుంచి రూ.45 వేల వరకూ రాయితీ ఉండగా, ప్రస్తుతం అది సుమారు రూ.70వేల నుంచి రూ.80 వేలకు పైగా రాయితీ ఇవ్వాలని నిర్ణయించింది. ఎటువంటి షరతులూ లేకుండా ఎంతమంది రైతులకైనా అందించేందుకు చర్యలు చేపడుతోంది.

రైతుకు రాయితీల పరంపర..

ఇప్పటికే ఎనర్జీ ఎఫిషియన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (ఈఈసీఎల్) తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఈపీడీసీఎల్) సంయుక్తంగా ఐదు హెచ్‌పీ సామర్థ్యం కలిగిన వ్యవసాయ మోటార్లను మార్చే పనులకు శ్రీకారం చుట్టింది. ఏపీ ట్రాన్స్‌కో తాజాగా విద్యుత్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న రైతులకు రాయితీని పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. శ్రీకాకుళం జిల్లాలో మొత్తం 15,300కు పైగా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లున్నాయి. ఇవి కాక మరో 360 వరకూ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. గతంలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఒక రైతుకు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ పొందడానికి దరఖాస్తుదారులు రూ.45 వేలు రాయితీ పోనూ దూరాన్ని బట్టి రూ.25 వేల నుంచి రూ.30 వేలు చెల్లిస్తే సరిపోయేది. ప్రస్తుత నూతన మార్గదర్శకాల ప్రకారం దరఖాస్తు చేసుకున్న రైతుకు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయడంతో పాటు 180 మీటర్ల లైను (సుమారు నాలుగు స్తంభాల లైను) వరకూ ఉచితమేనని ప్రకటించింది. వీటికి సంబంధించి తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. దీని వల్ల రైతుకు సగటున రూ.70 వేల నుంచి రూ.80 వేల వరకూ ఆదా అవుతుంది. అదే సౌరశక్తి కనెక్షన్‌కు ప్రస్తుత అంచనాల ప్రకారం రూ.55 వేల నుంచి రూ.60 వేల వరకూ ఖర్చవుతోంది. పెరుగుతున్న ఖర్చులు, నష్టాల కారణంగా చాలా మంది రైతులు వ్యవసాయం వదిలేస్తున్న తరుణంలో ప్రభుత్వం ఇచ్చిన రాయితీ మార్గదర్శకాల పట్ల రైతులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

గ్రామాల్లో విస్తృత ప్రచారం చేస్తున్నాం..

రాయితీ పెంచుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని పూర్తి స్థాయిలో రైతులకు తెలియజేసేందుకు గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నాం. గతంతో పోల్చుకుంటే ఇది చాలా మంచి అవకాశం. దీని ద్వారా జిల్లాలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశాలున్నాయి. రైతులకు ప్రభుత్వం ఓ సువర్ణావకాశాన్ని కల్పిస్తోంది. దీన్ని అందరూ వినియోగించుకోవాలి.

దత్తి సత్యనారాయణ,
పర్యవేక్షక ఇంజనీర్, ఈపీడీసీఎల్, శ్రీకాకుళం

జీఎస్టీతో.. అక్రమాలకు చెక్..



రైతులను దోచుకునేందుకు వ్యాపారుల ఎత్తుగడ

అప్రమత్తమైన వ్యవసాయ శాఖ

తగ్గిన ఎరువుల ధరలు ప్రదర్శించాల్సిందే

వ్యాపారులకు మార్గదర్శకాలు జారీ

(శ్రీకాకుళం సిటీ)

దేశ వ్యాప్తంగా ఒకే పన్ను (వస్తు సేవల పన్ను) జీఎస్టీ విధానం అమల్లోకి వచ్చిన నేపథ్యంలో కొందరు వ్యాపారులు కొత్త తరహా ఎత్తుగడతో రైతులను దోచుకుంటున్నారు. అసలు ధరెంతో చెప్పకుండా ఇష్టారాజ్యంగా సొమ్ములు గుంజుతున్నారు. దీనిని అరికట్టేందుకు ప్రభుత్వం నడుం బిగించింది. అందుకు ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఎరువుల కొనుగోలు వ్యవహారంలో రైతులు మోసపోకుండా ఉండేందుకు వాటి ధరల పట్టికను బహిరంగంగా ప్రదర్శించాలని ఆదేశించింది. ఈ మేరకు జిల్లా వ్యవసాయశాఖ అధికారుల ద్వారా ఎరువుల వర్తకులకు మార్గదర్శకాలు జారీ చేసింది.

జీఎస్టీని బూచిగా చూపి ధరలు పెరిగాయంటూ కొంత మంది వ్యాపారులు రైతులను దోచుకుంటున్న ఉదంతాలు ప్రభుత్వం దృష్టికి వచ్చాయి. దీంతో వెంటనే మేల్కొని నూతన ప్రణాళికను రూపొందించింది. ఈ మేరకు ఆయా మండల వ్యవసాయాధికారులు వ్యాపారులకు తమ ఆదేశాలను అందజేశారు. దీంతో పాటు వ్యాపారం తీరును రహస్యంగా పరిశీలిస్తున్నారు.

జిల్లాలో ఖరీఫ్ సీజన్ ఆరంభమైన నేపథ్యంలో రైతులకు ఎరువులతో ఎంతో అవసరం ఉంటుంది. పంట వివిధ దశల్లో ఉండడంతో విధిగా ఎరువులను వేయాల్సిన పరిస్థితి ఉంది. జిల్లాలో వరి 2.05 లక్షల హెక్టార్లలోనూ, చెరకు మరో ఏడు వేల హెక్టార్లలోనూ సాగు చేసేందుకు అన్నదాతలు సిద్ధమవుతున్నారు. గత రెండు రోజులుగా కాస్తో కూస్తో వర్షాలు కురవడంతో రైతులు వరినాట్లలో నిమగ్నమయ్యారు. ప్రారంభ దశలో నారుమళ్లలో (ఐదు సెంట్లలో) యూరియా, డీఏపీ, పొటాష్ రెండు కిలోల వంతున వేయాలి. దమ్ములో అయితే ఎకరాకు గాను డీఏపీ గానీ ఎస్ఎస్‌పీ గాని ఒక బస్తా వేయాల్సి ఉంటుంది. అలాగే పొటాష్ 20 కిలోలు వేసుకోవాలి. రెండో దశలో నాట్లు వేసిన 30 రోజుల తర్వాత 25 కిలోల యూరియా వేయాలి. ఎస్ఎస్‌పీ లేదా డీఏపీ అయితే నాట్లు వేసిన పది రోజుల తర్వాత వేయాలి. ఇలా ఎరువుల క్రమం తప్పకుండా వేయటం వల్ల వేళ్లు సక్రమంగా కుదుటపడతాయి. ఇక చిరుపొట్ట దశలో అయితే యూరియా 20 కిలోలు, పొటాష్ 25 కిలోల వంతున పొల్లు గింజలు రాకుండా వేస్తుంటారు. అలాగే నారుమడికి సంబంధించి పొలాల్లో నాటడానికి పది రోజుల ముందు 3జీ గుళికలను కాండం తొలిచే పురుగులను నివారించడానికి రైతులు వేస్తుంటారు.

నిజానికి జీఎస్టీ అమల్లోకి వచ్చిన తర్వాత సగటున రూ.10 నుంచి రూ.15 వంతున హెచ్చుతగ్గుల్లో ఉంది. అయినా ఈ విషయాలపై అవగాహన లేని రైతులను కొంతమంది వ్యాపారులు మభ్యపెట్టి దోచుకుంటున్నారు. దీనిని నివారించేందుకు వ్యాపారుల వద్ద గోదాముల్లో నిల్వ ఉన్న బస్తాలపై పాతధరలతోపాటు జీఎస్టీ తర్వాత అమల్లోకి వచ్చిన ధరలను విధిగా ముద్రించేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఒకవేళ ధర పెరిగినా పాత ధర పక్కనే కొత్తధర విధిగా ముద్రించాల్సి ఉంది. బస్తాలపై ధర తగ్గినా కొత్తధర ముద్రించి విక్రయించాలని ఆదేశించింది. ప్రస్తుతం జిల్లాలో 270కి పైగా ఎరువుల దుకాణాలు ఉన్నాయి. వీటి ద్వారా జరిగే విక్రయాలపై నిఘా ఉంచాలని జిల్లా వ్యవసాయశాఖ, మండల స్థాయి అధికారులను ఆదేశించింది. ప్రస్తు తం అధికారులంతా ఆ పనుల్లో నిమగ్నమై ఉన్నారు.

అవసరమైన చర్యలు చేపడుతున్నాం..

ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతులు ఎటువంటి మోసానికి గురికాకుండా ఆర్థికపరమైన ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. ఇందులో భాగంగానే ఎరువుల దుకాణాల ద్వారా జరిగే విక్రయాల్లో జీఎస్టీ హెచ్చుతగ్గుల గూర్చి స్పష్టమైన ఆదేశాలిచ్చాం. విధిగా బస్తాలపై జీఎస్టీకి ముందు, జీఎస్టీ అమలైన తర్వాత చోటుచేసుకున్న ధరల తేడాలు విధిగా ముద్రించాల్సి ఉంది.

జి. రామారావు, సంయుక్త సంచాలకుడు,
జిల్లా వ్యవసాయశాఖ

బస్సుయాత్రకు అనుమతివ్వండి

అగ్రిగోల్డ్ వెల్ఫేర్ అసోసియేషన్ సంక్షేమ సంఘ అధ్యక్షుడు జయసింహ

ఇచ్ఛాపురం : రాష్ట్ర వ్యాప్తంగా అగ్రిగోల్డ్ బాధితుల జనచైతన్య, రాష్ట్ర వ్యాప్త బస్సుయాత్రను నిర్వహించనున్నారు. ఇచ్ఛాపురం నుంచి ఈ యాత్రను ప్రారంభిస్తున్నారు. అందుకు అనుమతివ్వాలని కోరుతూ జిల్లా అగ్రిగోల్డ్ వెల్ఫేర్ అసోసియేషన్ సంక్షేమ సంఘ అధ్యక్షుడు జయసింహతో పాటు సంఘ నాయకులు టౌన్ ఎస్సై మంగరాజుకు వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం వారంతా పట్టణ పరిధిలోని బాసుదేవ క్వాటర్స్‌లో అగ్రిగోల్డ్ బాధితులతో కలిసి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు జయసింహ మాట్లాడుతూ అగ్రిగోల్డ్ సంస్థ ప్రజలకు మోసం చేసి ఎంతో మంది ఆత్మహత్యకు కారణమయ్యిందన్నారు. ఇంతగా మోసాలకు పాల్పడుతున్న సంస్థపై ప్రభుత్వం ఎటువంటి చర్యలు చేపట్టడం లేదన్నారు. నాలుగు నెలల్లో బాధితులందరికీ పరిహారం చెల్లించి సంబంధిత వ్యక్తులను అరెస్ట్ చేస్తామని, అలాగే చనిపోయిన బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5లక్షల నష్టపరిహారం చెల్లిస్తామని ఆ వివరాలు ఆన్‌లైన్‌లో పెట్టి అందరికీ న్యాయం చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని ఇంత వరకు ఇచ్చిన అమలు చేయలేదన్నారు.


ఎస్ఐకు వినతిపత్రం అందజేస్తున్న అగ్రిగోల్డ్ బాధితులు

రాష్ట్ర కమిటీ నిర్ణయం మేరకు రాష్ట్ర వ్యాప్తంగా బస్సు యాత్ర చేపట్టిందని అందుకు అం దరూ సిద్ధం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు రాష్ట్రప్రధాన కార్యదర్శి పి.గోవిందరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి వెంకటరావు, వెంకటరావు, ప్రసాద్, నారాయణస్వామి, లక్ష్మీనారాయణ, విద్యాదర బెహరా తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో మహిళకు గాయాలు

దేరసాం (రణస్థలం) : మండలంలోని దేరసాం గ్రామానికి చెందిన చందక మహాలక్ష్మి విద్యుత్ షాక్‌కు గురై తీవ్రంగా గాయపడింది. శుక్రవారం ఉదయం ఆమె ఉపాధి పనులకు వెళ్తుండగా పొలంలో తెగిపడి ఉన్న విద్యుత్ తీగను తాకడంతో ఈ ప్రమాదం సంభవించింది. ఆమె వెంట ఉన్న ఉపాధి కూలీలు సకాలంలో స్పందించి, కొండములగాం సీహెచ్‌కు తరలించి వైద్యసేవలు అందించారు.


గాయపడిన మహిళను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

ఎప్పటికప్పుడే విద్యుత్ తీగలు తెగుతున్నాయి

దేరసాం గ్రామం పరిధిలో ఎప్పటికప్పుడే విద్యుత్ తీగలు తెగిపడుతున్నాయని వీటిని ఆ శాఖాధికారులు సవరించడంలో జాప్యం చేయడంతో ప్రమాదాలకు గురౌతున్నామని గ్రామస్థులు వాపోతున్నారు. కొన్ని సంవత్సరాల క్రితం వేసిన వైర్లు కావడంతో ఎప్పటికప్పుడు ఇలా తెగిపడుతున్నాయని వీటిని మార్చాలని విద్యుత్ సిబ్బందికి ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. పొలాల్లో విద్యుత్ లైన్లు వేలాడుతున్నాయని, ఇప్పటికైనా విద్యుత్ లైన్లు సరిచేయాలని రైతులు కోరుతున్నారు.

ఆటోలు ఢీ.. ముగ్గురికి గాయాలు

రాజాం రూరల్: పట్టణంలోని చీపురపల్లి రోడ్డులో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానిక నవదుర్గా ఆలయం వద్ద అమ్మవారిని, గాయత్రీ కాలనీలోని గాయత్రీ దేవిని దర్శించుకునేందుకు రాజయ్యపేట గ్రామానికి చెందిన పడాల సుజాత, కుమార్తె యామిని, గణేష్ తదితరులు ఆటోలో వెళ్తుండగా చీపురపల్లి రోడ్డులో బావిరేతరమ్మ గుడి వద్ద ఎదురుగా వస్తున్న లగేజి ఆటో ఢీకొనడంతో ఈ సంఘటన జరిగింది. ఈ ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని 108 వాహనం ద్వారా స్థానిక సామాజిక ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. వైద్యాధికారులు వైద్య సేవలందించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఢీకొన్న ఆటోలు

గాయపడిన చిన్నారి యామిని

గాయపడిన వృద్ధురాలు మృతి



ఒంటూరు (కవిటి రూరల్): మండలంలోని ఒంటూరు గ్రామ సమీపంలో ఆదివారం జరిగిన ఆటో ప్రమాదంలో గాయపడిన వృద్ధురాలు శుక్రవారం మృతి చెందినట్టు కవిటి ఎస్ఐ పారినాయుడు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒంటూరు గ్రామానికి చెందిన వృద్ధురాలు నాగుల యర్రమ్మ(75) మాణిక్యపురం నుంచి తన సొంత గ్రామం రేషన్ సరుకులు తీసుకొని ఆటోలో ఇంటికి వెళ్తుండగా ఒంటూరు మార్గమధ్యంలో ఆటో అదుపు తప్పి బోల్తా కొట్టింది. ఈ ఘటనలో యర్రమ్మ తలకు తీవ్రంగా గాయాలవ్వడంతో మెరుగైన చికిత్స కొరకు బరంపురం తరలించారు. చికిత్స అనంతరం గురువారం ఒంటూరు తన ఇంటికి చేరుకున్న ఆమె శుక్రవారం ఉదయం మరణించినట్టు ఎస్ఐ తెలిపారు. యర్రమ్మ కుమార్తె సారకామమ్మ ఫిర్యాదు మేరకు ఆటో డ్రైవర్ గొపిల్లి రాజేశ్వరారరావుపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

పురుగు మందు తాగి వ్యక్తి మృతి..

నరసన్నపేట: మండలం పోతయ్యవలస గ్రామానికి చెందిన అరవల రమణమూర్తి (35) పట్టణ శివారు ప్రాంతమైన మోహరాబాబా ఆలయ సమీపంలో పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్న ఆయన ఆర్థిక ఇబ్బందులు తాళ్లలేక గురువారం రాత్రి పురుగులు మందు తాగి మృతి చెందాడు. శుక్రవారం ఉదయం వాకింగ్‌కి వెళ్లున్న వారు గుర్తించి స్థానిక పోలీసులకు సమాచారం అందజేశారు. భర్త మృతి చెందడంతో భార్య జయలక్ష్మి కన్నీరుమున్నీరుగా విలపించింది. రమణమూర్తికి ఇద్దరు పిల్లలున్నారు. భార్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ లక్ష్మణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


పురుగు మందు తాగి మృతి చెందిన రమణమూర్తి

సారాతో ఇద్దరి అరెస్టు

సోంపేట : నాటు సారా తరలిస్తున్న ఇద్దరిని ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. వివరాలిలా.. కంచిలి మండలం ఏఎస్‌పల్లికి చెందిన జోగ దీనయ్య, బొండాడ మోహిని 400 లీటర్ల నాటు సారా ప్యాకెట్లను తరలిస్తుండగా ఎక్సైజ్ సీఐ అబ్దుల్ ఖలీమ్ వారిని అదుపులోకి తీసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటు సారా తయారు చేసినా, తరలించినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ దాడుల్లో ఎస్ఐ కె.అప్పలస్వామి సిబ్బంది పాల్గొన్నారు.


నిందితులతో ఎక్సైజ్ సిబ్బంది

నాణ్యత లోపిస్తే చర్యలు :ఆర్డీవో

మందస: మందస తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణాన్ని శుక్రవారం టెక్కలి ఆర్డీవో ఎం.వెంకటేశ్వరరావు పరిశీలించారు. రూ. 60లక్షలతో నిర్మిస్తున్న పనుల్లో నాణ్యతలోపిస్తే చర్యలు తీసుకుంటా మని హెచ్చరించారు. సెప్టెంబర్ నెలాఖరులోగా పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆయనతో పాటు ఎఈలు సురేష్, బి.వెంకట్రావు, సర్వేయర్‌శ్రీనుబాబు ఉన్నారు.



పనులను పరిశీలిస్తున్న వెంకటేశ్వరరావు



జింక్ సల్ఫేట్ పంపిణీ చేస్తున్న ఎంపీపీ

జింక్ సల్ఫేట్ పంపిణీ

మందస: స్థానిక వ్యవసాయ కార్యాలయంలో రైతులకు జింక్ సల్ఫేట్‌ప్యాకెట్లను ఎంపీపీ దాసరి జయలక్ష్మి శుక్రవారం పంపిణీ చేశారు. ఈ కార్య క్రమంలో వ్యవసాయాధికారి కిల్లి పోలారావు, జడ్పీటీసీ సభ్యురాలు సవర కుమారి, లఖియా, టీడీపీమండలాధ్యక్షుడు డి.తాతారావు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ దొంకూరు తిరుపతిరావు పాల్గొన్నారు.

రుణాలు వినియోగించుకోండి

మందస: ప్రభుత్వం మంజూరు చేసిన రుణాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో పి.చంద్రకుమారి పిలుపునిచ్చారు. మందస మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం బీసీ, ఎస్సీ, ఎస్టీ, కాపు కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ ఇంటర్వ్యూలకు 671 మంది నిరుద్యోగ యువత దరఖాస్తు చేసుకోగా, ఇంటర్వ్యూలకు 460 మంది హాజరయ్యారు. 243 యూనిట్లు లక్ష్యంగా ఎంపిక చేయనున్నట్లు ఎంపీడీవో తెలిపారు. రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు బ్యాంకుల నుంచి విల్లింగ్‌తో పాటు ఇతర దరఖాస్తులను జత చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ దాసరి జయలక్ష్మి, జడ్పీటీసీ సభ్యురాలు సవర కుమారి, లఖియా, ఏపీఎం లలిత, సాక్షరభారత్ కోఆర్డినేటర్ ఎంసీహెచ్ శ్రీనివాసరావు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ దొంకూరు తిరుపతి, టీడీపీ మండలాధ్యక్షుడు దాసరి తాతారావు, ఈవోపీఆర్డీ బి.రాజేశ్వరరావు పాల్గొన్నారు.

చతికిలపడిన సేంద్రియ సాగు

● నిలిచిపోయిన ఎన్‌పీఎం పథకం ● విచ్చలవిడిగా రసాయన ఎరువుల వినియోగం
● ప్రభుత్వ ప్రోత్సాహం కరువు ● ఇదీ పలాస నియోజకవర్గంలో దుస్థితి



వేప కషాయం తయారు చేస్తున్న రైతు

సేంద్రియ ఎరువులతో సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహం లేక చతికిలబడుతోంది. దీంతో ప్రజారోగ్యం దెబ్బతినడంతోపాటు రసాయన ఎరువుల వాడకంతో ఆర్థికంగా నష్టాలను చవిచూస్తున్నారు. సేంద్రియ సాగుకు చేయూతనందిస్తున్న ఎన్‌పీఎం పథకం నిలిపివేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

హరిపురం:పదేళ్ల కిందట సేంద్రియ సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం నాన్ పెస్టిసైడ్స్ మేనేజ్ మెంట్ (ఎన్‌పీఎం) పథకాన్ని ప్రవేశపెట్టింది. జిల్లా వ్యాప్తంగా 23 మండలాలను ఎంపికచేశారు. దీంలో భాగంగా పలాసనియోజకవర్గం పరిధిలో పలాస, మందస, వజ్రపుకొత్తూరు మండలాల్లో 11 మంది సీఏలు, 52 మంది వీఏలను నియమించారు. సీఏలకు నెలకు రూ.నాలుగు వేలు, వీఏలకు నెలకు రూ.1000 చొప్పున వేతనం చెల్లించేవారు. వీరు గ్రామస్థాయిలో సేంద్రియ సాగుపై రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చేవారు. ప్రస్తుతం పథకం నిలిపివేయడంతో సేంద్రియ సాగు చితికిల పడింది. దీంతో రైతులు అధిక దిగుబడులు సాధించ చేందుకు, పంటలను చీడ పీడలను నుంచి రక్షించడానికి రైతులు విచ్చలవిడిగా రసాయన ఎరువులు, పురుగు మందులు వాడుతు న్నారు. ఆహారోత్పత్తుల్లో రసాయన అవశేషాలు ఎక్కువ మోతాదులో ఉండడంతో వాట్ని తిన్నవారికి అనా రోగ్య సమస్యలు తలెత్తు తున్నాయి. దీంతో పాటు వీటి వాడకం వల్ల భూసారం దెబ్బ తింటోంది. ఇప్పటికైనా వ్యవసాయ శాఖ అధికారులు ఎన్‌ఎంపీఎం పథకాన్ని పునరుద్ధరించి సేం ద్రియ సాగుకు ప్రోత్సహించాలని ఉద్దానం ప్రాంతంలోని రైతులు కోరుతన్నారు.

> **రసాయన ఎరువుల వల్ల**
> రసాయన ఎరువులు ఎక్కువగా వినియోగించడం వల్ల కాలేయం సమస్య ఏర్పడుతుంది. కంటి చూపు మందగించడం, గుండె పనితీరుసక్రమంగా లేకపోవడం, నరాల బలహీనత, కిడ్నీ సమస్యలు, చర్మ వ్యాధులు, ఊపిరి తిత్తుల సమస్య వంటివి ఏర్పడతాయని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు.

గతంలో సాగుచేసే ప్రాంతాలు

మందస మండలంలో బుడార్సింగి, దేవపురం, చీపి, హొన్నాళి పలాస మండలంలో మరదరాజపురం, బొడ్డపాడు, వజ్రపుకొత్తూరు మండలంలోని అమలపాడు, రాజాం, పీఎంపురం వంటి పలుగ్రామాల్లో కూరగాయలు, వాణిజ్య పంటలు గతంలో సాగుచేసేవారు. ప్రస్తుతం పథకం నిలిపివోవడంతో ఆయా పంటల సాగును రైతులు నిలిపేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సేంద్రియసాగుకు ప్రభుత్వం చేయూత అందించి ప్రోత్సాహం చాలని పలువురు రైతులు కోరుతున్నారు.

సేంద్రియ సాగుపై...



లాభాల బాటలో రైతులు పయనించేలా సేంద్రియ సాగుపై అవగాహన కల్పించాలి. రసా యన ఎరువులకు బదులు సేంద్రియ ఎరువులు వాడేలా రైతులను ప్రోత్సహించాలి. నాణ్యమైన పంట దిగుబడి సాధించేలా రైతులు ముం దుకుసాగాలి. ఆరోగ్యకర పంటలను పం డించే రైతులకు సేంద్రియ సాగుపై అవగాహన సదస్సులు నిర్వహించి, రాయితీలు ప్రకటించాలి.

-మామిడి తాతారావు, రైతు, వీరభద్ర

అవగాహన కల్పించాలి



సేంద్రియ సాగుతో మంచి ఫలితాలు సాధించాం. ఆవు, మూత్రం, పేడ, వేప కషాయం, వెల్లుల్లి, లవంగాలు తదితర వాటితో సేంద్రియ సాగు చేయ వచ్చు. పండించిన పంటకు మంచి ధర లభిస్తుంది. ప్రస్తుతం పథకం నిలిపివేయడంతో సలహాలు, సూచనలిచ్చే నాథుడే కరువయ్యాడు.స్థానికంగా అధికారులు అవగాహన కల్పిస్తే మంచి ఫలితాలు వస్తాయి.

-రట్టి లింగరాజు, మందస

ఉప్పు నీటితో శుద్ధి చేయాలి..



కూరగాయలను వేడినీళ్లతో ఉడికించి ఉప్పు నీటిలో కడగాలి. ఇలా చేస్తే హాని చేసే కొద్దిపాటి మందుల ప్రభావం తగ్గుతుంది. ముందుగా కాలేయం, తర్వాత కిడ్నీ, గుండె తదితర ప్రధాన అవయవాలపై తీవ్ర ప్రభావం చూపు తుంది. వ్యాధులు వచ్చిన తర్వాత కంటె రాకముందే జాగ్రత్తలు తీసుకుంటే ఎంతో ఉత్తమం.

-సూర్యకళ, హెల్త్ ఎడ్యుకేటర్, సిరిపురం

తక్కువ ఖర్చుతో అధిక లాభాలు



సేంద్రియఎరువులతో సాగుచేసే రైతులకు.. ఎంతో ప్రయోజనకరం. తక్కువ ఖర్చుతో అధిక లాభాలు పొందవచ్చు.30 కోడి గుడ్లు పింగాణీపాత్రలో వేసి దానిలో సరిపడా నిమ్మ రసంవేయాలి. పది రోజుల తర్వాత నిమ్మరసంలో కోడిగుడ్లు పగులకొట్టి కలిపిన మిశ్రమాన్ని పిచికారి చేస్తే పూత పిందె నిలబడుతుంది. ఈ మిశ్రమంనాలుగు ఎకరాలకు వస్తుంది.

కె.పోలారావు, ఏవో, మందస

పెద్ద లింబుగాంలో సమస్యల తిష్ట

● తాగునీటికి బేజారు
● కాలువలులేక రోడ్డుపైనే మురుగు

హరిపురం:మందస మండలంలోని అంబుగాం పంచాయతీ పరిధిలో గల పెద్ద లింబుగాంలో సమ స్యల తిష్ట వేశాయి. మండల కేంద్రానికి సుదూరంలో ఉన్న గ్రామంలో190 నివాస గృహాలు ఉండగా, అందుకు తగ్గ రోడ్లు తదితర వసతులు కొరవడ్డాయి. కాలువలు లేకపోవడంతో వీధుల మధ్య మురుగునీరు నిల్వఉండడంతో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయని పలువురు వాపోతున్నారు. దీంతో వ్యాధులు ప్రబలుతాయోమనని గ్రామస్థులుఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే గ్రామంలో కిడ్నీ వ్యాధి ప్రబలి పదిమంది మృత్యువాత పడగా మరో ఆరు గురు మృత్యువుతో పోరాడుతున్నారు. కిడ్నీవ్యాధితో ఓ పదేళ్ల బాలిక కూడా బాధపడుతుండడంతో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. ఉద్దానం ప్రాజె క్టు నుంచి తాగునీరు అందకపోవడంతో పాటు గ్రామంలోని బోర్లు పనిచే యక బిందెడు నీటికోసం నదీ చెలమలు, వ్యవసాయ బోర్లపై ఆధారపడు తున్నారు.గ్రామంలోని బోర్లు ఉన్న కొంతమంది నుంచి బిందె నీరు రూ.20 చొప్పున కొనుగోలు చేస్తున్నామని పలువురు వాపో తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తమ గ్రామాభివృద్ధికి చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు, పలువురు మహిళలు కోరుతున్నారు.





గ్రామంలో నిల్వఉన్న మురుగునీరు

సదుపాయాలకు నోచుకోక..



పదేళ్లుగా రాజకీయ వివక్షకు గురై గ్రామంలో కనీస సదుపాయాలకు నోచుకోలేదు. దీంతో కనీసం వీధుల మధ్య మురుగు కాలువలు లేవు. తాగునీటి సదుపాయం లేదు. గ్రామానికి వచ్చే రహదారి అధ్వానంగా ఉంది. రోడ్డుపై ఇసుక మేటలు వేయడంతో ద్విచక్రవాహనాలు అవస్థలు పడుతున్నారు.ప్రస్తుతం ఎమ్మెల్యే శివాజీపైనే గ్రామస్థులంతా ఆశలు పెట్టుకున్నాం. సమస్యలపై ఇప్పటికే నివేదించాం.. అభివృద్ధి పనులు చేపట్టి ఆదర్శ గ్రామంగా మార్చాలని కోరుతున్నాం.

-మండల లచ్చయ్య, ఎంపీటీసీ మాజీ సభ్యుడు లింబుగాం



మందసలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీడీవో ,ఎంపీపీ

మరుగుదొడ్డి నిర్మించుకోండి: ఎంపీడీవో

మందస: ప్రతిఇంటా మరుగుదొడ్డి నిర్మించుకో వాలని ఎంపీపీ దాసరి జయలక్ష్మి, ఎంపీడీవో పి.చంద్రకుమారి తెలిపారు. శుక్రవారం మందస మెయిన్‌రోడ్డులో బహిరంగ మలవిసర్జన విముక్తి వారోత్సవాల పురస్కరించుకొని ర్యాలీ నిర్వహించా రు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిశుభ్రవాతావరణానికి చేయూతనివ్వాలన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు సవర కుమా రి, టీడీపీ మండలాధ్యక్షుడు దాసరి తాతారావు, ఎంపీటీసీ సభ్యుడు మురళీకృష్ణ పాల్గొన్నారు.

15న ప్రతిభా పురస్కారాలు ప్రదానం

పలాస: కాశీబుగ్గలో కళింగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పలాస నియోజకవర్గానికి సంబంధించి అన్ని కులాల వారికి ప్రతిభా పురస్కారాలు ఈనెల 15న అందజేస్తున్నామని ఆ సంఘ నాయకులు డాక్టర్ దువ్వాడ జీవితేశ్వరరావు, హనుమంతు రామ్మోహన్‌దొర, మెట్ట కుమారస్వామి తెలిపారు. ఇటీవల మెడిసిన్, ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన విద్యార్థులకు పురస్కారాలు అందజేస్తే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సివిల్ టాపర్ రోణంకి గోపాలకృష్ణ హాజరవుతారని పేర్కొన్నారు.

రుణాలకు ఇంటర్వ్యూలు

పలాస:స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సబ్సిడీ రుణాల కోసం శుక్రవారం ఎంపీడీవో పి.సూర్యనారాయణ అధ్యక్షతన ఇంటర్వ్యూలు నిర్వహించారు. పలాస మండలం నుంచి 400 మంది దరఖాస్తు చేసుకోగా, వారి దరఖాస్తులు స్క్రూట్నీ చేసి లబ్ధిదారులను ఎంపిక చేశారు.కార్యక్రమంలోఎంపీపీ కొయ్యి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



రుణమేళాలో దరఖాస్తులు పరిశీలిస్తున్న అధికారులు

హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించండి

- కిడ్నీ వ్యాధిమూలాలు శోధించండి
- న్యూడెమోక్రసీ నాయకుల డిమాండ్

సూదికొండకాలనీ(పలాస):ఉద్దానం ప్రాంతంలో ప్రతిరోజూ నలుగురు వరకు మృత్యువాత పడుతున్నారని, యుద్ధప్రాతిపదిక ప్రభుత్వం స్పందించి హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి పైల చంద్రమ్మ, రైతుకూలీ సంఘం నాయకుడు వంకల మాధవరావు ప్రభుత్వానికిడిమాండ్‌చేశారు. శుక్రవారం సూదికొండకాలనీ న్యూడెమోక్రసీ కార్యాలయంలో వారు విలేఖరులతో మాట్లాడుతూ కిడ్నీ వ్యాధిమూలాలు కనుగొనడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. రెండున్నర దశాబ్దాలుగా ఉద్దానాన్ని పట్టి పీడిస్తున్న కిడ్నీ వ్యాధి సమస్యను పరిష్కరించడంతో పాటు వాటి మూలాలు శోధించాలని డిమాండ్ చేశారు.ఉద్దానం ప్రాంతంలో గల ఏడు మండలాల్లో కిడ్నీ వ్యాధిగ్రస్థులు ఉన్నారని తెలిపారు.ఈ ప్రాంతాల్లో ప్రతిరోజూ నలుగురు వరకు మృత్యువాత పడుతున్నారని, యుద్ధప్రాతిపదిక ప్రభుత్వం స్పందించి హెల్త్ ఎమర్జన్సీని ప్రకటించాలని డిమాండ్‌చేశారు. తమ సంఘం ఆధ్వర్యంలో నాలుగు మండలాల్లో 12 గ్రామాల నుంచి నీటి నమూనాలు తీసుకెళ్లి హైదరాబాద్ ల్యాబ్‌కు అందించామని తెలిపారు. ప్రభుత్వం తక్షణం స్పందించి కిడ్ని వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు జె.వీరాస్వామి, ఎం.వినోద్, వి.పాపయ్య, ఎం.తాతారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పైల చంద్రమ్మ, మాధవరావు

రేపు కిడ్నీ వ్యాధిపై చర్చ

పలాస: కాశీబుగ్గ జడ్పీ హైస్కూల్‌లోఉద్దానంలో కిడ్నీ వ్యాధులు, కుటుంబాల పై వాటి ప్రభావం-ప్రభుత్వాల బాధ్యత అనే అంశంపై ఆదివారం ఉదయం 10గంటల నుంచి చర్చాగోష్టి నిర్వహించనున్నట్లు సామాజిక అధ్యయన వేదిక ఒక ప్రకటనలో తెలిపింది. ఆ సంఘ అధ్యక్షుడు వంకల రాజారావు అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి వైద్యులు ఎం.మల్లేశ్వరరావు, వై.కృష్ణమూర్తి, ఎం.ఖగేశ్వరరావు హాజరుకానున్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ కణితి విశ్వనాథం

బీజేపీ బలోపేతానికి చర్యలు

మాజీ ఎంపీ డాక్టర్ కణితి విశ్వనాథం

పలాస:జిల్లాలో బీజేపీ బలోపేతానికి చర్యలు తీసుకుంటున్నామని మాజీ ఎంపీ డాక్టర్ కణితి విశ్వనాథంతెలిపారు. శుక్రవారం పలా సలో బీజేపీ కార్యకర్తలతో జరిగిన సమా వేశంలో మాట్లాడుతూ కేంద్రమంత్రి సురేష్‌ప్రభును తాము ఢిల్లీలో కలుసుకొని, పలాస రైల్వేస్టేషన్ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని, ఒకటో నెంబర్ ఫ్లాట్‌ఫారం టిక్కెట్ కార్యాలయం వద్ద ఏర్పాటుచేయాలని కోరామన్నారు. దీనిపై ఆయన వెంటనే ఈస్ట్‌కోస్ట్ రైల్వే జీఎంతో ఫోన్‌లో మాట్లాడారని తెలిపారు. జిల్లాలో అధికంగా సభ్యత్వాలు నమోదు చేయ డానికి చర్యలు తీసుకుంటున్నామని, తమ పార్టీ అధ్యక్షుడు అమిత్‌షా పలాసలో పర్యటించే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. రానున్న ఎన్నికల్లో ఎంపీ స్థానంతోపాటు అన్ని అసెంబ్లీ స్థానాలకు పోటీ చేస్తామని చెప్పారు. కాశీబుగ్గ ఎల్‌సీ గేటు వద్ద అండర్‌పాసేజ్ నిర్మించాలని స్టేషన్‌మేనేజర్‌కు బీజేపీ నాయకులు వినతిపత్రం సమర్పించారు. సమావేశంలో ఆ పార్టీ నాయకులు పి.వైకుంఠరావు, కె.బాలకృష్ణయాదవ్, కంచరాన బుజ్జి, కె.భాస్కరరావు, సీరపు జోగారావు, కేపీ రామన్నతో పాటు ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సీబీసీఎస్‌పై అవగాహన

పలాస:పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాల కళాశాలలో సీబీసీఎస్‌పై కౌన్సిలర్లకు శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా జూనియర్ కళాశాల అధ్యయన కేంద్రం ప్రిన్సిపాల్ ఎం.రాజగోపాలరావు, సమన్వయకర్త పి.గోవిందరావు మాట్లాడుతూ విజ్ఞానంతో పాటు ఉపాధి అవకాశాలకు అందిపుచ్చుకునే, విద్యార్థులకు ఉపయుక్తంగా ఉండేలా అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం 2017-18 సంవత్సరం నుంచి సెమిస్టర్ విధానం అమలు చేస్తుందని తెలిపారు. గతానికి భిన్నంగా డిగ్రీ ప్రథమ సంవత్సరంలో బీఏ, బీఎస్సీ, బీకాం సబ్జెక్టులను ఎంచుకోవాలని, సెమిస్టర్ విధానం వల్ల విద్యార్థులకు సిలబస్ తగ్గుతుందని తెలిపారు. ఈ ఏడాది డిగ్రీలో చేరేందుకు గడువు ఈ నెల 24వ తేదీ వరకు ఉందని చెప్పారు.

ఒత్తిడిని జయిస్తేనే విజయం

కుంటికోట(హరిపురం):ప్రతి ఉద్యోగి విధి నిర్వహణలో ఒత్తిడిని జయిస్తేనే విజయం సాధించవచ్చని బీఎస్ఎన్ఎల్ అడిషనల్ డివిజనల్ ఇంజనీర్, యోగగురువు ఎంవీ రామారావు తెలిపారు. మందస మండలంలోని కుంటికోటలోని వైటీసీలో గురువారం బీసీ సంక్షేమశాఖ వసతిగృహ వార్డెన్ల శిక్షణ కార్యక్రమంలో జిల్లా సంక్షేమశాఖ అధికారి పీజేఎస్ఎన్ పట్నాయక్ ఉపకారవేతనాలు, ఆన్‌లైన్ విధానం గురించి వివరించారు. విద్యార్థుల ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను మందస వైద్యాధికారి టి.పాపినాయుడు, పర్సనాలిటి డెవలప్‌మెంట్‌పై ఐతమ్ డీన్, హెచ్ఆర్‌డీ రిసోర్స్ పర్సన్ డాక్టర్ డిజవిష్టుమూర్తి తెలియజేశారు.కార్యక్రమంలో జిల్లా హెచ్ఆర్‌డీ మే నేజర్ మోహనరావు, వైటీసీ మేనేజర్ రామునాయుడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రామారావు

వైసీపీ బూత్ కమిటీల ఏర్పాటు

సున్నాడ(పలాస):సున్నాడ, లొద్దభద్రల్లో వైసీపీ బూత్ కమిటీలను శుక్రవారం ఏర్పా టుచేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ కొయ్యి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైసీపీ విజయమే ధ్యేయంగా కార్యకర్తలను సమాయత్తపరుస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పైల వెంకటరమణ,సాయికృష్ణ, మాధవరావు పాల్గొన్నారు.

రైతుల సమస్యలకు సత్వర పరిష్కారం

తహసీల్దార్ శ్యామసుందరరావు

బీఎస్‌పురం(హరిపురం):ప్రభుత్వం ఏర్పాటుచేసిన రెవెన్యూ సదస్సుల్లో రైతులకు సత్వర పరిష్కారం లభిస్తుందని తహసీల్దార్ డి.శ్యామసుందరరావు తెలిపారు. మందస మండలంలోని బీఎస్‌పురం, రాధాకృష్ణాపురం, కిల్లోయి, కొంకడాపుట్టి రెవెన్యూ సబ్‌డివిజన్ గ్రామాల్లో శుక్రవారం రెవెన్యూ సదస్సులను ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్ఐలు అమర్‌నాథ్, సునంద, సర్పంచ్‌లు మాలత మురళి, రట్టి సరస్వతి, ఎంపీటీసీలు నాగేశ్వర బృందావన్, బేపల సుహాసని, అప్పలస్వామి, తిరుపతిరెడ్డి, ఉద్యానవన శాఖ అధికారులు ఉమాభరణి, శంకరరావు, ఏవో పోలారావు, ఉదయ్, వీఆర్వోలు రాంబాబు, గోవిందరావు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులు వినియోగించుకోండి

పూజారివీధి(పలాస):రెవెన్యూ సదస్సులు వినియోగించుకోవాలని తహసీల్దార్ కళ్యాణచక్రవర్తి కోరారు. శుక్రవారం పలాస పూజారివీధి మండపంలో జరిగిన రైతుసేవలో రెవెన్యూశాఖ కార్యక్రమంలో రైతుల నుంచి పట్టాదారుపాసుపుస్తకాలు, టైటిల్‌డీడ్లకు వినతిపత్రాలు స్వీకరించి కంప్యూటీకరణ చేశారు. సమావేశంలో ఆర్ఐ వి.గిరిరాజు, వీఆర్వోలు పండా, సింహాచలం, నాయుడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్యామసుందరరావు

ఎమ్మెల్యే టూర్

పలాస ఎమ్మెల్యే గౌతు శివాజీ శనివా రం ఉదయం 8.30గంటలకు సోంపేట అమ్మవారి ఆలయంలో, 10.15గంటలకు పలాస రైల్వే స్టేషన్‌లో వైఫే ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు.

చంద్రబాబును జగన్ విమర్శించడం తగదు

హుకుంపేట(పూండి):వైసీపీ అధినేత జగన్మోహనరెడ్డి తీవ్రవాదిలా పేట్రెగిపోతున్నారని టీడీపీ రాష్ట్ర బీసీసెల్ కార్యదర్శి డాక్టర్ దున్న కృష్ణారావు విమర్శించారు. శుక్రవారం హుకుంపేటలో పల్లివూరు పంచాయతీ టీడీపీ అధ్యక్షుడు నూకల తులసీరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు అహర్నిశలు శ్రమిస్తుంటే అవగాహనలేమితో జగన్ విమర్శించడం తగదన్నారు. సమావేశంలో మాజీ సర్పంచ్ సూరాడ పెంటయ్య, టీడీపీ ప్రతినిధి బి.భాస్కరరావు, అమర ముసలయ్య, కొమర రాములు, కొమర పెద్దయ్య, కొమర ముసలయ్య, వంక రామారావు, చిన్నరాజులు, కొమర పేరయ్య, వంక నీలయ్య, వంక కామయ్య సత్తిరాజు, పెద్ద వెంకటయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

పలాస:కాశీబుగ్గ మేధా కళాశాలలో విద్యార్థులకు పలాస స్టేట్‌బ్యాంకు ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ ఇప్సిత మాట్లాడుతూవిద్యార్థుల్లో నైపుణ్యతను వెలికితీసే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ చాపర వేణుగోపాల్, ప్రిన్సిపాల్‌చంద్రశేఖరరావు, ఫీల్డ్‌ఆఫీసరు చారుబాలమతి, బ్రాంచ్ కార్యదర్శి వరప్రసాద్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన అవసరం

వజ్రపుకొత్తూరు: పర్యావరణ పరిరక్షణతోపాటు పారిశుధ్య నియమాలు పాటించడంలో విద్యార్థులు పూర్తి స్థాయి అవగాహన కలిగి ఉండాలని ఎంపీపీ వసంతరావు తెలిపారు. స్వచ్ఛభారత్ మిషన్-గ్రామీణ్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం వజ్రపుకొత్తూరు పాఠశాల ఆవరణలో విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమణయ్య, ఎంపీడీవో తిరుమలరావు, ఎంఈవో కృష్ణప్రసాద్, పాఠశాల హెచ్ఎం సారధి నాయుడు, ఈవో ఐవీ.రమణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ వసంతరావు

వ్యక్తిగత వివరాలు నమోదు చేయండి

వజ్రపుకొత్తూరు: సీఆర్‌టీలు, పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్లు వ్యక్తిగత వివరాలు ఆన్‌లైన్‌లో మూడురోజుల్లో అమలు చేయాలని ఎంఈవో కృష్ణప్రసాద్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం వజ్రపుకొత్తూరులోని ఎంఆర్‌సీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి హెచ్ఎంలు సహకరించాలని కోరారు. మండలానికి మంజూరైన 6,503 భోజనప్లేట్లను స్వాతంత్ర్యదినోత్సవం తర్వాత అందజేస్తామని తెలిపారు.

సినిమాలు

పలాస- కాశీబుగ్గ
హరిశంకర్--ఫిదా
రవిశంకర్-నక్షత్రం
భాస్కరరామ-
జయజానకి నాయక
శ్రీవెంకటేశ్వర-
నేనే రాజు నేనే మంత్రి
అన్నపూర్ణ-లై

మందస
మహేంద్ర...లై

ఎంపీహెచ్‌డబ్ల్యూ (ఎఫ్) శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానం

సీతంపేట: విశాఖపట్నం జిల్లా పాడేరులో నిర్వహిస్తున్న ఎంపీహెచ్‌డబ్ల్యూ పాఠశాలలో శిక్షణ పొందేందుకు 2017-18 సంవత్సరానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎం.రోజారాణి ఒక ప్రకటనలో శుక్రవారం తెలిపారు. ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులై, 17 ఏళ్లు నిండిన గిరిజన మహిళా అభ్యర్థులు కోర్సులో శిక్షణ పొందడానికి అర్హులని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో ఈనెల21లోగా దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకోసం 08 941258535కు సంప్రదించాలని కోరారు.

15లోగా ఇన్‌స్పైర్ అవార్డులకు...

డేఅండ్ నైట్‌జంక్షన్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల్లో గల ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఆరు నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఇన్‌స్పైర్ అవార్డులకు ఆన్‌లైన్‌లో ఈనెల 15వతేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి ఆబోతుల ప్రభాకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. 2016-17 విద్యాసంవత్సరంలో దరఖాస్తు చేయని విద్యార్థులు 2017-18 విద్యాసంవత్సరంలో దరఖాస్తుచేసుకోవాలని సూచించారు. ఇప్పటివరకు నమోదు చేసుకోని పాఠశాల ప్రధానోపాధ్యాయులు యుద్ధప్రాతిపదికన నమోదుచేసుకోవాలని, లేకపోతే చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. సంబంధిత ప్రాజెక్ట్ విషయాన్ని సంక్షిప్తంగా వర్డ్ లేదా పీడీఎఫ్ ఫార్మెట్‌లో ఆన్‌లైన్ దరఖాస్తుతోపాటు పొందుపరచాలని పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయులు, ఉపవిద్యాశాఖాధికారులు, మండల విద్యాశాఖాధికారులు పాఠశాలల రిజిస్ట్రేషన్‌పై తగు శ్రద్ధ వహించాలని తెలిపారు.

ఇసుక ధరలు ఖరారు

మంత్రి సుజయ్ కృష్ణ రంగారావు

అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా ఇసుక ధరలను ఖరారు చేశామని మంత్రి సుజయ్ కృష్ణ రంగారావు చెప్పారు. లోడింగ్ .. రవాణా ఛార్జీలను కలుపుకుని ఖరారు చేసిన ఈ ధరల కంటే ఎక్కువ చెల్లించాలని ఎవరైనా డిమాండ్ చేస్తే పరిష్కార వేదిక టోల్ ఫ్రీ నంబరు 1100కు ఫోన్ చేయాలని ప్రజలను కోరారు. అధిక మొత్తాన్ని డిమాండ్ చేస్తే రెండేళ్ల జైలు .. రెండు లక్షల రూపాయల దాకా జరిమానా వేస్తామని హెచ్చరించారు. రాష్ట్రంలో 294 ఇసుకరీచ్‌లు పనిచేస్తున్నాయని.. మరో 186 రీచ్‌లను ఇతర కారణాలతో మూసివేశామని సుజయ్ వివరించారు. రాష్ట్రంలోని వివిధ రీచ్‌లలో 1,45,40,723 క్యూబిక్ మీటర్ల ఇసుక అందుబాటులో ఉందని .. ఇందులో 68,58,545 క్యూబిక్ మీటర్లను ఉచిత ఇసుక విధానం కింద వినియోగించుకోవచ్చని మంత్రి చెప్పారు

ప్రాంతం	ట్రాక్టర్ ఇసుకధర
శ్రీకాకుళం	- 1330
ఆమదాలవలస	1330
ఎచ్చెర్ల	1350
రణస్థలం	1400
రాజాం	1400
నరసన్నపేట	1330
పాలకొండ	1400
టెక్కలి	1400
పలాస	1400
సోంపేట	1339
హిరమండలం	1330
ఇచ్ఛాపురం	1330

బోదర సర్పంచ్ బీజేడీలో చేరిక

పర్లాకిమిడి: కాశీనగర్ సమితి కేంద్రంలోని బిజూ కళ్యాణమండపంలో మాజీ ఎమ్మెల్యే కె.నారాయణ రావు సమక్షంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీకి చెందిన బోదర పంచాయతీ సర్పంచ్ అంబికాప్రదాన్ తన అనుచరులతో శుక్రవారం బీజేడీలో చేరారు.ఈ సందర్భంగా బీజేడీ జిల్లా అధ్యక్షుడు ప్రదీప్‌నాయక్ మాట్లాడుతూ వీరి చేరికతో కాశీనగర్ సమితిలో పార్టీకి మరింత బలం చేకూరిందన్నారు. సీఎం నవీన్ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు నచ్చి బీజేడీలో చేరినట్లు వారు తెలిపారు. వార్డు సభ్యుడు బినాయక్‌ప్రదాన్,వాసుచౌదరి, గవర భూషణ, బిసాయిశ్రీను పలువురు కాంగ్రెస్ నాయకులు బీజేడీలో చేరారు. ఈ కార్యక్రమంలో కాశీనగర్ సమితి అధ్యక్షుడు సీహెచ్.సింహాద్రి, బీజేడీ జిల్లా యువజననాయకుడు కృష్ణ, కాశీనగర్ సమితి అధ్యక్షుడురామ్‌ప్రకాశ్,దారపు చిట్టి, సమితిలోని సర్పంచ్‌లు,కార్యకర్తలు పాల్గొన్నారు.



బీజేడీలో చేరిన కాంగ్రెస్ కార్యకర్తలు

వెంకయ్యనాయుడుకు అభినందన

పర్లాకిమిడి:ఉపరాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టిన ముప్పవరపు వెంకయ్యనాయుడుకు అభినందిస్తూ లేఖ రాసినట్లు ప్రముఖ న్యాయవాది తిరుపతిరావు తెలిపారు. ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ వెంకయ్యనాయుడుతో విశాఖపట్నంలో 1970-74 సంవత్సరాల మధ్య కాలంలో కలిసి బీఎల్ పూర్తి చేసిన రోజుల్లో ఒకే గదిలో ఉంటూ తాము బీఎల్ పూర్తి చేశామని తెలిపారు. విద్యార్థి కాలం నుంచే నాయకత్వ లక్షణాలను పుణికిపుచ్చుకునే వారని, కళాశాల నాయకుడిగా మంచి సేవలందించారని చెప్పారు. వెంకయ్యనాయుడు ఉపరాష్ట్రపతిగా అందరి మన్ననలు పొందాలని తెలిపారు.

పర్లాకిమిడిలో భారీ వర్షం

పర్లాకిమిడి:పర్లాకిమిడిలో శుక్రవారం సాయంత్రం మెరుపులు, పిడుగులతో గంటపాటు భారీ వర్షం కురిసింది. ఈ సందర్భంగా రోడ్లు జలమయమయ్యాయి. దీంతో వాహనాలరాకపోకలకు తీవ్రఅంతరాయం కలిగింది.రాజవీధిలో భారీగా నీరు చేరింది. ఆరో వార్డు నీరు నిలిచిపోవడంతో స్థానికులు అవస్థలకు గురయ్యారు.



రాజవీధిలోకి చేరిన నీరు

స్వాతంత్ర్య దినోత్సవం రిహార్సల్

పర్లాకిమిడి:పర్లాకిమిడి మాతృపెదలో గల ఆరవింద్‌పాఠశాలలో విద్యార్థులు స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకొని జరిగే కార్యక్రమాలపై రిహార్సల్ నిర్వహించారు. ఈ సందర్భంగా మార్చ్‌ఫాస్ట్‌పై అవగాహన కల్పించారు. జిల్లా అధికారుల ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమంలో తమ పాఠశాల విద్యార్థులు పాల్గొంటారని ప్రిన్సిపాల్‌అరవింద్ దాస్ తెలిపారు.



మార్చ్‌ఫాస్ట్ నిర్వహిస్తున్న విద్యార్థులు



వ్రతాలు చేస్తున్న మహిళలు

ఘనంగా శ్రావణ శుక్రవారం పూజలు

పర్లాకిమిడి:పర్లాకిమిడిలో శ్రావణ శుక్రవారం పురస్కరించుకొని శుక్రవారం ఘనంగా పూజలు జరిగాయి. తెల్లవారుజాము నుంచే ఆలయాల్లో భక్తులు బారులుతీరారు. పొడుగు దేవాలయంలో మహిళలు వ్రతాలు నిర్వహించారు. వేంకటేశ్వరాలయం, ప్రసన్న వేంకటేశ్వరాలయాలు భక్తులతో పోటెత్తాయి. వేకువజాము నుంచి భక్తుల రద్దీ నెలకొంది.

పొలంలో బంగారు విగ్రహం లభ్యం?

- **కౌలు రైతు పరారీ**
- **ఆరాతీస్తున్న పోలీసులు**

టెక్కలి: ఓ రైతు పొలం దున్నతుండగా బంగారం విగ్రహం లభ్యమైనట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఆయన పరారీలో ఉండడంతో పలుఅనుమానాలకు తావిస్తోంది. టెక్కలి మండలంలోని మేఘవరం పంచాయతీ పరిధిలోల జక్కరపేట జంక్షన్ సమీపంలో గల దుర్గమ్మ గుడికి ఎదురుగా ఉన్నకూన కూర్మారావుకు చెందిన పొలాన్ని రైతు రోణంకి వెంకట్రావు కౌలుకుసాగుచేస్తున్నాడు. వారంరోజుల కిందట వెంకట్రావు పొలాన్ని దున్నుతుండగా ఓ బంగారు విగ్రహం దొరికిందని...అందులో చిన్నపాటి ముక్కను రూ.90 వేలకు విక్రయించినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ విషయం బయ టకు పొక్కడంతో పొలం యజమాని కూర్మారావు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వెంకట్రావు గురించి గాలింపు చర్యలు ప్రారంభించారు. వారంరోజులుగా వెంకట్రావు పరారీలోఉండడంతో పోలీసులు ఆయన బంధువులను రెండురోజులు కిందట విచారించి విడిచిపెట్టారు.వెంకట్రావు వారం రోజులుగా కనిపించకపోవడం అనుమానాలకు బలం చేకూరుతోంది. దీనిపై సీఐ భవానీప్రసాద్ వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించగా..ఈ విషయం మా దృష్టికి వచ్చిందని..వెంకట్రావు ఆచూకీకి ఆరాతీస్తున్నామని చెప్పారు. ఆయన దొరికితే తప్ప వాస్తవాలు చెప్పలేమని, ప్రస్తుతం వెంకట్రావు ఫోన్ స్విచ్‌ఆఫ్‌లో ఉందని తెలిపారు.

ప్రైవేటు పాఠశాలల బస్సులపై దాడులు

- **ఫస్ట్‌ఎయిడ్ బాక్స్‌లో మందులు లేవని గుర్తింపు**
- **కేసులు నమోదు చేసిన ఎంవీఐ అధికారులు**

పలాస: ప్రైవేటు స్కూళ్ల బస్సులపై శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ఎంవీఐ అధికారులు దాడులు నిర్వహించి కనీస నిబంధనలు పాటించడం లేదని గుర్తించారు. విద్యార్థులకు ఇబ్బంది లేకుండా కేసులు నమోదు చేయగా, రెండు రోజుల్లో బస్సులను నిబంధనల ప్రకారం తిప్పకపోతే సీజ్ చేస్తామని హెచ్చరించారు.జిల్లాలో పలు ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్ల బస్సులు నిబంధనలకు విరుద్ధంగా తిప్పుతున్నారు.రోడ్డు ప్రమాదాలు జరిగే సమయంలోనే లోపాలుబయటపడుతుండడంతో సర్వత్రాఆందోళన వ్యక్తమవుతోంది. ఈవ్యవహారంపైఅధికారులు సీరియస్‌గా పరిగణించడంతో శుక్రవారం జిల్లా వ్యాప్తంగా మోటారువెహికల్ ఇన్‌స్పెక్టర్లు దాడులు నిర్వహించారు.

నిబంధనలకు విరుద్ధంగా ...

కాశీబుగ్గ డివిజన్ పరిధిలో ఉన్న పలాస, వజ్రపుకొత్తూరు, మెళియాపుట్టి, నందిగాం, మందస, పాతపట్నం ప్రాంతంలో మొత్తం 52 బస్సులు ఉండగా అందులో 80 శాతం బస్సులు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. కాశీబుగ్గ రవీంద్ర భారతి కార్పొరేట్ సంస్థకు చెందిన బస్సులను ఎంవీఐ ప్రకాశరావు తనిఖీ చేశారు.బస్సులో సీటుకు ఇద్దరు చొప్పున విద్యార్థులు ఉండగా ఒక్కోసీటుపై ముగ్గురు నుంచి నలుగురు ఉన్నట్లు గుర్తించారు. దీనికి తోడు డ్రైవర్ ప్రక్కన స్టీరింగ్‌పై మొత్తం ఆరుగురు విద్యార్థులు చొప్పున బస్సులో మొత్తం 60 మంది విద్యార్థులు ఉండడంతో ప్రకాశరావు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఫస్ట్‌ఎయిడ్ బాక్స్ ఉన్నా అందులో ఒకరికి సరిపడ మందులు తప్పా మరే ఇతర పరికరాలు లేకపోవడాన్ని, ఫైర్ బాక్స్‌లు ఉన్నా అందులో ఫోమ్ లేని విషయాన్ని అధికారులు గుర్తించారు. నిబంధనల ప్రకారంలేని బస్సులను గుర్తించి వాటిని సీజ్ చేయడానికి కూడా వెనుకాడబోమని ఎంవీఐ ప్రకాశరావు హెచ్చరించారు. నిర్లక్ష్యం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు.



బస్సులో పత్రాలు పరిశీలిస్తున్న ఎంవీఐ ప్రకాశరావు

విజిలెన్స్ డీఈఈకి పురస్కారం

శ్రీకాకుళం సిటీ: శ్రీకాకుళం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఉప కార్యనిర్వాహక ఇంజనీర్ (డీఈఈ) విద్యాసాగర్‌కు రాష్ట్ర ప్రభుత్వం నగదు పురస్కారానికి ఎంపిక చేసింది. విధి నిర్వహణలో ఉత్తమ పనితీరు కనబరిచిన ఆయనకు రూ.20 వేల నగదును పంద్రాగస్టు రోజున రాజ ధాని అమరావతిలో అందించనున్నారు. పనితీరు ఆధారంగా ఇన్సెంటివ్‌గా అందించడం ఆనవా యితీ. ఈ తరహాలో రాష్ట్రవ్యాప్తంగా 23 మంది ఎంపిక కాగా, ఇందులో విద్యాసాగర్ ఒకరు కావ డం విశేషం. ఈ మేరకు శుక్రవారం ప్రభుత్వ సాధారణ పరిపాలన విభాగం నుంచి జీవో నెంబర్ 108 వెలువడింది.

చకచకా 'వంశధార'



● పోలీసుల నిఘాలో ఊపందుకున్న పనులు ● అరెస్టులతో మిన్నకున్న నిర్వాసితులు ● గ్రామాల్లో కొనసాగుతున్న బందోబస్తు

హిరమండలం: వంశధార రిజర్వాయర్ పనులు చకచకా జరుగుతున్నాయి. నిత్యం పోలీసుల పర్యవేక్షణలో పనులను యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నారు. సమస్యలు పరిష్కరించకుండా పనులు ఎలా చేస్తారని నిలదీసేందుకు వచ్చిన పలువురు నిర్వాసితులను పోలీసులు అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేసారు. దీంతో వారంతా మిన్నకున్నారు. అయితే ఏక్షణానైనా ముంపు గ్రామాల ప్రజలంతా ఏకమై పనులు వద్దకు వచ్చే అవకాశం ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. దీంతో ముంపు గ్రామాలతో పాటు పనులు జరిగే చోట బందోబస్తును కొనసాగిస్తున్నారు. గార్లపాడు వద్ద రిజర్వాయర్ గట్టు నిర్మాణాన్ని వేగవంతం చేశారు. ఈ పనులను జేసీ చక్రధర్‌బాబు, ఎస్పీ తివిక్రమవర్మ పరిశీలించారు. గురువారం ఈ పనులను అడ్డుకున్న 48 మందిని పోలీసులు అదుపు లోకి తీసుకొని వివిధ పోలీస్ స్టేషన్‌లకు తరలించారు. రాత్రి 10 గంటల సమయంలో వారిని విడిచిపెట్టారు. శుక్రవారం కూడా నిర్వాసితుల నుంచి ప్రతిఘటన ఎదురౌతుందని భావించిన పోలీసులు అప్రమత్తం గా ఉన్నారు. ఉదయం తొమ్మిది గంటలకే పోలీసు బలగాలు గార్లపాడు వద్ద మోహరించాయి.



పనులు సాగుతున్న ప్రాంతంలో పోలీసు బందోబస్తు

డిసెంబరు నాటికి పూర్తిచేస్తాం: జేసీ

వంశధార రిజర్వాయర్ పనులను ఈ ఏడాది డిసెంబరు నాటికి పూర్తిచేస్తామని జేసీ చక్రధర్‌బాబు అన్నారు. పనులకు నిర్వాసితులు సహకరించాలని ఆయన కోరారు. సమస్యల పరిష్కారానికి ప్రతి శనివారం కలక్టరేట్‌లో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేశామని తెలిపారు. తులగాంలో 9 ఎకరాలకు సంబంధించిన నష్టపరిహారం అందలేదని పలువురు నిర్వాసితులు జేసీకి తెలిపారు. మొత్తం 100 ఎకరాలు కోర్టు వివాదంలో ఉండడంతో ఆ పరిహారాన్ని డిపాజిట్ చేశామన్నారు. సంబంధిత భూ యజమానులు సరైన ఆధారాలతో పరిహారం చెల్లిస్తామన్నారు. ఆయనతో పాటు ఎస్పీ త్రివిక్రమవర్మ, ఉత్తరాంధ్ర ప్రాజెక్టుల చీఫ్ ఇంజినీర్ ఎంటీ రాజు, ఆర్డీవో గున్నయ్య, తహసీల్దార్ ఎం.కాళీ ప్రసాదరావు, ఈఈ సీతారాం నాయుడు డీఎస్పీ సుబ్రమణ్యం పాల్గొన్నారు.



జేసీ చక్రధర్‌బాబు,ఎస్పీ త్రివిక్రమవర్మకు సమస్యలు తెలియజేస్తున్న నిర్వాసితులు

నేడు 'తోటపల్లి' నీరు విడుదల

కలెక్టరేట్: సర్దార్ గౌతులచ్చన్న తోటపల్లి ప్రాజెక్టు నీటిని లావేరు మండలానికి మంత్రి కిమిడి కళావెంకటరావు శనివారం ఉదయం 9.30 గంటలకు విడుదల చేయనున్నారు. లావేరు మండలానికి మొదటి సారిగా ఈ నీరు అందనుంది.

నేడు ఆమదాలవలస, పలాస రైల్వేస్టేషన్లలో వైఫై ప్రారంభం

కలెక్టరేట్/పలాస: జిల్లాలోని ఆమదాలవలస, పలాస రైల్వేస్టేషన్లలో శనివారం నుంచి వైఫై సేవలు ప్రారంభమవుతాయని కలెక్టర్ కార్యాలయ వర్గాలు ఒక ప్రకటలో తెలిపాయి. రైల్వే మంత్రి వీడియో కాన్ఫరెన్సు ద్వారా న్యూఢిల్లీ రైలు భవన్ నుంచి ఉదయం 10.30 గంటలకు ఈ సేవలను ప్రారంభిస్తారని అధికారులు తెలిపారు.

బీసీ రుణాలతో స్వయం ఉపాధి

కోటబొమ్మాళి : జిల్లాలో 2016-17 ఆర్థిక సంవత్సరానికి గాను ఏడు నాయిబ్రాహ్మణ సహకార సంఘాలకు నిధులు మంజూరయ్యాయని, ఆ నిధులతో సంఘాల్లోని నిరుపేదలు స్వయం ఉపాధి పొందవచ్చని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కుప్పిలి వెంకటరమణ తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేఖరులతో మాట్లాడుతూ వజ్రపుకొత్తూరు మండలానికి రూ.10లక్షలు, టెక్కలి మల్లిఖార్జున నాయిబ్రాహ్మణ సంఘానికి రూ.15లక్షలు, నరసన్నపేట రాజరాజేశ్వరి సంఘానికి రూ.5లక్షలు, పాతపట్నం సాయిదుర్గ సంఘానికి రూ.12లక్షలు, కోటబొమ్మాళి గరలకంఠేశ్వర సంఘానికి రూ.10 లక్షలు, సంతబొమ్మాళి సాయిదుర్గ సంఘానికి రూ.4లక్షలు మంజూరైనట్లు తెలిపారు. కోటబొమ్మాళి తారకేశ్వర నాయిబ్రాహ్మణ సంఘానికి రూ.10లక్షలు మంజూరు చేశారన్నారు.

లౌకికవాదమే కాంగ్రెస్ నినాదం

● మాజీమంత్రి కోండ్రు ● శ్రీకాకుళం చేరుకున్న రాజీవ్ సద్భావన యాత్ర

డేఅండ్‌నైట్‌జంక్షన్: లౌకికవాదమే కాంగ్రెస్ నినాదమని, సెక్యులర్ ప్రభుత్వం కాంగ్రెస్‌తోనే సాధ్యమని మాజీమంత్రి కోండ్రు మురళీమోహన్ అన్నారు. ఉగ్రవాదం, మతవాదం దేశానికి చేటని వాటిని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. 26వ రాజీవ్ సద్భావన యాత్ర శ్రీకాకుళం ఇందిరాభవన్‌కు శుక్రవారం చేరుకుంది. డీసీసీ అధ్యక్షుడు డోల జగన్, కాంగ్రెస్ నేతలు ఘనస్వాగతం పలికారు. దివంగత ప్రధాని రాజీవ్‌గాంధీకి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కోండ్రు మాట్లాడుతూ, రాజీవ్‌గాంధీ ఆశయాలు నెరవేర్చేందుకు ప్రతిఒక్కరూ కృషిచేయాలన్నారు. బీజేపీ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరించి కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తుందని విమర్శించారు.



సద్భావనయాత్ర జ్యోతిని పట్టుకున్న కాంగ్రెస్ నాయకులు

ఈ సద్భావన యాత్రలో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కనుగుల చంద్రశేఖర్, పట్నాల నర్సింహమూర్తి, బి.రమణ, మల్లిబాబు, రాంబాబు, పైడి రవి, చిరంజీవి, అల్లిబిల్ల రాధ, రెల్ల సురేష్ పాల్గొన్నారు.

కిస్ ఆధ్వర్యంలో మోడల్ స్కూల్

సీతంపేట: భువనేశ్వర్‌లోని కిస్ (కళింగ ఇనిస్టి ట్యూషన్ ఆఫ్ సోషల్ సర్వీస్) ఆధ్వర్యంలో శ్రీకాకుళం జిల్లాలో మోడల్ స్కూల్ ప్రారంభానికి ఆమోదం తెలిపినట్టు ఐటీడీఏ పీవో ఎల్.శివశంకర్ తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లో సెంటర్ ఫర్ ఇన్నోవేషన్ పబ్లిక్ స్కూల్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో కిస్ ఆర్గనైజేషన్ అధికారులు, రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ అధికారులు నిర్వహించిన సమావేశ వివరాలను పీవో స్థానిక విలేఖరులకు తెలిపారు. కిస్ ఆధ్వర్యంలో రానున్న విద్యాసంవత్సరం నుంచి జిల్లాలో ఒక ప్రాంతంలో మోడల్ స్కూల్ ప్రారంభానికి కిస్ అధికారులు అంగీకారం తెలిపారన్నారు. ఈ స్కూల్‌లో ఒకటో తరగతి నుంచి 4వ తరగతి వరకు బోధన నిర్వహిస్తారన్నారు. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన విద్యార్థులు ఈ పాఠశాలలో చేరేందుకు అర్హత కల్పిస్తామని పీవో తెలిపారు.



పోలీసులకు చిక్కిన బెంగాల్ ముఠా

● బంగారు ఆభరణాలు, నగదు స్వాధీనం ● మరో రెండు కేసులను ఛేదించిన పోలీసులు ● నిందితుల్ని మీడియా ఎదుట ప్రవేశపెట్టిన ఎస్పీ

శ్రీకాకుళం, ఆంధ్రజ్యోతి : జిల్లాలో తాళం వేసిన ఇళ్లనే లక్ష్యంగా చేసుకుని లూటీలకు పాల్పడిన బెంగాల్ ముఠా ఎట్టకేలకు పోలీసులకు చిక్కింది. అలాగే, ఎచ్చెర్లలో లారీ అదృశ్యం కేసు, కాశీబుగ్గలో నగదు అపహరణ కేసును పోలీసులు ఛేదించారు. ఈ మూడు సంఘటనలకు సంబంధించిన వివరాలను శుక్రవారం సాయంత్రం ఎస్పీ త్రివిక్రమవర్మ విలేఖరులకు వెల్లడించారు. పశ్చిమబంగా రాష్ట్రం ముర్షిదాబాద్ జిల్లాకు చెందిన రోబిల్ షేక్, లాల్‌బాబూ షేక్, ఇటాన్ షేక్ ముఠాగా ఏర్పడి ఫలక్‌నామా రైలులో మే నెలలో ఆమదాలవలస చేరుకున్నారు. అక్కడ ఓ లాడ్జిలో గదిని అద్దెకు తీసుకున్నారు. ఉదయం రెక్కీ నిర్వహించి సాయంత్రం తాళం వేసిన ఇళ్లల్లో చోరీలకు పాల్పడేవారు. మే 11న బొడ్డేపల్లిపేటలో ఓ ఇంటిలో నాలుగున్నర తులాల బంగారు ఆభరణాలు, రూ.10వేల నగదును కొల్లగొట్టి వారి రాష్ట్రానికి వెళ్లిపోయారు. మళ్లీ జూలైలో ఆమదాలవలస చేరుకుని కుమార్ లాడ్జిలో మకాం వేశారు. జూలై 19న లక్ష్మీనగర్ వీధి, పూజారిపేట, కిల్లివారి క్వార్టర్స్‌లో ఏడున్నర తులాల బంగారు ఆభరణాలు, నగదును అపహరించారు. నరసన్నపేటలో ఓ ఇంటి తలుపులు పగులకొట్టి బంగారాన్ని దొంగిలించారు. ఎట్టకేలకు ఈ ముగ్గురు పటుపడ్డారు. వీరినుంచి ఏడున్నర తులాల బంగారు ఆభరణాలు, రూ.2లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్పీ వెల్లడించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ షేక్‌షరీనాబేగం, డీఎస్పీ భార్గవరావునాయుడు, సీఐలు నవీన్ కుమార్, రామకృష్ణ పాల్గొన్నారు.





వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ, వెనుక నిల్చొన్న నిందితులు(ముందువరుసలో), స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు, చోరీలకు వినియోగించిన వస్తువులు

గుట్టువీడిన లారీ అదృశ్యం కేసు :

ఎచ్చెర్లలో ఈనెల 4న రోడ్డుపై ఆగిఉన్న లారీ అదృశ్యమైన కేసును పోలీసులు ఛేదించారు. లారీ మాయమైన రోజు నుంచి క్లీనర్ మజ్జి సంతోష్ కూడా కనిపించడంతో లారీ యజమాని జరుగుళ్ల రామారావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు సంతోష్ స్వగ్రామం విజయనగరం జిల్లా శృంగవరపు కోట మండలం బొడ్డవారకు వెళ్లి విచారణ చేపట్టారు. సంతోష్ లారీ బ్యాటరీలను దొంగిలిస్తుంటాడన్న విషయం బయటపడింది. దీంతో విచారణ వేగవంతం చేయగా శృంగవరపుకోటలోని ఓ ప్రాంతం వద్ద సంతోష్ దొంగిలించిన లారీ కూరుకుపోయి ఉండడాన్ని పోలీసులు గుర్తించారు. ఈ మేరకు సంతోష్‌ను అరెస్టు చేశారు.



సంతోష్

నగదు అపహరించిన ఇద్దరి అరెస్టు

టెక్కలిలో బంగారు నగలను తాకట్టుపెట్టి రూ. 96 వేలను ఇంటికి తీసుకువెళ్తున్న భావనపాడుకు చెందిన రమేష్ నుంచి నగదును అపహరించిన బి.అలీశా, గొర్లె మురళీని పోలీసులు అరెస్టు చేశారు. రమేష్ జూలై 24న టెక్కలిలోని ఒక బ్యాంకులో బంగారు నగలు తా కట్టు పెట్టి రూ.96వేలు పొందాడు. నౌపడ వద్ద కూర గాయలను కొనుగోలు చేసేందుకు బైక్‌ను ఆపగా అలీశా, మురళీ నగదును అపహరించారు. సీసీ కెమెరాల ఆధారంగా వారిని అరెస్టు చేసి రూ.85వేలను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్పీ తెలిపారు.



స్వాధీనం చేసుకున్న నగదు



హరిత లక్ష్యం నెరవేరేనా?



● నామమాత్రంగా 'వనం-మనం'
● జోరు పెంచేందుకు అటవీశాఖ కసరత్తు

(శ్రీకాకుళం సిటీ)

మహాయజ్ఞం లాంటి మొక్కలు నాటే కార్యక్రమం జిల్లాలో ఇంకా బాలారిష్టాలు దాటలేదు. వనం...మనం పేరిట చేపడుతున్న ప్రతిష్టాత్మక కార్యక్రమం ఆశించినంతగా సిక్కోలులో ముందుకు సాగడం లేదు. పట్టణ ప్రాంతాల్లో మొక్కల పెంపకం నామమాత్రంగా కనిపిస్తోంది. దీంతో అటవీశాఖ మరింత పటిష్టమైన కార్యాచరణతో ముందుకెళ్లే ప్రయత్నం చేస్తోంది.

మొక్కకో లెక్క....

జిల్లా కేంద్రంతో పాటు ఆమదాలవలస, పలాస-కాశీబుగ్గ, ఇచ్ఛాపురం, పాలకొండ, రాజాం నగర పంచాయతీల్లో ఈ ఏడాది దాదాపు 5 లక్షల మొక్కలు నాటాలని అధికారులు ఆదేశించారు. ఈ మేరకు విద్యాసంస్థల ఆవరణల్లో, రిజర్వ్ స్థలాల్లో కానుగ, వేప, ఉసిరి, నేరేడు, మారేడు, ఉసిరి, సీతాఫలం, జామ వంటి మొక్కలు నాటాల్సి ఉంది. అయితే ఆ కార్యక్రమం నెమ్మదించడంతో సామాజిక అటవీ వన విభాగం అప్రమత్తమవుతోంది.

రూ.కోట్లు ఖర్చయినా...

గతేడాది ఒక్కో వ్యక్తి కనీసం మూడు మొక్కలు నాటాలని ప్రభుత్వం సంకల్పించింది. అందుకు అనుగుణంగానే అటవీ, సామాజిక వన విభాగాలు ఉపాధి హామీ పథకంలో జిల్లా వ్యాప్తంగా 50 వన నర్సరీల్లో మొక్కలను పెంచి పంపిణీ చేశారు. ఆర్భాటంగా మొక్కలు నాటారు. కానీ సంరక్షించే బాధ్యతలు చేపట్టకపోవడం వల్ల లక్షలాదిగా నాటిన మొక్కలు నేడు వేల సంఖ్యలో కూడా కాన రాకపోవడం దారుణం.

● ఉపాధి హామీ పథకంలో 2015-16 జిల్లా వ్యాప్తంగా మండలాల్లో రహదారుల వెంబడి లక్షలాది మొక్కలు నాటారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల ఆవరణలో మామిడి, కొబ్బరి, జామ, నిమ్మ తదితర మొక్కలు నాటారు. అన్ని మండలాల్లో గృహాలకు వివిధ మొక్కలు పంపిణీ చేశారు. నాటిన మొక్కలను 8 నెలల పాటు సంరక్షించి 40 సార్లు నీరు పోసేందుకు ఒక్కో మొక్కకు రూ.4.25 కేటాయించారు. కానీ సక్రమంగా అమలుకాలేదు.

కార్యక్రమం పేరు: వనం...మనం

ఎప్పుడు ప్రారంభం: జూలై 1న

ఎప్పుడు ముగింపు : కార్తీకంలో నిర్వహించే వనమహోత్సవం వరకూ

గడువు : ఇంకా వంద రోజులు మాత్రమే మిగిలి ఉన్నాయి

వనాలు ఉండాల్సిన విస్తీర్ణం: 33శాతం

ప్రస్తుతం జిల్లాలో ఉన్న అడవులు: 12.07 శాతం

జిల్లా జనాభా: 29 లక్షలు

ఈ ఏడాది లక్ష్యం: రెండు కోట్ల మొక్కలు

పెంపకానికి ఖర్చు: ఒక్కో మొక్కకు రూ. 4

జియోట్యాగింగ్ ఉత్తుత్తిదే....

నగర పాలక సంస్థ, పట్టణాల్లోని ఖాళీ ప్రదేశాలతో పాటు అన్ని కాలనీల్లో రహదారుల పక్కన మొక్కలు నాటి సంరక్షించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. నాటిన ప్రతి మొక్కకు జియోట్యాగింగ్ చేసి ప్రతి నెల క్రమం తప్పకుండా వాటి సంరక్షణను తెలుసుకోవాలని సూచించారు. అయితే గతేడాది లక్షల్లో మొక్కలు నాటారు. ఆ తర్వాత ఏవిధంగా ఉన్నాయో పట్టించుకోలేదు. దీంతో ఇక్కడ మొక్కలు వేశారో తెలియని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ స్థలా ల్లో మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తే ఆక్రమణలకు ఆస్కారం ఉండకపోగా వనం..మనం లక్ష్యం నెరవేరుతుందని పర్యావరణ నిపుణులు భావిస్తున్నారు.



హరిత సిక్కోలే లక్ష్యం

వచ్చే నాలుగైదు ఏళ్లలో హరిత సిక్కోలు ఆవిష్కరణ లక్ష్యంగా ముందుకెళ్తున్నాం. మొక్కలు నాటడం కేవలం అటవీశాఖ బాధ్యత మాత్రమే కాదు. ప్రజల సామాజిక బాధ్యత. ప్రతిఒక్కరూ సామాజిక స్పృహతో ముందుకెళ్లాలి. ఇప్పటికే అన్ని డీఆర్‌డీఏ, డ్వామా తదితర ప్రభుత్వ శాఖల అధికారులతో సమావేశమయ్యాం. ఒకప్పటి పేదల ఊటీగా ఉన్న శ్రీకాకుళానికి పూర్వవైభవం తీసుకొచ్చేలా ముందుకెళ్తాం. ఏదైనా ప్రజా సహకారంతోనే సాధ్యం.

- ధనుంజయరెడ్డి, కలెక్టర్





లక్ష్యం చేరేలా...

ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణ, విరివిగా మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ప్రతి ఇంటా మొక్కలు ఉండేలా చూడాలని క్షేత్రస్థాయి సిబ్బందిని ఆదేశించింది. భవన నిర్మాణ ప్రణాళికలో కూడా ఇది భాగం కావాలని సూచించింది. 200 చదరపు మీటర్లలోపు విస్తీర్ణానికి రూ.500 వంతున, 500 చదరపు మీటర్ల విస్తీర్ణానికి రూ.569 వంతున మొక్కల సంరక్షణ నిమిత్తం వసూలు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ రుసుంతో సంబంధిత గృహ యజమానికి మొక్కల పంపిణీ, రక్షణ కోసం ఇనుప చట్రాలను అందించాలని సూచించారు. అయితే ఈ లక్ష్యం అధిగమించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సి ఉంది.

కొందరికే..!

● ఐటీడీఏ ఆశ్రమ పాఠశాలల్లో కొంతమందికే ట్రంకు పెట్టెలు
● పూర్తిస్థాయిలో సరఫరా కాని వైనం ● అవస్థల్లో విద్యార్థులు



బ్యాగ్‌లలోనే వస్తువులను భద్రపరుచుకున్న విద్యార్థులు

సీతంపేట రూరల్: ఐటీడీఏ ఆశ్రమ పాఠశాలల్లో కొత్తగా చేరుతున్న గిరిజన విద్యార్థులకు పూర్తిస్థాయిలో ట్రంకు పెట్టెలు అందడం లేదు. కొందరికే అవి దక్కుతుండడంతో చాలామంది బయట మార్కెట్లో కొనుగోలు చేసుకోవాల్సి వస్తోంది. వాస్తవంగా 3వ తరగతిలో చేరిన విద్యార్థు లకు ట్రంకు పెట్టెలతో పాటు గ్లాసులు, ప్లేట్లను ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేస్తుంది. ట్రంకు పెట్టెలను ఐదేళ్ల పాటు వారు వినియోగించు కోవాల్సి ఉంటుంది. అయితే ఏటా మూడువేల ట్రంకు పెట్టెల కోసం లక్షలాది రూపాయలు వెచ్చిస్తున్న ప్పటికీ విద్యార్థుల్లో కొందరికే అవి అందుతున్నాయి.

రేషనలైజేషన్‌లో భాగంగా...

రేషనలైజేషన్‌లో భాగంగా ప్రతి 10 మందిలోపు ఉన్న పాఠశాలలను ఆ దగ్గరలో ఉన్న ఆశ్రమపాఠశాలల్లో విద్యార్థులను చేర్పించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. దీనిలో భాగంగా సీతంపేట ఐటీడీఏ పరిధిలో 54 పాఠశాలల పిల్లలను ఆశ్రమపాఠశాలల్లో చేర్పించే అవకాశం ఉంది. వీరంతా చేరితే మౌలిక వసతులు కల్పించడంలో కూడా అధికారులు వైఫల్యం చెందే అవకాశం లేకపోలేదు.

పాత పెట్టెలు ఏమవుతున్నాయో...

ఐటీడీఏ పరిధిలో మూడు నుంచి 10వ తరగతి వరకు 11వేల మంది గిరిజన విద్యార్థినీవిద్యార్థులు 47 ఆశ్రమపాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్నారు. ఏటా రెండువేల మంది వరకు పదో తరగతి విద్యార్థులు రిలీవ్ అవుతున్నారు. వీరికి అందజేసిన ట్రంకు పెట్టెలు పాఠశాలలోనే విడిచిపెట్టి వెళ్లిపోతున్నప్పటికీ అవి ఏమవుతు న్నాయో అర్థం కావడం లేదు. వాస్తవానికి ఈ పెట్టెలు ఆ ఏడాది 3వ తరగతిలో చేరిన విద్యార్థులకు అందజేసినట్టయితే బయట కొనుగోలు చేసే పరిస్థితి ఉండదు. అలా కాకుండా వాటిని సంబంధిత సిబ్బంది స్క్రాప్ కింద అమ్మకాలు చేస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. మరో పక్క ప్లేట్లు, గ్లాసులది ఇదే పరిస్థితి. ఒక్కొక్క విద్యార్థికి ఏడాదికి రూ.80లు వెచ్చించి ప్లేట్లు, గ్లాసులు అంద జేస్తున్నారు. వీటిని కూడా విద్యార్థులకు సక్రమ పద్ధతిలో అందజేయడం లేదు. దీంతో విద్యార్థులు తమ ఇళ్ల నుంచే ప్లేట్లు, గ్లాసులు తీసుకొస్తున్నారు.



ఇంటి నుంచి తీసుకొచ్చిన ప్లేట్లతో విద్యార్థులు

పాఠ్యపుస్తకాల పరిస్థితి ఇదీ...

వేసవి సెలవుల్లో విద్యార్థులు తమ పాఠ్యపుస్తకాలు పాఠశాలల్లో విడిచిపెట్టి వెళ్లిపోతున్నారు. అయితే ఇవి కూడా బయట మార్కెట్లో సిబ్బంది వేలల్లో అమ్మకాలు చేస్తున్నారు. జిల్లాలో ఈ తరహా పుస్తకాలు గిరిజన సంక్షేమశాఖ సేకరించి ఆ ఏడాది వచ్చే విద్యార్థులకు అందజేసినట్టయితే ఐటీడీఏకు రూ. లక్షల్లో నిధులు మిగలనున్నాయి. ఈవిషయమై డీడీ రోజారాణి వద్ద ప్రస్తావించగా పాఠశాలల పునఃప్రారంభంలోనే విద్యార్థులకు కొత్తగా పెట్టెలు, గ్లాసులు, ప్లేట్లు సరఫరా చేస్తున్నాం. ఈ ఏడాది ఐదు వేల కొత్త పెట్టెలకు ఇండెంట్ ఇచ్చాం. గత ఏడాది మిగులుగా ఉన్న 2400 పెట్టెలు, గ్లాసులను సరఫరా చేశామని తెలిపారు.

నిరుద్యోగ యువతకు భరోసా

● కొలిక్కి వచ్చిన భృతి వ్యవహారం
● 35 ఏళ్లలోపు వారికి ప్రయోజనం

శ్రీకాకుళం సిటీ: నిరుద్యోగ యువతకు భరోసా కల్పించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. పేర్ల నమోదుకు శ్రీకారం చుట్టాలని ఇప్పటికే అధికారులను కూడా ఆదేశించారు. అయితే 18 నుంచి 35 ఏళ్ల మధ్య వయస్సు కలిగి, ఎలాంటి ఉపాధి....ఉద్యోగం లేనివారికి నిరుద్యోగ భృతి అందించనున్నారు. జిల్లాలో 18-35 ఏళ్ల వయస్సు ఉన్న వారి జనాభా దాదాపు 11 లక్షలు. 38 మండలాతో పాటు శ్రీకాకుళం, పలాస-కాశీబుగ్గ, ఇచ్ఛాపురం, ఆమదాల వలస, పాలకొండ, రాజాం నగర పంచాయతీల్లో ఉన్న యువత వివరాలను సేకరించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే ఉన్న జనాభా వివరాలతో పోల్చి ఎవరెవరు ఎంత చదువుకున్నారు. వారిలో ఉద్యోగం పొందిన వారు ఎంతమంది....ఉపాధిలో ఉన్న వారెందరు...ఇలా వివరాలు సేకరించడంతో పాటు ఆన్‌లైన్ ద్వారా నమోదుకు అవకాశం కల్పించనున్నారు. మహిళలకు కూడా భృతి కల్పించేందుకు గాను ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

పీజీ పూర్తిచేసిన వారు సైతం...

నేటి యువత చదువుల్లో ముందుంటున్నారు. ఇంజినీరింగ్‌తో పాటు పీజీ చదివిన వారు చాలా మందే ఉన్నారు. బ్యాంకుల్లో గుమస్తాలు, కానిస్టేబుళ్లు, ఆర్మీ, ఇతర చిన్న ఉద్యోగాల ఎంపికకు పోటీపడిన పరిస్థితులు ఉన్నాయి. జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో ఏటా 50 వేల మంది వరకూ నమోదు చేసుకుంటున్నారు.

ఉపాధి హామీ వేతనదారులుగా....

పీజీ, డిగ్రీ వంటివి చదివిన వారూ ఉపాధి హామీ పనులకు వెళ్తున్నారు. మరికొందరు వ్యవసాయ కూలీలు, ఆటోలు, ఇతర కార్మికులుగా పనిచేస్తున్న పరిస్థితి. ఇలా వివిధ పనుల్లో ఉన్నవారిని మినహాయించనున్నారు. అర్హుల ఎంపికలో అన్ని కోణాలను పరిగణనలోకి తీసుకుంటున్నారు. ఆన్‌లైన్ సాయం తీసుకోవడంతో పాటు ప్రత్యేక యాప్ తయారు చేయనున్నట్టు అధికార వర్గాలు చెబుతున్నాయి. శక్తి సామర్థ్యాలున్న వారికి నాలెడ్జ్ మిషన్ ద్వారా శిక్షణ ఇచ్చే అవకాశముంటుందంటున్నారు.



మృత్యు శకటాలు



నందిగాం మండలం గొల్లూరు సమీపంలో బోల్తాపడిన స్కూల్ బస్సు (ఫైల్)

- రోడ్డు ప్రమాదాలకు గురవుతున్న ప్రైవేట్ స్కూల్, కాలేజీ బస్సులు
- జిల్లాలో వరుస సంఘటనలతో వణుకుతున్న విద్యార్థులు
- ఆందోళనలో తల్లిదండ్రులు

● 2017, ఏప్రిల్15న పలాస- కాశీబుగ్గకు చెందిన ఓ ప్రైవేట్ స్కూల్ బస్సు 40మంది విద్యార్థులతో టెక్కలి వస్తుండగా, నందిగాం మండలం గొల్లూరు సమీపంలో బోల్తా పడింది. ఈ ఘటనలో పలువురు విద్యార్థులకు గాయాలయ్యాయి.

● ఈ నెల2న కోటబొమ్మాళి నుంచి సంతబొమ్మాళి మండలం వైపు వెళ్తున్న ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాల బస్సు మలగాం వద్ద బోల్తా పడింది. దీంతో ఏడుగురు విద్యార్థులకు తీవ్ర గాయాలయ్యాయి.

● ఈ నెల7న కాశీబుగ్గకు చెందిన ఓ ప్రైవేట్ ఉన్నత పాఠశాలకు చెందిన బస్సు జాతీయ రహదారి పారసాంబ వద్ద బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఐదుగురు విద్యార్థులకు గాయాలయ్యాయి.



మలగాం వద్ద బోల్తాపడిన కాలేజీ బస్సు (ఫైల్)

టెక్కలి : ఇలా వరుసగా ప్రైవేట్ స్కూళ్లు, కాలేజీలకు చెందిన బస్సులు ప్రమాదాలకు గురవుతుండడంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ముఖ్యంగా నాలుగు నెలల వ్యవధిలోనే ఈ దుర్ఘటనలు జరగడంతో విద్యార్థుల తల్లిదండ్రుల గుండెలు బరువెక్కుతున్నాయి. మెరుగైన విద్యాబోధన కోసం తల్లిదండ్రులు ప్రైవేట్ స్కూళ్లు, కాలేజీలపైన ఆధారపడుతుంటే అనుకోకుండా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు వారిని కలవరపెడుతున్నాయి. వాస్తవంగా జిల్లాలో పాఠశాలలు, కాలేజీలకు సంబంధించిన బస్సులు అసలు ఫిట్‌నెస్‌తో ఉన్నాయా, లేదా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఇందన శకట తనిఖీ అధికారులు ఏటా పరిశీలించి ఫిట్‌నెస్ క్లియరెన్స్ ఇచ్చిన తరువాతనే ఆ బస్సులు రోడ్డెక్కాలి. అయితే సాంకేతిక లోపం, డ్రైవర్ల నిర్లక్ష్యం.. కారణంగా అవి నిత్యం



గొల్లూరు సమీపంలో స్కూల్‌బస్సు బోల్తాపడిన సంఘటనలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని (ఫైల్)

ప్రమాదాలకు గురవుతున్నాయి. దీంతో ఉదయం స్కూళ్లు, కాలేజీలకు వెళ్లిన పిల్లలు సాయంత్రం తిరిగి ఇంటికి వచ్చేవరకు తల్లిదండ్రులు ఎదురుచూడాల్సిన పరిస్థితులు దాపురించాయి. రూ.వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తున్న స్కూళ్లు, కాలేజీ యాజమాన్యాలు విద్యార్థులకు సురక్షితమైన ప్రయాణం అందించడంలో విఫలమవుతున్నారు. ఎప్పటికప్పుడు డ్రైవర్ల తీరు, బస్సులకు సంబంధించి సాంకేతిక పరీక్షలు చేయించాల్సిన స్కూళ్లు, కాలేజీ యంత్రాంగాలు అవేవీ పట్టించుకోకపోవడం వల్లే ఇటువంటి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధి కారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

తరచూ పర్యవేక్షిస్తుండాలి



సంతబొమ్మాళి మండలం మలగాం సమీపంలో 'ఎస్' ఆకారంలో కల్వర్టు ఉండడం, డ్రైవర్ నిర్లక్ష్యం వల్ల కాలేజీ బస్సు బోల్తాపడినట్లు గుర్తించాం. పలాస-కాశీబుగ్గ జాతీయరహదారి పారసాంబ వద్ద డ్రైవర్ ఓవర్‌టేక్ చేయడంతో పాటు స్టీరింగ్ కంట్రోల్ చేయకపోవడం వల్ల స్కూల్ బస్సు బోల్తాపడినట్లు తెలిసింది. డ్రైవర్ తప్పిదాల వల్లే ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించాకే స్కూళ్లు, కాలేజీ బస్సులు నడుస్తున్నాయి. 40 నుంచి 60 కిలోమీటర్ల వేగానికి మించకుండా స్పీడు కంట్రోల్ చేస్తున్నాం. ఆకస్మిక తనిఖీలు కూడా నిర్వహి స్తున్నాం. అయితే స్కూళ్లు, కాలేజీ బస్సులకు సంబంధించి డ్రైవర్లకు విశ్రాంతి ఉందా, మానసికంగా ఆందోళన పడు తున్నారా! అన్నది యాజ మాన్యాలతో పాటు తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు గుర్తిస్తుండాలి. తరచూ పర్యవేక్షిస్తుండాలి.

- సీహెచ్.శ్రీదేవి,
డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్, శ్రీకాకుళం



- వర్షాభావంతో ఎండుతున్న వరినాట్లు
- బిందెలతో నీటిని తెచ్చి తడుపుతున్న అన్నదాతలు
- వర్షం కోసం ఎదురుచూపు

కన్నీటి పాట్లు

ఇచ్ఛాపురం రూరల్ : మండలంలో మెట్టు ప్రాంత రైతులు వరినాట్లును బతికించుకునేందుకు నానా పాట్లు పడుతున్నారు. కొందరు మోటర్ ఇంజిన్లతో, మరికొంత మంది రైతులు బిందెలతో నీటిని తెస్తూ.. పంటను తడుపుతున్నారు. గత 15 రోజులుగా చిరు జల్లులు తప్ప భారీ వర్షాలు లేకపోవడంతో ఈ బాధలు తప్పడం లేదని ధర్మపురం, పూర్ణాటకం, కొఠారి, ఈదుపురం, కేశుపురం, నీలాపువుట్టుగ, సన్యాసిపుట్టుగ గ్రామాలకు చెందిన రైతులు వాపోతున్నారు. గట్టు, నాట్లు వేయడానికి రూ.వేలల్లో ఖర్చు చేశామని, వర్షాభావంతో ప్రస్తుతం తమ పరిస్థితి దయనీయంగా మారిందని వారు చెబుతున్నారు.

నాలుగు రోజులుగా శ్రమిస్తున్నాం



ఎండుతున్న వరినాట్లు రక్షించుకునేందుకు గత నాలుగు రోజులుగా శ్రమిస్తున్నాం. చినుకు జాడ లేకపోవడంతో రెండుపూటలా బిందెలతో నీరు మోసి పంటలను తడుపుతున్నాం.

- ఇరోతు నరసింహులు,
రైతు, సన్యాసిపుట్టుగ

గ్రోయిన్ పనులు పూర్తి చేయాలి



గ్రోయిన్ పనులు త్వరగా పూర్తి చేసి ఉంటే రైతులకు ఈ బాధ ఉండేది కాదు. ఒక్క మెట్ట పొలాలే కాకుండా బహుదా నది పరివాహక ప్రాంతాలు కూడా సుభిక్షంగా ఉండేవి. దీనిపై అధికారులు చర్యలు స్పందించాలి.

-మాసుపత్రి కృష్ణారావు,
రైతు, సన్యాసిపుట్టుగ

ఆకట్టుకున్న చిత్రరూపం

టెక్కలి : స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని టెక్కలికి చెందిన ప్రముఖ చిత్రకారుడు, సీవోఎం చర్చ్‌పాదర్ కణితి అబ్రహం బుధవారం జాతీయ జెండాలో సర్వమత సమ్మేళనంతో కూడిన చిత్రాన్ని వేసి అబ్బురపరిచారు. హిందూ, ముస్లిం, క్రిష్టియన్లు సోదరులుగా ఉండాలని సూచిస్తూ.. స్వేచ్ఛగా ఎగురుతున్న పావురం చిత్రాన్ని గీసి అందర్నీ ఆకట్టుకున్నారు.



కణితి అబ్రహం గీసిన సర్వమత సమ్మేళన చిత్రం

వర్సిటీలపై జీఎస్టీ పిడుగు

- నిర్మాణ ఖర్చులపై 18 శాతం పన్ను
- పెదవి విరుస్తున్న మేధావి వర్గం



ఎచ్చెర్ల: రాష్ట్ర ప్రభుత్వం ఆధీనంలోని వర్సిటీలకు కేంద్రం నుంచి నిధులు కేటాయించడం లేదు సరికదా జీఎస్టీ పేరిట పన్ను వసూలు చేస్తుండడంపై మేధావి వర్గం పెదవివిరుస్తోంది. ఇదేమి విడ్డూరమంటూ నిరసన వ్యక్తంచేస్తున్నారు. కొన్నేళ్ల కిందట ఏర్పాటైన పాత యూనివర్సిటీల సంగతి సరేసరి. రాష్ట్రంలో ఏర్పాటైన కొత్త యూనివర్సిటీలకు మాత్రం మూలిగే నక్కపై తాటిపండు పడే చందంగా తయారైంది. అసలే నిధుల కొరతతో నీరసిస్తున్న కొత్త వర్సిటీలకు జీఎస్టీతో మరింత ఇబ్బందులు పడే అవకాశముంది. వర్సిటీల్లో చేపట్టే నిర్మాణ, అభివృద్ధి పనులపై 18 శాతం పన్ను జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుంది. ఉదాహరణకు రూ.10 కోట్లతో నిర్మాణపనులు చేపడితే రూ.1.8 కోట్లను జీఎస్టీ కింద చెల్లించాల్సి ఉంటుంది. ఇంత మొత్తంలో జీఎస్టీ కింద చెల్లించాల్సి రావడం కొత్త వర్సిటీలకు ఇబ్బందేనని చెప్పాలి.

సమంజసం కాదు



రాష్ట్ర ప్రభుత్వం ఆధీనంలోని యూనివర్సిటీలపై కేంద్రం జీఎస్టీ విధించడం సమంజసం కాదు. అభివృద్ధి కార్యక్రమాలపై 18 శాతం జీఎస్టీ విధించడం వల్ల కొత్త వర్సిటీలకు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కోవల్సి ఉంటుంది. ఈ విషయంలో పునరాలోచన జరపాలి.

- ప్రొఫెసర్ జి.తులసీరావు, రిజిస్ట్రార్, బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ



డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ


1976 మే 25 ఏ వారం అవుతుంది?

మెంటల్ ఎబిలిటి

1. 200 కిమీ పొడవైన రహదారిపై రెండు కార్లు చెరోవైపు నుంచి ప్రయాణిస్తున్నాయి. మొదటి కారు 40 కిమీ ప్రయాణించిన తరవాత కుడివైపునకు తిరిగి 20 కిమీ ప్రయాణించింది. మరల ఎడమవైపునకు తిరిగి 35 కిమీ ప్రయాణించింది. తదుపరి ఎడమవైపునకు తిరిగి మెయిన్ రోడ్డుకు చేరుకొంది. రెండో కారు చిన్న లోపంతో కేవలం 55 కిమీ మాత్రమే ప్రయాణించింది. అయితే ప్రస్తుతం ఆ రెండు కార్ల మధ్య దూరం ఎంత?
ఎ) 60 కిమీ బి) 80 కిమీ సి) 75 కిమీ డి) 70 కిమీ
2. 6842109357 సంఖ్యలో మొదటి అంకెను రెండో స్థానంలోకి, రెండో అంకెను మొదటి స్థానంలోకి, మూడో అంకెను నాలుగో స్థానంలోకి, నాలుగో అంకెను మూడో స్థానంలోకి ఇలా అన్ని అంకెలు మారగా ఏర్పడిన కొత్త సంఖ్యలో ఎడమ నుంచి అయిదో అంకెకు గల మూడో కుడి అంకె?
ఎ) 9 బి) 5 సి) 3 డి) 4
3. కింది సంఖ్యలను ముందుగా వ్యతిరేక దిశలో రాసి తరవాత ఆ సంఖ్యలను అవరోహణ క్రమంలో రాస్తే మధ్య సంఖ్య మధ్య అంకె?
853, 942, 687, 439, 924, 168, 316
ఎ) 8 బి) 2 సి) 1 డి) 4
4. 80 మంది విద్యార్థులు ఉన్న ఒక వరసలో కిరణ్ ఎడమ నుంచి 32వ స్థానంలోను, తరుణ్ కుడి నుంచి 28వ స్థానంలోను ఉన్నారు. అయితే ప్రస్తుతం వారిద్దరి మధ్య గల విద్యార్థుల సంఖ్య?
ఎ) 20 బి) 40 సి) 28 డి) 26
5. ఒక వరసలో అచ్యుత్ ఎడమ నుంచి పదో స్థానంలోను, కుడి నుంచి ఆరోస్థానంలోను ఉన్నాడు. ఆ వరసలో మొత్తం సభ్యుల సంఖ్య 34 ఉండాలంటే ఎంతమంది వ్యక్తులు అవసరం?
ఎ) 12 బి) 19 సి) 21 డి) 18
6. వివేక్‌కు అతని సోదరి పుట్టిన రోజు ఆగస్టు 20, 25 మధ్య అని గుర్తు. అతని తండ్రికి తమ కుమార్తె పుట్టిన రోజు సెప్టెంబరు 23, 28 మధ్య అని గుర్తు అయితే వివేక్ సోదరి పుట్టిన రోజు ఎప్పుడు?
ఎ) ఆగస్టు 24 బి) సెప్టెంబరు 24
సి) చెప్పలేం డి) ఏదీకాదు
7. పాట్నాకు ఒక రైలు ప్రతి 80 నిలకు ఉంది. విచారణాధికారి తనను కలసిన ప్రయాణి కుడితో రైలు వెళ్లిపోయి 15నిలు అయింది. తరవాతి రైలు గం.10.15నిలకు అని చెప్పాడు. అయితే ఈ సమాచారాన్ని విచారణాధికారి ప్రయాణికుడితో ఏ సమయంలో చెప్పాడు?
ఎ) గం. 9.10 ని. బి) గం. 10.20 ని.
సి) గం. 9.30 ని. డి) ఏదీకాదు
8. కింది సిరీస్‌లో ముందు సరిసంఖ్య, తరవాత బేసి సంఖ్య గల సరి సంఖ్యలు ఎన్ని ఉన్నాయి?
8 4 3 9 8 6 5 9 2 3 6 8 4 2 7 9 2 8 3 9
ఎ) రెండు బి) మూడు సి) నాలుగు డి) ఏమీ లేవు
9. ప్రశ్నార్థకం గుర్తు గల స్థానంలో వచ్చే సంఖ్యను తెలపండి

8	5	961
7	8	522
9	3	?

ఎ) 843 బి) 441 సి) 924 డి) 462
10. ప్రశ్నార్థకం గుర్తు గల స్థానంలో వచ్చే సంఖ్యను తెలపండి





Panditi Meenakshi Pavan
Senior Faculty

Competitive Exams Special

ఎ) 65 బి) 92 సి) 48 డి) 64
11. ఒక అంకె 3 కన్నా పెద్దది 7 కన్నా చిన్నది. అదే అంకె 5 కన్నా పెద్దది, 9 కన్నా చిన్నది. అయితే ఆ అంకె?
ఎ) 8 బి) 4 సి) 6 డి) 9
12. 1976 మే 25 ఏ వారం అవుతుంది?
ఎ) గురువారం బి) మంగళవారం
సి) బుధవారం డి) సోమవారం
13. కింది సిరీస్‌లో ముందు సరిసంఖ్య, తరవాత బేసి సంఖ్య గల బేసి సంఖ్యలు ఎన్ని ఉన్నాయి?
8 4 3 9 2 5 6 8 5 2 7 3 4 6 8 7 9 2 1 4 8 9 3
ఎ) నాలుగు బి) మూడు సి) రెండు డి) ఏమీలేవు
14. ఇంటర్వ్యూ నిర్వహించడానికి మేనేజింగ్ డైరెక్టర్ గం. 11.00 కంటే 15 ని.లు ముందుగా వచ్చారు. ఈయన చైర్మన్ కంటే 25ని.లు ముందు వచ్చారు. చైర్మన్ ఇంటర్వ్యూ సమయం కంటే 20 నిలు ముందు వచ్చారు. అయితే ఇంటర్వ్యూని ఎప్పుడు నిర్వహించాలనుకొన్నారు?
ఎ) గం. 11.00 ని. బి) గం. 11.30 ని.
సి) గం. 11.15 ని. డి) ఏదీకాదు
15. కింది పదాలను నిఘంటువు ప్రకారం అమర్చిన తరవాత మధ్యలో వచ్చే పదాన్ని తెలపండి?
1. Mobile 2. Master 3. Manner
4. Market 5. Minister
ఎ) Master బి) Minister
సి) Market డి) Mobile
16. అపసవ్యదిశ వర్ణమాల ప్రకారం కుడి నుంచి 12 వ అక్షరానికి గల అయిదో ఎడమ అక్షరం?
ఎ) P బి) R సి) Q డి) J
17. వర్ణమాలలోని మొదటి సగం అక్షరాలను సవ్య దిశలో రాసి రెండో సగం అక్షరాలను అపసవ్య దిశలో రాశారు. దీని ప్రకారం ఎడమ నుంచి పదో అక్షరానికి గల అయిదో కుడి అక్షరం?
ఎ) Z బి) Y సి) X డి) W
18. సవ్యదిశ వర్ణమాలలో కుడి ఆరో అక్షరం నుంచి పది అక్షరాలను అపసవ్యదిశలో రాసి మిగిలిన అక్షరాలను యధాతథంగా రాశారు. దీని ప్రకారం ఎడమ నుంచి పదో అక్షరానికి గల నాలుగో కుడి అక్షరం?
ఎ) U బి) R సి) T డి) S
19. 1956 ఆగస్టు 2న ఏవారమవుతుంది?
ఎ) శుక్రవారం బి) శనివారం
సి) గురువారం డి) బుధవారం
20. ఈ రోజు ఆగస్టు 19 గురువారం. ఇది లీపు సంవత్సరమయితే మూడేళ్ల క్రితం ఇదే తేదీకి ఏ వారం వస్తుంది?
ఎ) ఆదివారం బి) శనివారం
సి) సోమవారం డి) బుధవారం
21. 2001 జనవరి 1 శుక్రవారం అయితే తదుపరి వచ్చే ఏ సంవత్సరంలో జనవరి 1 శుక్రవారమవుతుంది?
ఎ) 2001 బి) 2007 సి) 2008 డి) ఏదీకాదు
22. ఈ రోజు నవంబరు 14 గురువారం. ఇది లీపు సంవత్సరం. అయితే అయిదేళ్ల తరవాత ఇదే తేదీకి ఏ వారమొస్తుంది?
ఎ) బుధవారం బి) మంగళవారం
సి) గురువారం డి) ఏదీకాదు
23. గడియారంలో సమయం గం.1.30ని. అయితే నిముషాల ముల్లు, గంటల ముల్లు మధ్య కోణం?
ఎ) 180° బి) 120° సి) 135° డి) 140°
24. విక్రం 50 మీ ఉత్తరానికి నడచిన తరవాత కుడివైపునకు తిరిగి 40 మీ నడిచాడు. మరల కుడివైపునకు తిరిగి 35 మీ నడచిన తరవాత కుడివైపునకు తిరిగి 25 మీ నడిచాడు. చివరగా ఎడమవైపునకు తిరిగి 15 మీ నడిచాడు. అయితే ప్రస్తుతం విక్రం బయలుదేరిన స్థానం నుంచి ఎంత దూరంలో ఏ దిశలో ఉన్నాడు?
ఎ) 15 మీ తూర్పు బి) 15 మీ పడమర
సి) 15 మీ ఉత్తరం డి) 15మీ దక్షిణం
25. గడియారంలో సమయం గం.12.00 అయింది. గంటల ముల్లు తూర్పును చూపిస్తోందనుకొంటే గం3.30నిల సమయంలో నిముషాల ముల్లు ఏ దిక్కును సూచిస్తోంది?
ఎ) తూర్పు బి) ఉత్తరం సి) దక్షిణం డి) పడమర

26 - 30

A, B లు భార్యాభర్తలు. X, Y లు సోదరులు. A కుమార్తె K. Y తల్లి B. M తండ్రి Y. Z కుమార్తె M. F భార్య K. T కుమారుడు A. K కుమారుడు N. పై సమాచారం ఆధారంగా కింది ప్రశ్నలకు సమాధానాలు తెలపండి?

26. T కి B ఏమవుతారు?
ఎ) కోడలు బి) అత్తగారు
సి) మామగారు డి) ఏదీకాదు
27. M కి K ఏమవుతారు?
ఎ) మేనల్లుడు బి) మేనత్త
సి) మేనమామ డి) మేనకోడలు
28. Z కి A ఏమవుతారు?
ఎ) అత్తగారు బి) కోడలు
సి) అల్లుడు డి) మామగారు
29. X కి N ఏమవుతారు?
ఎ) మేనకోడలు బి) మేనమామ
సి) మేనల్లుడు డి) మేనత్త
30. B కి F ఏమవుతారు?
ఎ) అల్లుడు బి) కోడలు
సి) మేనల్లుడు డి) మేనకోడలు

31 - 35

1. ఒక కళాశాలలో A, B, C, D, E, F, G, H, I, J అనే పది పరీక్షలను వారం రోజుల్లో నిర్వహించదలిచారు. ఆదివారం సెలవు. ప్రతి రోజు ఒకటి/ రెండు పరీక్షలు జరుగుతాయి.
2. B పరీక్షతోపాటు మరో పరీక్ష ఉంటుంది. కాని గురువారం కాదు.
3. A తో పరీక్షలన్నీ మంగళవారం మొదలౌతాయి
4. చివరి రోజు, శుక్రవారంనాడు ఒక పరీక్ష మాత్రమే ఉంటుంది. శుక్రవారం నాడు J పరీక్ష నిర్వహిస్తారు.
5. H పరీక్ష, D తరవాత ఉంటుంది. D పరీక్ష, F తరవాత ఉంటుంది.
6. చివరి రోజున E పరీక్ష ఉంటుంది. J పరీక్ష తరవాతి రోజు G, సెలవు రోజుకి ముందు రోజు I పరీక్ష ఉంటాయి. ఈ సమాచారం ఆధారంగా కింది ప్రశ్నలకు సమాధానాలు తెలపండి

31. సెలవు రోజుకి ముందు నిర్వహించే పరీక్షలు?
ఎ) D, B బి) G, I సి) H, C డి) ఏదీకాదు
32. H పరీక్ష రోజున ఉన్న మరో పరీక్ష?
ఎ) B బి) F సి) C డి) ఏదీకాదు
33. బుధవారం రోజున ఉన్న పరీక్ష?
ఎ) C, H బి) B, D సి) G, I డి) ఏదీకాదు
34. C పరీక్ష తరవాతి రోజు ఉండే పరీక్ష?
ఎ) E బి) F సి) J డి) ఏదీకాదు
35. మొదటి రోజు జరిగే పరీక్షలు?
ఎ) A, F బి) C, H సి) G, I డి) D, B
36. వినయ్ పడమరకు 80 మీ నడచిన తరవాత ఎడమవైపునకు తిరిగి 30 మీ నడిచాడు. మరల ఎడమకు తిరిగి 20 మీ నడిచాడు. చివరగా ఉత్తరానికి 110 మీ నడిచాడు. అయితే ఇప్పుడు వినయ్ బయలు దేరిన స్థానం నుంచి ఎంత దూరంలో ఏ దిశలో ఉన్నాడు?
ఎ) 100 మీ నైరుతి బి) 100 మీ వాయవ్యం
సి) 100 మీ ఈశాన్యం డి) 100 మీ ఆగ్నేయం

37 - 38

కింది పదాలకు అర్థవంతమైన రీతిలో సరైన క్రమాన్ని meaningful sequence of order తెలపండి

37. 1. Walls 2. Windows 3. Foundation
4. Roof 5. Room 6. Floor
ఎ) 3, 2, 5, 4, 1, 6 బి) 3, 1, 2, 4, 6, 5
సి) 3, 1, 2, 6, 4, 5 డి) 3, 1, 2, 4, 5, 6
38. 1. Rain 2. Rainbow 3. Child
4. Sun 5. Happy
ఎ) 1, 4, 2, 3, 5 బి) 1, 2, 3, 4, 5
సి) 1, 2, 4, 5, 3 డి) 1, 3, 4, 2, 3

సమాధానాలు

1) డి	7) ఎ	13) ఎ	19) సి	26) ఎ	33) బి
2) ఎ	8) సి	14) బి	20) ఎ	27) బి	34) సి
3) సి	9) బి	15) ఎ	21) బి	28) డి	35) ఎ
4) ఎ	10) ఎ	16) సి	22) ఎ	29) సి	36) బి
5) బి	11) సి	17) బి	23) సి	30) ఎ	37) బి
6) సి	12) బి	18) డి	24) ఎ	31) బి	38) ఎ
			25) డి	32) సి	

ఉద్యోగాలు JOBS

టిఎస్‌సిఎబి

తెలంగాణ స్టేట్ కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ లిమిటెడ్ (టిఎస్‌సిఎబి)- ఆర్‌బిఐ/ నాబార్డ్ సహకారంతో కింది అయిదు డిసిసిబి బ్యాంకుల్లో చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది.
డిసిసిబి బ్యాంకులు: హైదరాబాద్, మహబూబ్‌నగర్, కరీంనగర్, ఖమ్మం, వరంగల్.
వయసు: 55 ఏళ్లు మించరాదు
అర్హత: పీజీ/ సీఏ/ డిగ్రీ + సిఎఐఐబి/ డిబిఎఫ్/ డిప్లొమా(కో ఆపరేటివ్ బిజినెస్ మేనేజ్‌మెంట్)/ పీజీడిసిఆర్ఎస్ పూర్తిచేసి ఉండాలి. బ్యాంకింగ్ రంగంలో కనీసం ఎనిమిదేళ్లు మిడిల్/ సీనియర్ మేనేజ్‌మెంట్ కేడర్‌లో పనిచేసి ఉండాలి.
దరఖాస్తు ఫీజు: రూ.500
ఆసక్తిగల అభ్యర్థులు వెబ్‌సైట్ నుంచి దరఖాస్తుఫారాన్ని డౌన్‌లోడ్ చేసుకొని నింపి కింది చిరునామాకు పంపుకోవాలి.
దరఖాస్తు డౌన్‌లోడింగ్‌కు ఆఖరు తేదీ: ఆగస్టు 31
దరఖాస్తు సబ్మిషన్‌కు ఆఖరు తేదీ: సెప్టెంబరు 7
చిరునామా: Managing Director, TSCAB, Head Office, Troop Bazar, Hyderabad- 500001
వెబ్‌సైట్: www.tscab.org

స్కాలర్‌షిప్

టైమ్-క్యాట్ మాక్ టెస్ట్

మేనేజ్‌మెంట్ ఎంట్రెన్స్ టెస్ట్‌లకు శిక్షణ ఇచ్చే ప్రముఖ సంస్థ **'టైమ్'** క్యాట్ ఔత్సాహికుల కోసం దేశ వ్యాప్తంగా ఆగస్టు 13న ఆల్ ఇండియా ఫ్రీ మాక్ టెస్ట్‌ను నిర్వహించనుంది. ఇన్విజిలేట్, నాన్ ఇన్విజిలేట్ పద్ధతుల్లో ఈ మాక్ టెస్ట్ ఉంటుంది. ఈ టెస్ట్‌లో చక్కని ప్రతిభ చూపిన వారికి 2017/18 క్యాట్ క్లాస్ రూమ్ ప్రోగ్రామ్, టెస్ట్ సిరీస్‌లపై ఫీజులో రాయితీ ఇస్తారు. అయితే ఈ అవకాశం ఇన్విజిలేట్ మోడ్‌ను ఎంపిక చేసుకున్న వారికి మాత్రమే వర్తిస్తుంది. రియల్ టైమ్ ఎగ్జామ్ ఎక్స్‌పీరియెన్స్ కల్పించేలా ఈ మాక్ టెస్ట్‌ను రూపొందించినట్లు టైమ్ క్యాట్ కోర్స్ డైరెక్టర్ రామనాథ్ కనకదండి తెలిపారు.
రిజిస్ట్రేషన్ లింక్: http://www.time4education.com/local/articlecms/page.php?id=1030
వెబ్‌సైట్: www.time4education.com

మెదడులోని ఏ భాగాన్ని ఆల్కహాల్ ప్రభావితం చేస్తుంది?

మానవ శరీరం

1. మానవ శరీరంలోని అతిపెద్ద గ్రంధి ఏది?
ఎ) అవటు గ్రంధి బి) క్లోమ గ్రంధి
సి) కాలేయం డి) పీయూష గ్రంధి

2. మానవ దేహంలోని అతి పెద్ద అవయవం ఏది?
ఎ) కాలేయం బి) చర్మం
సి) అవటు గ్రంధి డి) గుండె

3. మానవ శరీరంలోని అంతర్గత అవయవాల్లో పెద్దది?
ఎ) కాలేయం బి) చర్మం
సి) గుండె డి) పీయూష గ్రంధి

4. మానవ దేహంలో యూరియా సంశ్లేషణ జరిగే ప్రదేశం?
ఎ) మూత్రపిండాలు బి) ప్లీహం
సి) క్లోమం డి) కాలేయం

5. మానవ శరీరంలో పొడవైన ఎముక ఏది?
ఎ) స్టెపిస్ బి) ఫిమర్ సి) టిబియ డి) టార్సస్

6. మానవ శరీరంలోని చిన్న ఎముక ఏది?
ఎ) స్టెపిస్ బి) ఫిమర్ సి) టిబియ డి) టార్సస్

7. వయోజన మానవునిలో ఉండే మొత్తం ఎముకలెన్ని?
ఎ) 180 బి) 306 సి) 156 డి) 206

8. మానవునిలో ఉండే పక్కటెముకల సంఖ్య?
ఎ) 33 బి) 26 సి) 12 జతలు డి) 14

9. వయోజన మానవుని వెన్నుముకలో ఎన్ని ఎముకలుంటాయి?
ఎ) 33 బి) 26 సి) 22 డి) 14

10. మానవుని కపాలంలో ఎన్ని ఎముకలుంటాయి?
ఎ) 22 బి) 14 సి) 8 డి) 18

11. మానవుని పుర్రెలో ఎన్ని ఎముకలుంటాయి?
ఎ) 14 బి) 8 సి) 22 డి) 26

12. మానవుని ముఖ భాగంలో ఉండే ఎముకలు ఎన్ని?
ఎ) 14 బి) 22 సి) 8 డి) 30

13. మానవ శరీరంలోని థర్మోస్టాట్ అని దేన్ని పిలుస్తారు?
ఎ) థైమస్ బి) కాలేయం
సి) హైపోథాలమస్ డి) ప్లీహం

14. మానవ శరీరంలో రక్తనిధి అని దేన్ని పిలుస్తారు?
ఎ) కాలేయం బి) ప్లీహం సి) గుండె డి) ఎముక

15. ఎర్రరక్త కణాల శ్మశానవాటిక అని దేన్ని అంటారు?
ఎ) ఎముక బి) గుండె సి) కాలేయం డి) ప్లీహం

16. మెదడులోని ఏ భాగాన్ని ఆల్కహాల్ ప్రభావితం చేస్తుంది?
ఎ) మస్తిష్కం బి) అనుమస్తిష్కం
సి) ద్వారగోర్థం డి) హైపోథాలమస్

17. జ్ఞాపకశక్తిని నియంత్రించే మెదడులోని భాగం?
ఎ) మస్తిష్కం బి) అనుమస్తిష్కం
సి) ద్వారగోర్థం డి) హైపోథాలమస్

18. కోపాన్ని నియంత్రించే మెదడులోని భాగం?
ఎ) ద్వారగోర్థం బి) హైపోథాలమస్
సి) అనుమస్తిష్కం డి) మస్తిష్కం

19. మెదడులోని ఏ భాగాన్ని అనుమస్తిష్కం అని అంటారు?
ఎ) ముందు భాగం బి) మధ్య భాగం
సి) వెనుక భాగం డి) హైపోథాలమస్

19. పోరాట, పలాయన హార్మోన్ అని దేన్ని పిలుస్తారు?
ఎ) థైరాక్సిన్ బి) ఎపినెఫ్రిన్
సి) పారాథైరాక్సిన్ డి) ఇన్సులిన్

21. మాస్టర్ గ్రంధి అని దేన్ని పిలుస్తారు?
ఎ) పీయూష గ్రంధి బి) అవటు గ్రంధి
సి) క్లోమ గ్రంధి డి) అధివృక్క గ్రంధి


ఆర్. సురేష్
సీనియర్ ఫ్యాకల్టీ

పోటీ పరీక్షల ప్రత్యేకం - బయాలజీ

22. ఆడమ్స్ ఆపిల్ గ్రంధి అని దేన్ని పిలుస్తారు?
ఎ) అవటు గ్రంధి(థైరాయిడ్) బి) పీయూష గ్రంధి
సి) అధివృక్క గ్రంధి డి) క్లోమం

23. కింది వాటిలో మిశ్రమ గ్రంధి ఏది?
ఎ) క్లోమం బి) కాలేయం సి) థైమస్ డి) పైవన్నీ

24. మూత్రపిండాలపై ఉండే గ్రంధి?
ఎ) థైమస్ బి) క్లోమం
సి) అధివృక్క గ్రంధి డి) అవటు గ్రంధి

25. ఇన్సులిన్ హార్మోన్‌ను స్రవించే గ్రంధి?
ఎ) క్లోమం బి) కాలేయం
సి) ప్లీహం డి) పీయూష గ్రంధి

26. మరుగుజ్జుల్లో తక్కువగా ఉండే హార్మోన్ ఏది?
ఎ) ఇన్సులిన్ బి) థైరాక్సిన్
సి) పెరుగుదల హార్మోన్ డి) పైవన్నీ

27. 'క్రెటినిజం' వ్యాధి ఉన్న పిల్లల్లో ఏ హార్మోన్ తక్కువగా ఉంటుంది?
ఎ) థైరాక్సిన్ బి) ఇన్సులిన్
సి) వాసోప్రెసిన్ డి) ఎపినెఫ్రిన్

28. ప్రసవ సమయంలో ఉత్పత్తి అయ్యే హార్మోన్ ఏది?
ఎ) ఆక్సిటోసిన్ బి) ప్రొజెస్టిరాన్
సి) ప్రోలాక్టిన్ డి) ఈస్ట్రోజన్

29. రక్తంలో ఉండే పొటాష్ స్థాయిని నియంత్రించే గ్రంధి?
ఎ) అవటు గ్రంధి బి) పార్శ్వ అవటు గ్రంధి
సి) పీయూష గ్రంధి డి) క్లోమ గ్రంధి

30. ఉరఃకుహరంలో ఉండే గ్రంధి?
ఎ) థైమస్ బి) పీయూష గ్రంధి
సి) అవటు గ్రంధి డి) ఏదీకాదు

31. పేస్ మేకర్ ఏ అవయవానికి సంబంధించింది?
ఎ) గుండె బి) మూత్రపిండం
సి) కాలేయం డి) మెదడు

32. లింఫోసైట్ కణాలను ఉత్పత్తి చేసే గ్రంధి?
ఎ) క్లోమం బి) కాలేయం
సి) థైమస్ డి) జఠర గ్రంధి

33. లాలాజల గ్రంథులు స్రవించే ఎంజైమ్ ఏది?
ఎ) ట్రిప్సిన్ బి) పెప్సిన్ సి) లైపేజ్ డి) టైలిన్

34. జఠర గ్రంథులు స్రవించే ఎంజైమ్ ఏది?
ఎ) ట్రిప్సిన్ బి) పెప్సిన్ సి) లైపేజ్ డి) అమైలేజ్

35. ఎంజైములు, హార్మోన్‌లను ఉత్పత్తి చేసే గ్రంధి?
ఎ) పీయూష గ్రంధి బి) కాలేయం
సి) క్లోమం డి) జఠర గ్రంధి

36. క్లోమ గ్రంధి స్రవించే ఎంజైమ్ ఏది?
ఎ) ట్రిప్సిన్ బి) లైపేజ్ సి) అమైలేజ్ డి) పైవన్నీ

37. డయాబెటిస్ ఇన్ సిపిడస్ వ్యాధి ఉన్నవారిలో ఏ హార్మోన్ తక్కువగా ఉంటుంది?
ఎ) ఇన్సులిన్ బి) థైరాక్సిన్
సి) వాసోప్రెసిన్ డి) గ్లూకగాన్

38. టిటనీ వ్యాధి ఉన్నవారిలో ఏ హార్మోన్ లోపిస్తుంది?
ఎ) పారాథైరాక్సిన్ బి) థైరాక్సిన్
సి) ప్రోలాక్టిన్ డి) ఇన్సులిన్

39. మెదడులోని ఏ భాగాన్ని చిన్న మెదడు అని అంటారు?
ఎ) మస్తిష్కం
బి) అనుమస్తిష్కం
సి) హైపోథాలమస్
డి) ద్వారగోర్థం



40. వ్యాధికారక బ్యాక్టీరియాను చంపే రక్తకణాలు?
ఎ) రక్త ఫలకికలు బి) ఎర్రరక్త కణాలు
సి) తెల్లరక్త కణాలు డి) పైవన్నీ

41. వయోజన మానవుని శ్వాసక్రియ రేటు?
ఎ) 32 బి) 18 సి) 72 డి) 10

42. మెదడు : మెనింజెస్ :: ఊపిరితిత్తులు : ....
ఎ) వాయుగోణులు బి) క్రయ
సి) ప్లూరా డి) వృక్కాలు

43. హిమోసైటోమీటర్‌ను దేని కోసం ఉపయోగిస్తారు?
ఎ) రక్త పీడనం కొలిచేందుకు
బి) రక్తకణాలను లెక్కించేందుకు
సి) రక్తాన్ని శుద్ధి చేయడం కోసం
డి) గుండె పనితీరు తెలుసుకోవడం కోసం

44. ఎర్రరక్త కణం సగటు జీవితకాలం ఎన్ని రోజులు?
ఎ) 180 బి) 90 సి) 120 డి) 13


45. మానవునిలో ఉండే జ్ఞానదంతాలు ఎన్ని?
ఎ) 4 బి) 2 సి) 8 డి) 6

46. కింది ఏ జంతువులో రధనికలు క్షీణించి ఉంటాయి?
ఎ) పులి బి) గేదె సి) కుక్క డి) ఏదీకాదు

47. మానవ శరీరంలోని అతిచిన్న కణం?
ఎ) అండం బి) నాడీకణం
సి) ఎర్రరక్తకణం డి) శుక్రకణం

48. ఏ అవయవం పనిచేయనపుడు డయాలసిస్ చేస్తారు?
ఎ) గుండె బి) ఊపిరితిత్తులు
సి) మూత్రపిండాలు డి) కాలేయం

49. పైత్య రసాన్ని స్రవించే గ్రంధి ఏది?
ఎ) కాలేయం బి) క్లోమం
సి) థైమస్ డి) ప్లీహం



50. కింది వాటిలో జ్ఞానేంద్రియం కానిది?
ఎ) చర్మం బి) కన్ను సి) నాలుక డి) ఉండుకం

51. ఫారన్ హీట్ డిగ్రీల్లో మానవుని సాధారణ ఉష్ణోగ్రత ఎంత?
ఎ) 37 బి) 72 సి) 98.4 డి) 104

52. ఎలర్జీ ఉన్న వ్యక్తి రక్తంలో ఏ కణాలు పెరుగుతాయి?
ఎ) రక్తఫలకికలు బి) ఎర్రరక్త కణాలు
సి) ఇసినోఫిల్స్ డి) లింఫోసైట్లు

53. ఆరోగ్యవంతుడైన మానవుని నాడీ పీడనం ఎంత?
ఎ) 72 బి) 120 సి) 40 డి) 18

54. బ్లడ్ బ్యాంకుల్లో రక్తాన్ని నిల్వ చేసేందుకు రక్తంలో కలిపే పదార్థం?
ఎ) సోడియం క్లోరైడ్ బి) సోడియం సిట్రేట్
సి) అమ్మోనియం క్లోరైడ్ డి) పైవన్నీ

55. మానవ గర్భావధి కాలం?
ఎ) 360 రోజులు బి) 270 రోజులు
సి) 180 రోజులు డి) 240 రోజులు

సమాధానాలు

1) సి	9) బి	17) ఎ	27) ఎ	37) సి	47) డి
2) బి	10) సి	18) ఎ	28) ఎ	38) ఎ	48) సి
3) ఎ	11) సి	19) సి	29) బి	39) బి	49) ఎ
4) డి	12) ఎ	20) బి	30) ఎ	40) సి	50)డి
5) బి	13) సి	21) ఎ	31) ఎ	41) బి	51) సి
6) ఎ	14) బి	22) ఎ	32) సి	42) బి	52) సి
7) డి	15) డి	23) ఎ	33) డి	43) బి	53) సి
8) సి	16) డి	24) సి	34) బి	44) సి	54) బి
		25) ఎ	35) సి	45) ఎ	55) బి
		26) సి	36) డి	46) బి	

JOBS ఉద్యోగాలు

పిజెటిఎస్ఎయు

హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్(ఎస్సీ& ఎస్టీ బ్యాక్‌లాగ్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
ఖాళీలు: 18
విభాగాలవారీ ఖాళీలు: అగ్రికల్చర్ 10, అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ & టెక్నాలజీ 5, హోం సైన్స్ 3
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 12
దరఖాస్తు హార్డ్ కాపీ చేరేందుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 21
వెబ్‌సైట్: www.pjtsau.ac.in

ఐటిబిపి

ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ ఫోర్స్(ఐటిబిపి)- సబ్ ఇన్‌స్పెక్టర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
ఖాళీలు: 21 (మహిళలకు 3, పురుషులకు 18)
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 22
వెబ్‌సైట్: www.recruitment.itbpolice.nic.in
www.itbpolice.nic.in

వీఎస్ఎస్‌సి

ఇస్రో ఆధ్వర్యంలోని విక్రం సారాభాయ్ స్పేస్ సెంటర్ (వీఎస్ఎస్‌సి)- **టెక్నీషియన్ అప్రెంటీస్**ల భర్తీకి ప్రకటన విడుదల చేసింది.
మొత్తం ఖాళీలు: 158
విభాగాలవారీ ఖాళీలు: ఆటోమొబైల్ 8, కెమికల్ 25, సివిల్ 8, కంప్యూటర్ సైన్స్ 15, ఎలక్ట్రికల్ 10, ఎలక్ట్రానిక్స్ 40, ఇన్‌స్ట్రుమెంట్ టెక్నాలజీ 6, మెకానికల్ 46
ట్రైనింగ్ వ్యవధి: ఏడాది
అర్హత: 60 శాతం మార్కులతో సంబంధిత విభాగంలో మూడేళ్ల డిప్లొమా పూర్తిచేసి ఉండాలి. అయితే 2015 ఏప్రిల్ తరవాత డిప్లొమా పూర్తిచేసినవారు మాత్రమే దరఖాస్తుకు అర్హులు. శాండ్‌విచ్ డిప్లొమాస్/ ప్రైవేట్ డిప్లొమాస్/ షార్ట్ టర్మ్ కోర్సులు/ సర్టిఫికెట్ కోర్సులను పరిగణనలోకి తీసుకోరు.
వయసు: ఇంటర్వ్యూ నాటికి 30 ఏళ్లు మించరాదు
స్టయిపెండ్: నెలకు రూ.3542
ఎంపిక: ఇంటర్వ్యూ ద్వారా **ఇంటర్వ్యూ:** ఆగస్టు 19
వేదిక: Govt.polytechnic College, kalamassery, Ernakulam District, Kerala
ఆసక్తిగల అభ్యర్థులు ముందుగా www.mhrdnats.gov.in/ www.sdcentre.org వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవాలి.
వెబ్‌సైట్: http://www.vssc.gov.in/VSSC V4/images/

కొచ్చిన్ షిప్‌యార్డ్

కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్- **గ్రాడ్యుయేట్, టెక్నీషియన్ అప్రెంటీస్**ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
గ్రాడ్యుయేట్ అప్రెంటీస్ ఖాళీలు: 72
విభాగాలవారీ ఖాళీలు: ఎలక్ట్రికల్ 12, మెకానికల్ 27, ఎలక్ట్రానిక్స్ 6, సివిల్ 12, కంప్యూటర్ సైన్స్/ కంప్యూటర్ అప్లికేషన్స్/ ఐటి 8, సేఫ్టీ 3, మెరైన్ 2, నేవల్ ఆర్కిటెక్చర్ & షిప్ బిల్డింగ్ 2
అర్హత: సంబంధిత విభాగంలో బిఇ/ బిటెక్ పూర్తిచేసి ఉండాలి.
ట్రైనింగ్ వ్యవధి: ఏడాది
స్టయిపెండ్: నెలకు రూ.8,000
టెక్నీషియన్ అప్రెంటీస్ ఖాళీలు: 100
విభాగాలవారీ ఖాళీలు: ఎలక్ట్రికల్ 22, మెకానికల్ 28, ఎలక్ట్రానిక్స్ 8, ఇన్‌స్ట్రుమెంటేషన్ 7, సివిల్ 9, కంప్యూటర్ 6, కమర్షియల్ ప్రాక్టీస్ 20
అర్హత: సంబంధిత విభాగంలో డిప్లొమా పూర్తిచేసి ఉండాలి.
ట్రైనింగ్ వ్యవధి: ఏడాది
స్టయిపెండ్: నెలకు రూ.7,000
ఎంపిక: అకడమిక్ మెరిట్ ఆధారంగా
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఆగస్టు 31
వెబ్‌సైట్: www.cochinshipyard.com/ career/ Notification

ఇచ్ఛాపురంలో జోరువాన

ఇచ్ఛాపురం : పట్టణంలో మధ్యాహ్నం కురిసిన వర్షానికి రోడ్లు జలమయమయ్యాయి. ఉదయం నుంచి తీవ్ర ఎండ, ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరైన ప్రజలు ఈ వర్షంతో సేదతీరారు. వరి చేలు ఎండిపోతున్న తరుణంలో ఈ వర్షం పడడంతో రైతన్నలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.





విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ

పాఠశాలల బలోపేతానికి సహకరించండి

శిలగాం(కవిటి రూరల్): ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి గ్రామస్థులు సహకారం అందించాలని ఎంఈవో ధనుంజయమజ్జి అన్నారు. శుక్రవారం శిలగాం జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేశారు. ఎంపీపీ కిరణ్‌కుమారి, జడ్పీటీసీ సభ్యుడు రమేష్ మాట్లాడుతూ, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రభుత్వం అన్ని మౌలిక వసతులు కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కడియాల ప్రకాష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహాలక్ష్మికి సహస్ర మందార అర్చన



సత్యనారాయణ స్వామి దేవాలయంలో భక్తుల పూజలు



మందార పూలతో మహాలక్ష్మీదేవిని అలంకరించిన దృశ్యం

ఇచ్ఛాపురం :శ్రావణ శుక్రవారం పురస్కరించుకొని స్థానిక చిన్న జగన్నాథస్వామి ఆలయంలో కొలువైన మహాలక్ష్మీదేవికి మందార పూలతో సహస్ర నామార్చన చేశారు. ఉదయం అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు కుంకుమ పూజలు, లక్ష్మీ పారాయణం చేపట్టారు. ● ఇచ్ఛాపురం పట్టణంలోని సత్యనారాయణస్వామి ఆలయంలో రమాదేవి అమ్మవారికి మహిళలు శ్రావణ శుక్రవారం పూజలు చేశారు. పెద్ద జగన్నాథస్వామి ఆలయంలో లక్ష్మీదేవికి, కాశీవిశ్వనాథ ఆలయంలో పద్మావతికి, సంతోషిమాత గుడిలో సంతోషి రూపాదేవికి ప్రత్యేకంగా అలంకరించి కుంకుమ పూజలు చేపట్టారు.

సేంద్రియ ఎరువులపై దృష్టిపెట్టాలి

లక్ష్మీపురం(సంతబొమ్మాళి): రైతులు సేంద్రియ ఎరువులపై దృష్టి పెట్టాలని రిసోర్స్‌పర్సన్ బి.జగన్నాథరావు అన్నారు. శుక్రవారం ఆయన సంతబొమ్మాళి పంచాయతీ లక్ష్మీపురంలో రైతులకు శిక్షణ ఇచ్చారు. రసాయనిక ఎరువులపై ఎక్కువ ఆధారపడుతుండడంతో పెట్టుబడులు పెరిగిపోతున్నాయన్నారు. అదే రైతులకు అందుబాటులో ఉండే సేంద్రియ ఎరువులను సొంతంగా తయారుచేసుకొని వాడితే మంచి దిగుబడి లభిస్తుందని చెప్పారు. అందుకోసం ఎంపికచేసిన గ్రామాల్లో సేంద్రియ ఎరువుల వాడకంపై రైతులకు శిక్షణ ఇస్తున్నామన్నారు మొదటగా లక్ష్మీపురంలో శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి సత్యన్నారాయణ పాల్గొన్నారు.

దిమ్మిడిజోలలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

దిమ్మిడిజోల(నందిగాం): దిమ్మిడిజోలలో శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండల ధర్మప్రచారక్ మల్లారెడ్డి శ్రీనివాస్ భాగవతార్ నేతృత్వంలో స్థానిక రామాలయ ప్రాంగణంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కాపుతెంబూరుకు చెందిన దత్తాశ్రమ పీఠాధిపతి నిర్విశ్యానంద స్వామీజీ ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నాగమ్మ కృష్ణారావు, భక్తిమండలి సభ్యులు, డివిజినల్ సమరసత సేవా ఫౌండేషన్ కన్వీనర్ చంద్రశేఖరరావు పాల్గొన్నారు.

బహిరంగ మలవిసర్జన చేయవద్దు



కవిటి బస్టాండ్‌లో మానవహారం నిర్వహించిన దృశ్యం, మాట్లాడుతున్న ఏపీడీ లవరాజు

కవిటి : బహిరంగ మలవిసర్జన సాంఘిక దురాచారమని ఇన్‌చార్జి ఎంపీడీవో డి.సుదర్శనరావు అన్నారు. బహిరంగ మలవిసర్జన విముక్తి వారోత్సవాల్లో భాగంగా కవిటిలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. బహిరంగ మలమూత్ర విసర్జన చేయవద్దని, మరుగు దొడ్లను వినియోగించుకోవాలని నినాదాలు చేశారు. విద్యార్థులకు క్విజ్, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో ధనుంజయ మజ్జి, సూపరింటెండెంట్ బీవీ రమణ, తదితరులు పాల్గొన్నారు.

మరుగుదొడ్లు నిర్మించుకోండి

ఇచ్ఛాపురం రూరల్ : వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఏపీడీ లవరాజు తెలిపారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయన అధికారులతో సమావేశం నిర్వహించారు. బహిరంగా మల విసర్జన చేయవద్దని ప్రజలను చైతన్య పరచాలన్నారు. మరుగుదొడ్లు నిర్మించుకునేలా వారికి అవగాహన కల్పించాలన్నారు. నిర్మాణాలు పూర్తి చేసిన వారికి త్వరగా బిల్లులు చెల్లించాలని ఆదేశించారు. ప్రతి గ్రామంలో వంద మరుగుదొడ్లను నిర్మించే బాధ్యత అధికారులపై ఉందని, ఒక్కో గ్రామాన్ని దత్తత తీసుకొని అభివృద్ధి చేయాలని సూచిం చారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి.రామకృష్ణ, ఏవో బి.నరసింహామూర్తి, ఎంపీఈవో ఎస్.ప్రమీల, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూలకు 214 మంది హాజరు



కంచిలి, సోంపేటలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న బ్యాంకుల అధికారులు

కంచిలి: బీసీ, ఎస్సీ, ఎస్టీ, కాపు కార్పొరేషన్ ద్వారా రుణాలు అందించేందుకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇన్‌చార్జి అధికారి ఎం.మన్మధరావు ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ఇంటర్వ్యూలకు 214 మంది హాజరయ్యారు. బీసీ కార్పొరేషన్‌కు 118 మందికి లక్ష్యం కాగా 141 మంది, కాపు రుణ యూనిట్లు 20 లక్ష్యం కాగా 32మంది హాజరయ్యారు. 19 ఎస్సీ యూనిట్లకు 36 మంది, 8 ఎస్టీ యూనిట్లకు ఐదుగురు వచ్చారు. ఎస్‌బీఐ, ఏపీజీవీబీ, ఆంధ్రా బ్యాంక్, డీసీసీబీ మేనేజర్లు ఇంటర్వ్యూలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల జన్మభూమి కమిటీ సభ్యులు ఎం.రామారావు, బి.కురయ్య,జగదీష్‌పట్నాయక్, బి.కామేష్‌రెడ్డి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

సోంపేట: బీసీ కార్పొరేషన్ రుణాల కోసం మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ఇంటర్వ్యూలకు 265మంది హాజరయ్యారు. కాపుకార్పొరేషన్ రుణాలకు 45మంది దరఖాస్తు చేసుకోగా 30 మంది హాజరైనట్టు ఎంపీడీవో సీహెచ్ మల్లేశ్వరరావు తెలిపారు.

48 ఎస్సీ యూనిట్లకు 25మంది, 10 ఎస్టీ యూనిట్లకు 10, బీసీ కార్పొరేషన్ రుణాల కోసం 248 మంది దరఖాస్తు చేసుకోగా 182 మంది వచ్చారు. ఎంపీపీ చిత్రాడ శ్రీనివాసరావు, జడ్పీటీసీ సభ్యుడు సూరాడ చంద్రమోహన్, పలు బ్యాంకుల మేనేజర్లు ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు చేపట్టారు.

సమస్యలు త్వరితగతిన పరిష్కరించుకోవాలి



మాట్లాడుతున్న ఆర్డీవో వెంకటేశ్వరరావు

నందిగాం: రెవెన్యూపరంగా రైతులకు ఎదురవుతున్న సమస్యల్ని త్వరితగతిన పరిష్కరించుకోవాలని ఆర్డీవో ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం మండలంలోని నందిగాం, పెద్దగురువూరు, చిన్నగురువూరు, చిన్నతామరపల్లి, పోతులూరు గ్రామాల్లో తహసీల్దార్ ఎస్‌వీ నాగేశ్వరరావు, ఉప తహసీల్దార్ వి.లక్ష్మీనారాయణ, ఆర్ఐ పి.కామేశ్వరరావు బృందాలుగా సభలు నిర్వహించారు. నందిగాం లో ఆర్డీవో మాట్లాడుతూ ప్రతి రైతు 1బీ, అడంగల్‌ను తమవద్దనున్న పట్టాదారు పాసుపుస్తకంతో పరిశీలించుకొని తేడా ఉంటే రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకువస్తే వాటిని సకాలంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటారని చెప్పారు. రైతుకు ఎదురవుతున్న సమస్యలను అధికారులు దృష్టికి తీసుకువచ్చేందుకు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్వేయర్ జోగారావు, ఆర్ఐ జగన్మోహనరావు పాల్గొన్నారు.

అధికారుల ఫోన్‌నెంబర్లు

తహసీల్దార్:	
ఎం.సురేష్	83398-87881
ఎంపీడీవో	
పి.రామకృష్ణ	8790007929
వ్యవసాయ అధికారి	
బి.నరసింహామూర్తి	8886612652
మండల విద్యాశాఖాధికారి	
ఎం.మురళీకృష్ణ	9441729951
మున్సిపల్ కమిషనర్	
పి.రవిబాబు	9849905782
ఏఈ (హౌసింగ్)	
కె.రాజగోపాల్	7093930228
మండల ఇంజనీరింగ్ అధికారి	
ఆర్. డొలాయ్	9553520599
ఏఈ (రూరల్ వాటర్ సప్లై)	
ఎ.మురళీకిషోర్	7702113335
పశువైద్యాధికారి	
టి.శిరీష	8790996646
వెలుగు ఏపీఎం	
ఎస్.ప్రసాద్	8008803897
ఎన్ఆర్‌జీఎస్ ఏపీవో	
ప్రమీలా	8790007651
ఆర్అండ్‌బీ జేఈ	
రవికాంత్	9440459129
ఐసీడీఎస్ పీవో	
డి.నాగమణి	9618104943

ఇచ్ఛాపురం

వైద్య సమాచారం

● కవిటి మండలం మాణిక్యపురం పీహెచ్‌సీ పరిధిలోని తలతంపర, తలగాన పుట్టుగ గ్రామాల్లో శనివారం చందన్న సంచార వైద్య సేవలు అందించనున్నట్టు సంబంధిత అధికారులు తెలిపారు. రోగులను పరీక్షించి మందులు అందజేసామని, ఈ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గ్యాస్ సమాచారం

● సోంపేట శ్రీ సాయి ఏజెన్సీలో ఈ నెల 11 న గ్యాస్ బుకింగ్ చేసుకునే పట్టణ వినియోగదారులకు 12న, రూరల్ ప్రాంత వినియోగదారులకు 13న సిలిండర్లు పంపిణీ చేస్తామని ఏజెన్సీ ప్రతినిధులు తెలిపారు.

● ఇచ్ఛాపురం సిద్ధభైరవి గ్యాస్ ఏజెన్సీ ద్వారా కవిటి మండలంలోని రాజపురం, వింజగిరి, బైరిపురం, చండిపుట్టుగ, శిలగాం, కాజూరు, కరాపాడు, ఫైవేలో శనివారం గ్యాస్ సరఫరా చేస్తామని ఏజెన్సీ ప్రతినిధి వెంకటేష్ తెలిపారు.

సినిమాలు

సోంపేట
శ్రీనివాస.. లై
శివ...... నేనే రాజు..నేనే మంత్రి

ఇచ్ఛాపురం
పూర్ణ ... నేనే రాజు నేనే మంత్రి
శ్రీమణికంఠ.. జయ జానకి నాయక

కవిటి
మహాలక్ష్మి.. నేనే రాజు నేనే మంత్రి
అశోక్..... లై

సోంపేటలో పిడుగు కలకలం

సోంపేట : పట్టణంలో శుక్రవారం సాయంత్రం పడిన పిడుగు కలకలం సృష్టించింది. మహదేవిపేటలోని కొట్ని గురుమూర్తి ఇంటి వద్ద విద్యుత్ స్తంభంపై పిడుగు పడింది. దీంతో స్తంభం గోడపై కూలడంతో ఆ గోడ అంచు విరిగిపోయింది. పలువురి ఇంట్లో ఇన్వర్టర్లు సైతం పాడయ్యాయి. అయితే ఎటువంటి ప్రాణనష్టం లేకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.


గోడ విరిగిపోయిన దృశ్యం

పిల్లలకు ఎంఆర్ టీకా తప్పనిసరి





కన్నుపుట్టుగలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, మహర్షి విద్యానికేతన్ విద్యార్థులకు టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

కన్నుపుట్టుగ(కవిటిరూరల్): తట్టు(మీజిల్స్), రుబెల్లా నివారణకు పిల్లలకు తప్పనిసరిగా ఎంఆర్ వ్యాక్సిన్ వేయించాలని కన్నుపుట్టుగ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోపాల్‌రెడ్డి తెలిపారు. ఎంఆర్ టీకాపై శుక్రవారం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తట్టు, రుబెల్లా వ్యాధులు ప్రాణాంతకమైనవని, వీటి నుంచి పిల్లలను రక్షించుకునేందుకు ఎంఆర్ టీకా వేయాలన్నారు. తొమ్మిది నెలల చిన్నారి నుంచి 15 ఏళ్ల పిల్లలకు ఈ వ్యాక్సిన్ వేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

సోంపేట: స్థానిక మహర్షి విద్యానికేతన్ విద్యార్థులకు శుక్రవారం ఎంఆర్(మీజిల్స్, రుబెల్లా)వ్యాక్సిన్ వేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు ఈ వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయించాలని కొర్లాం పీహెచ్‌సీ సిబ్బంది తెలిపారు.

ఇచ్ఛాపురం: స్థానిక స్వర్ణభారతి హైస్కూల్‌లో 800 మంది పిల్లలకు ఎంఆర్ వ్యాక్సిన్ వేసినట్టు అర్బన్ ఆరోగ్య కేంద్ర వైద్యుడు రాజశేఖర్ తెలిపారు. శుక్రవారం పాఠశాల విద్యార్థులతో కలిసి పుర వీధుల్లో ఎంఆర్ వ్యాక్సిన్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ తులసీదాస్‌రెడ్డి, వైద్య సిబ్బంది కరుణ, శాంతకుమారి, ప్రసన్న , వెంకటలక్ష్మి, ఆదిలక్ష్మి, దేవరాజు, రీనా పాల్గొన్నారు.

● కె.శాసనాం పాఠశాలలో 300మంది విద్యార్థులకు ఎంఆర్ వ్యాక్సిన్ వేసినట్టు వైద్య సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బాబ్జి, ఎంపీటీసీ సభ్యుడు మోహన్‌రావు, లోహిదాస్ పాల్గొన్నారు.


స్వర్ణభారతి పాఠశాలలో చిన్నారులకు టీకా ...

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు


ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణ

సోంపేట : స్థానిక రవీంద్రభారతి పాఠశాలలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. చిన్నారులు శ్రీకృష్ణుడి వేషధారణలో అలరించారు. ఈ సందర్భంగా ఫ్యాన్సీ డ్రెస్ పోటీలను నిర్వహించారు. వివిధ రకాల వస్త్రధారణలతో విద్యార్థులు ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వి.నాగరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆటల పోటీలు


కవిటి హైస్కూల్‌లో ఖోఖో ఆడుతున్న విద్యార్థినులు

కవిటి: పంద్రాగస్టును పురస్కరించుకొని పాఠశాలలు, కళాశాలల్లో ఆటల పోటీలను నిర్వహిస్తున్నారు. ఈ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. క్విజ్, డిబేట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, రన్నింగ్ వంటి పోటీలు జరుగుతున్నాయి.విజేతలకు ఆగస్టు 15న బహుమతులు అందించనున్నారు.

తపాలా ద్వారా అయినవల్లి విఘ్నేశ్వరుని ప్రసాదం

ఇచ్ఛాపురం: వినాయక చవితిని పురస్కరించుకొని తూర్పుగోదావరి జిల్లా అయినవల్లి విఘ్నేశ్వరస్వామి ప్రసాదం కావాలనుకునేవారు తపాలా కార్యా లయాల్లో సంప్రదించాలని పోస్టల్ సబ్‌డివిజనల్ ఇన్‌స్పెక్టర్ కె.శ్యాంసుందర్ తెలిపారు. 30 రూపాయలను పోస్టాఫీసులో చెల్లిస్తే వారి గోత్రనామాలతో ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపించి ప్రసాదం అందిస్తామన్నారు. విశాఖప ట్నం రీజనల్ పరిధిలోని రెండు వేల పోస్టల్ కార్యాలయాల్లో ఈ సదుపాయం అందుబాటులో ఉందన్నారు. భక్తులు తపాలా కార్యాలయంలో రూ.30 చెల్లించి రశీదు పొందాలన్నారు.

300 మందికి వైద్య పరీక్షలు

ఇచ్ఛాపురం : మున్సిపల్ మాజీ చైర్మన్ పిలక పోలారావు జయంతి సందర్భంగా శుక్రవారం బెల్లుపడలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త నర్తు రామారావు ప్రారంభించారు. వైద్యులు శ్రీనివాసరెడ్డి, సుబ్బారెడ్డి 300మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో పోలారావు కుమారులు పిలక కళ్యాణ్, పిలక సంతు, కోడళ్లు లావణ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ రాజలక్ష్మి, వైసీపీ నాయకులు యాదవరెడ్డి, రాజారావు, తారకేష్, ప్రకాష్‌రావుపట్నాయిక్, పార్వతీశం, వెంకటరెడ్డి, మున్సిపల్ కమిషనర్ రవిబాబు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ప్రీస్కూల్‌కు కుర్చీలు..

మున్సిపల్ మాజీ చైర్మన్ పిలక పోలారావు జయంతి సందర్భంగా బెల్లుపడ అంగన్‌వాడీ ప్రీ స్కూల్‌కు వంద కుర్చీలను కుటుంబ సభ్యులు వితరణగా అందజేశారు. పోలారావు కోడలు మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి మహిళలకు చీరలు, శానిటేషన్ సిబ్బందికి షర్ట్‌లు అందించారు. పేద విద్యార్థికి రూ.10వేలు ఇచ్చారు.


వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

రుణమాఫీ కాని రైతులు
వివరాలు అందజేయండి


వివరాలు అందిస్తున్న రైతులు

కవిటి: రుణమాఫీ కాని రైతులు తమ వివరాలను అందజేయాలని ఎస్‌బీఐ కవిటి బ్రాంచ్ మేనేజర్ ప్రదమ్‌రెడ్డి తెలిపారు. కవిటి, కంచిలి, ఇచ్ఛాపురం, సోంపేట మండలాలకు చెందిన పలువురు రైతులు రుణమాఫీ కాలేదని ఇటీవల ఎమ్మెల్యే అశోక్‌ను కలిశారు. ఈ విషయాన్ని ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లడంతో రుణమాఫీ కాని రైతుల జాబితా అందజేయాలని బ్యాంకు అధికారులకు సీఎం ఆదేశించారు. ఈ నేపథ్యంలో సుమారు 300 మంది రైతుల వివరాలను బ్యాంకు అధికారులు సేకరించారు. మిగిలిన రైతులు కూడా సహకరించి రేషన్, ఆధార్, ఓటరు కార్డు, పాస్ పుస్తకం, బ్యాంక్ ఖాతా జిరాక్స్‌లను సమర్పించాలని ఎస్‌బీఐ బీఎం ప్రదమ్‌రెడ్డి కోరారు. ఈ సందర్భంగా కవిటి చిక్‌ఫ్ కార్యాలయంలో రైతుల నుంచి వివరాలు సేకరించారు. కార్యక్రమంలో చిక్కాఫ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎ.శివాజీ, రైతు సంఘ నేతలు బి.కృష్ణారావు, ఎ.రాజు, బి.విశ్వనాథ్, తదితరులు పాల్గొన్నారు.

'పశుగ్రాస క్షేత్రాల లక్ష్యాలు పూర్తిచేయండి'


మాట్లాడుతున్న ఉపసంచాలకుడు కరుణాకర్

టెక్కలి: ఊరూరా పశుగ్రాస క్షేత్రాల నిర్దేశించిన లక్ష్యాలు పూర్తిచేయాలని, పంచాయతీకి ఐదు ఎకరాలను ఇందుకోసం గుర్తించాల్సిన బాధ్యత పశు వైద్యులదేనని పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకుడు డాక్టర్ మంచు కరుణాకర్ చెప్పారు. శుక్రవారం ఆయన టెక్కలిలో డివిజన్ స్థాయి పశు వైద్యులు, సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఏడాదికి ఎకరాకు రూ.18 వేలు లీజ్ గా చెల్లిస్తామని, ఏకవార్షికానికి రూ.15 వేలు, బహువార్షికానికి రూ.70 వేలు చొప్పున ఉపాధి హామీ పథకం ద్వారా ఇవ్వనున్నట్టు తెలిపారు. సెక్సడ్ సెమెన్ డోసులు జర్సీ 200, హెచ్‌ఎఫ్ 40 డోసులు సిద్ధంగా ఉన్నాయని, అవసరమైన వారు పశు వైద్యాధికారులకు సంప్రదించాలని, పశువైద్యాధికారి రూ.250 చెల్లించి జిల్లా పశు వైద్య వీర్య కేంద్రం ద్వారా తీసుకురావాలని తెలిపారు. పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు త్వరలో వేస్తామని, దానికి సిబ్బంది సిద్ధంగా ఉండాలన్నారు. పశుమిత్ర, అభ్యుదయ రైతులు గొర్రెలు, మేకలకు నట్టల నివారణ అప్‌లోడింగ్ కార్యక్రమం శతశాతం చేసినందుకు అభినందించారు.

అధికారుల ఫోన్‌నెంబర్లు

తహసీల్దార్:	
ఆర్.గోపాలరత్నం	9441852965
ఎంపీడీవో:	
సీహెచ్ మల్లేశ్వరరావు	8121644667
పంచాయతీరాజ్ ఏఈ	
సీహెచ్ సూర్యారావు	9441853963
ఈవోపీఆర్‌డీ	
ఎన్.రాజేంద్రప్రసాద్	8985922599
ఏవో వ్యవసాయశాఖ	
పి.శ్రీదేవి	8886612655
సోంపేట సీహెచ్‌సీ సూపరింటెండెంట్	
లక్ష్మీనారాయణ	9652592590
పశు వైద్యాధికారి	
కె.నాగశివకుమార్	9640990506
హౌసింగ్ ఏఈ	
కేవీ రమణరావు	7093930231
మండల విద్యాశాఖాధికారి	
జోరాడు	8985008903
ఏఈఈ (ఆర్అండ్‌బీ)	
ఈ.రవికాంత్	9440459129
ఏఈ (విద్యుత్‌శాఖ)	
కోటేశ్వరరావు	9440812436
హెచ్‌వో(హార్టీకల్చర్)	
భరణి	8187890299
ఏపీవో (ఎన్ఆర్‌జీఎస్)	
నాగరాజు	8790008376
ఎంసీవో(సాక్షరభారత్)	
ఎం.శంకరరావు	9000051045
ఏఈ (నీటిపారుదలశాఖ)	
జి.సంతోష్‌కుమార్	9100120643
సీడీపీవో రంగలక్ష్మి	9441178864
ఏసీడీపీవో మాధవిలత	8019613696

(సోంపేట)

దినఫలాలు

అదృష్టసంఖ్యలు: 3, 8



మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): సృజనాత్మకంగా వ్యవహరించి లక్ష్యాలు సాధిస్తారు. ప్రేమానుబంధాలు బలపడతాయి. చిట్‌ఫండ్‌లు, పొదుపు పథకాలు లాభిస్తాయి. చిన్నారుల వైఖరి ఉల్లాసం కలిగిస్తుంది. సంకల్పం నెరవేరుతుంది.



వృషభరాశి: (ఏప్రిల్21-మే20): దూరంలో ఉన్న ప్రియతములు ఇల్లు చేరుతారు. వేడుకలు, బృందకార్యక్రమాలకు ఏర్పాట్లు చేస్తారు. రాజకీయ, సినీరంగాల వారు కీలక పదవులు అందుకుంటారు. కీలక పత్రాలు అందుకుంటారు.



మిథునరాశి: (మే21-జూన్21): బ్యాంకులు, ఆర్థిక సంస్థలతో పనులు పూర్తవుతాయి. ఆర్థిక విషయాల్లో సన్నిహితుల సహకారం లభిస్తుంది. సమావేశాలు, చర్చలు ఫలిస్తాయి. బంధుమిత్రులతో ఉల్లాసంగా గడుపుతారు.



కర్కాటకరాశి: (జూన్22-జూలై23): ఆర్థిక విషయాల్లో పెద్దల సహకారం లభిస్తుంది. వృత్తి, వ్యాపారాల్లో ఆర్థికంగా ప్రోత్సాహకరంగా ఉంటుంది. ప్రముఖుల్ని కలుసుకుంటారు. బహుమతులు ఇచ్చిపుచ్చుకుంటారు. లక్ష్యం నెరవేరుతుంది.



సింహరాశి:(జూలై24-ఆగస్ట్23): కొత్త వ్యూహాలు అమలు చేసి సత్ఫలితాలు సాధిస్తారు. న్యాయ, బోధన, రవాణా రంగాల వారికి అనుకూలం. నూతన ప్రాజెక్టులను విజయవంతంగా చేపడతారు. మనసు ఉల్లాసంగా ఉంటుంది.



కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23): సంస్మరణలు, ఆధ్యాత్మిక సమావేశాల్లో పాల్గొంటారు. పూర్వ మిత్రులకు సంబంధించిన చర్చలు ఫలిస్తాయి. దీర్ఘకాలిక పెట్టుబడులకు సంబంధించిన సమాచారం సేకరిస్తారు. యోగ, ధ్యానాలపై దృష్టి పెడతారు.



తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): ప్రియతముల కోసం విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. సమావేశాలు ఉల్లాసం కలిగిస్తాయి. పందాలు, పోటీల్లో విజయం సాధిస్తారు. ప్రేమలు ఫలిస్తాయి.



వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): ఆస్పత్రులు, ఫార్మా, రెస్టారెంట్లు, రిక్రియేషన్ రంగాల వారు పైఅధికారుల సహకారంతో లక్ష్యాలు సాధిస్తారు. వ్యవసాయం, పరిశ్రమల రంగాల వారికి ప్రోత్సాహకరం. విందు వినోదాల్లో ఉల్లాసంగా పాల్గొంటారు.



ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాలకు చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. ప్రియతములకు సంబంధించిన కీలక సమాచారం అందుకుంటారు. బంధుమిత్రులతో సమావేశాలు, వేడుకల్లో పాల్గొంటారు.



మకరరాశి(డిసెంబర్22-జనవరి21): గృహావసరాల కోసం అవసరమైన నిధులు సర్దుబాటవుతాయి. ఆర్థిక విషయాల్లో కుటుంబ సభ్యుల సహకారం లభిస్తుంది. రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాల వారికి ఆర్థికంగా ప్రోత్సాహకర సమయం.



కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): బంధుమిత్రుల కలయిక ఆనందం కలిస్తుంది. జనసంబంధాలు విస్తరిస్తాయి. స్టేషనరీ, ప్రింటింగ్, కమ్యూనికేషన్ల రంగాల వారికి శుభప్రదం. ప్రియతములతో ఉల్లాసంగా గడుపుతారు.



మీనరాశి:(ఫిబ్రవరి19మార్చి20): ప్రమోషన్లు, ఇంక్రిమెంట్లకు అనుకూలం. సహోద్యోగుల ఆర్థిక విషయాల్లో జోక్యం చేసుకోవాల్సి రావచ్చు. బ్యాంకులు, ఆర్థిక సంస్థలు, చిట్‌ఫండ్‌లలో పనిచేసే వారికి ప్రోత్సాహకరం

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

మొదటి పేజీ తరువాయి

రాయితీ... ఓ బహుమతి

స్థాపనకు దాదాపు 15 ప్రభుత్వ శాఖల చుట్టూ అనుమతుల కోసం తిరగాల్సి వచ్చేది. ఇంత చేసినా ఏదో ఒక కారణంతో అనుమతులు మంజూరు కాకపోవడంతో నిరుద్యోగ యువత నిస్తేజానికి గురయ్యేది. తమ లక్ష్యాన్ని పక్కనపెట్టి ఉద్యోగ, ఉపాధి వేటకు సుదూర ప్రాంతాలకు వెళ్లిపోయేవారు. ఈ నేపథ్యంలో పరిశ్రమల స్థాపనలో ఎదురవుతున్న ఇబ్బందులను అధిగమించేందుకు సింగిల్ విండో సిస్టమ్(ఏక గవాక్ష విధానం) 2015లో అమల్లోకి తెచ్చింది. ఇప్పటివరకూ 1250 చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు దరఖాస్తు చేసుకుంటే... వాటిలో 1189 యూనిట్లు మంజూరయ్యాయంటే ఈ విధానం ఏస్థాయిలో పరుగెడుతుందో అర్థం చేసుకోవచ్చు. మిగిలిన 47 దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయంటే అభ్యర్థుల అర్హతలు, ఇతరత్రా కారణాల వల్లనే.

● ప్రోత్సాహక కమిటీ ఏర్పాటు

సింగిల్ విండో సిస్టమ్ ద్వారా పరిశ్రమలకు అనుమతులు ఇవ్వడానికి జిల్లాస్థాయిలో పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ ఏర్పాటైంది. చైర్మన్‌గా కలెక్టర్ వ్యవహరిస్తారు. పరిశ్రమల స్థాపనలో ప్రమేయం ఉన్న శాఖలు (జిల్లా పంచాయతీ అధికారి, కాలుష్య నియంత్రణ మండలి, పర్యావరణ శాఖ, పట్టణ, గ్రామీణ ప్రణాళిక విభాగం, వుడా తదితరమైనవి) అధికారులు ఇందులో సభ్యులుగా ఉన్నారు. జిల్లా పరిశ్రమల కేంద్రం మేనేజర్ మెంబర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తున్నారు. జిల్లా కమిటీ పరిధిలో సింగిల్ డెస్క్ విధానంలో జిల్లా పరిశ్రమల కేంద్రం ద్వారా కేవలం 21 రోజుల వ్యవధిలోనే అనుమతులు పొందే సౌలభ్యం కలిగింది.

● రాయితీలు భేష్..

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు వివిధ రాయితీలు కల్పించారు. సూక్ష్మ, చిన్న తరహా, మధ్య తరహా పరిశ్రమలకు పరికరాల పెట్టుబడికి 35 శాతం... భారీ పరిశ్రమలకు పది శాతం రాయితీ లభిస్తోంది. హరిత ప్రమాణాల రాయితీ కింద 25 శాతం, పరికరాల పెట్టుబడిగా 35 శాతం రాయితీ ఉంటుంది. ప్రధానంగా జిల్లాలో గ్రానైట్, జీడి, మినరల్ వాటర్ ప్లాంట్లు, రైస్‌మిల్లులు, ఇంజనీరింగ్ వర్క్‌షాపులు తదితరమైనవి ఏర్పాటుకు నిరుద్యోగ యువత ముందుకొస్తున్నారు.

● అనుమతులు ఎన్నిరోజుల్లో ఇస్తారంటే..

● గ్రామ పంచాయతీ నుంచి స్థలం, బిల్డింగ్‌ప్లాన్ ఆమోదం....7 రోజులు

● విద్యుత్ శాఖ నుంచి విద్యుత్ వినియోగ అనుమతికి ఏడు రోజులు, విద్యుత్ కనెక్షన్‌కు 21 రోజులు

● ఏపీఐఐసీ ప్లాట్, షెడ్ కేటాయింపునకు (వెయ్యి చదరపు మీటర్లయితే) 21 రోజులు

● ఏపీఐఐసీ నుంచి కన్సెంట్ ఫర్ ఎస్టాబ్లిష్‌మెంట్ కోసం (సీఎఫ్ఈ) 21 రోజులు. కన్సెంట్ ఫర్ ఆపరేషన్స్ (సీఎఫ్‌వో)కు 45 రోజులు.

జిల్లా పరిశ్రమల కేంద్రం (డీఐసీ) నుంచి నాన్ పొల్యూషన్ ఎకనాలెడ్జ్‌మెంట్‌కు ఏడు రోజులు.

● ఉత్పత్తి ప్రారంభించిన తయారీ పరిశ్రమలు, సేవారంగ సంస్థలు, ఉద్యోగ ఆధార్ మెమోరాండాన్ని తప్పనిసరిగా నమోదు చేసుకోవాలి.

పరిశ్రమల స్థాపన సరళతరం

సింగిల్ విండో విధానం ద్వారా పరిశ్రమల స్థాపన సులభతరంగా మారింది. గతంలో అనుమతుల కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సివచ్చేది. ఇప్పుడా పరిస్థితులు లేవు. ప్రతి వారం కలెక్టర్ ఆధ్వర్యంలో పరిశ్రమల స్థాపన, అనుమతుల కోసం ప్రత్యేక జిల్లా కమిటీ సమావేశం నిర్వహిస్తున్నాం. దరఖాస్తులు తిరస్కరణకు గురైతే నేరుగా ఇక్కడకు వచ్చి సమస్య తెలియజేయవచ్చు.

- గోపాలకృష్ణ, జనరల్ మేనేజర్, జిల్లా పరిశ్రమల కేంద్రం

విశ్రాంతి... వినోదం

ప్రయాణించే వారికి ఎక్కడ అలసటగా అనిపించినా తక్షణమే వినోదం, విశ్రాంతి, రుచికర భోజనం అందించే విధంగా హైవే నెస్ట్‌లను నిర్మిస్తున్నారు. ఒక్కోటి అయిదెకరాల్లో నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. 197 కిలోమీటర్ల పరిధిలో మూడుచోట్ల ఏర్పాటు చేయనున్నారు. నరసన్నపేట-రణస్థలం మధ్య ఒకటి, నరసన్నపేట-ఇచ్ఛాపురంల మధ్య రెండింటినీ ఏర్పాటు చేసేంతుకు అధికారులు నిర్ణయించారు. జాతీయ రహదారిపై ప్రతి 50 కిలోమీటర్లకు ఇటువంటి కేంద్రాన్ని ఒకటి నిర్మించాలని కేంద్ర రవాణా, జాతీయ రహదారుల శాఖ నిర్ణయించింది. అందులో భాగంగానే వీటిని ఎక్కడెక్కడ ఏర్పాటుచేస్తే బాగుంటుందనే దానిపై ఎన్‌హెచ్ అధికారులు సమగ్ర సర్వే చేస్తున్నారు. త్వరలో హైవే విస్తరణకు సంబంధించి తయారుకానున్న పూర్తిస్థాయి సమగ్ర నివేదికలో వీటిని ప్రకటించనున్నారు. అయిదెకరాల స్థలాన్ని హైవేకు ఆనుకుని సేకరిస్తారు. సర్కారు భూములు ఉంటే రాష్ట్ర ప్రభుత్వాన్ని సంప్రదించి తీసుకోవాలని...లేదంటే ప్రైవేటు భూములను కొనుగోలు చేయాలని భావిస్తున్నారు. హైవేనెస్ట్ కేంద్రంలో లారీ డ్రైవర్లు, ఇతర ప్రయాణికులు విశ్రాంతి తీసుకోవచ్చు. కార్లు, బస్సులు, ట్రక్కులకు పార్కింగ్ వసతి కూడా ఉంటుంది. పెట్రోల్ బంకులు, వాహన మరమ్మతు కేంద్రాలు, విశ్రాంతి గదులు, రెస్టారెంట్లు, దాబాలు, ఫుడ్‌కోర్టులు,వ్యవసాయ, చేనేత విక్రయ కేంద్రాలు కూడా అందుబాటులోకి తీసుకువస్తున్నారు. భవిష్యత్‌లో ఎలక్ట్రిక్ కార్లు రాబోతుండడంతో వాటికి కూడా విద్యుత్ ఛార్జింగ్ వ్యవస్థలను నిర్మించాలని నిర్ణయించారు. మొత్తం అయిదెకరాల స్థలంలో కేవలం 20శాతం ప్రదేశంలో నిర్మాణాలు చేస్తారు. మిగిలిన 80 శాతం స్థలంలో పార్కింగ్, ఇతర వినోద సదుపాయాలు వస్తాయి.

టెండరు ప్రక్రియ వాయిదా

నరసన్నపేట-రణస్థలం మధ్య జాతీయ రహదారిని ఆరు లైన్లుగా విస్తరించనున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే డిజైన్లు ఖరారయ్యాయి. ఈ పనులు చేపట్టేందుకు పిలిచిన టెండర్లకు మంచి స్పందన వచ్చింది. అయితే కంపెనీ ఏదనేది నిర్ణయించేందుకు ఈనెల 11న వాటిని తెరవనున్నట్లు హైవే అథారిటీ ప్రకటించింది. కొన్ని సాంకేతిక కారణాలతో ఈప్రక్రియను వాయిదా వేసినట్లు తాజాగా ప్రకటించింది. తిరిగి సెప్టెంబర్ 1న ఈ ప్రక్రియ నిర్వహించడానికి నిర్ణయం తీసుకుంది. విస్తరణ పనుల్లో భాగంగా రణస్థలం నుంచి నరసన్నపేట వరకు 53 కిలోమీటర్ల జాతీయ రహదారిపై జమ్ము జంక్షన్, కంబకాయ జంక్షన్, సత్యవరం జంక్షన్, కోమర్తి జంక్షన్, దేవాది, ప్రశాంతనగర్, అంపోలురోడ్డు, సిద్ధిపేట జంక్షన్, నవభారత్ జంక్షన్,ఎచ్చెర్ల బైపాస్‌లో 4, చిలకపాలెం, కొత్త శాలిపేట, బుడుమూరు, అదపాక, బొంతుపేట, సుభద్రాపురం,రణస్థలం బైపాస్‌లో మూడు చొప్పున అండర్‌పాసేజ్‌లు నిర్మిస్తారు. ఇందుకు రూ.1321 కోట్లు ఖర్చుపెడుతున్నారు. 110 కిలోమీటర్ల మేర విస్తరించిన నరసన్నపేట నుంచి ఇచ్ఛాపురం హైవేపై రూ.465 కోట్లతో ప్రధాన కూడళ్లలో అండర్ పాసేజ్‌లు నిర్మించనున్నారు. పనులకు సంబంధించి కాంట్రాక్ట్ కంపెనీ ఎంపికను ఈ నెల 17కి వాయిదావేశారు. ఆరోజు టెండర్లు తెరిచి అర్హత సాధించిన కంపెనీని ప్రకటిస్తారు.

దోపిడీ రహిత సమాజ నిర్మాణానికి కృషి

● ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఓబులేసు

అమలాపురం టౌన్: దోపిడీ రహిత సమాజ నిర్మాణం కోసం దేశానికి స్వాతంత్ర్యం రాకముందు నుంచి కృషి చేస్తున్న ఘనత ఏఐటీయూసీకి దక్కుతుందని ఉభయ తెలుగు రాష్ట్రాల కార్యదర్శి జి.ఓబులేసు అన్నారు. స్వాతంత్ర్య సమరయోధులు లాలాలజపతిరాయ్, ఇంద్రజిత్‌గుప్తా వంటి ప్రముఖులు ఏఐటీయూసీకి నాయకత్వం వహించి ఎన్నెన్నో పోరాటాలు చేశారన్నారు. తూర్పుగోదావరి, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలకు చెందిన ఏఐటీయూసీ కార్యకర్తల సైద్ధాంతిక శిక్షణా తరగతులు శుక్రవారం అమలాపురం దుడ్డువారి అగ్రహారంలోని విశ్వబ్రాహ్మణ సామాజిక భవనంలో ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు నిర్వహించే శిక్షణా తరగతులకు ఎమ్మెల్సీ కె.రవికిరణ్‌వర్మ, మున్సిపల్ చైర్మన్ చిక్కాల వినాయకరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తొలుత రాష్ట్ర కార్యదర్శి కిర్ల కృష్ణారావు ఏఐటీయూసీ పతాకాన్ని ఆవిష్కరించారు. ప్రారంభోత్సవ సభలో ఓబులేసు మాట్లాడుతూ కార్మికవర్గ పోరాటమే చట్టాల అమలుకు ఏకైక మార్గమని పిలుపునిచ్చారు. అందుకోసం కార్యకర్తలంతా సైద్ధాంతిక శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకుని చట్టాల అమలుకు పోరుబాట పట్టాలన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ రావుల రవీంద్రనాథ్, పి.సత్తార్, బి.రామయ్య, మీసాల సత్యనారాయణలు తదితరులు పలు అంశాలపై కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు మీసాల సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆహ్వానసంఘ ప్రధాన కార్యదర్శి కొప్పుల సత్తిబాబు, కోశాధికారి గుత్తుల విజయభాస్కర్, ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు, ఉప్పలపాటి చంద్రదాసు, దేవ రాజేంద్ర ప్రసాద్, డి.నారాయణమూర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి కిర్ల కృష్ణ, కొండా దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రవికిరణ్ వర్మ

'నగరం'లో సినిమాలు

కీర్తిక	నక్షత్రం
కిన్నెర	నేనే రాజు నేనే మంత్రి
కీర్తన	జయ జానకి నాయక
సూర్యమహల్	లై
మారుతి	జయ జానకి నాయక
సన్‌మ్యాక్స్	జయ జానకి నాయక
సరస్వతి మహల్	లై
ఎస్‌వీసీ	ఫిదా
రామకృష్ణ	నేనే రాజు నేనే మంత్రి

చికెన్ ధరలు



	బాయిలర్	వెన్‌కాబ్
రిటైల్‌ధర	70	78
విత్‌స్కిన్	150	129
స్కిన్‌లెస్	160	152




ఏనుగులు చాలా తెలివైనవి. వాటికి జ్ఞాపకశక్తి ఎక్కువ. మనుషుల్లానే వాటికీ భావోద్వేగాలుంటాయి. మనుషులతో చాలా స్నేహంగా ఉంటాయి. కానీ రోజు రోజుకూ వాటి సంఖ్య తగ్గిపోతోంది. దంతాల కోసం, శరీర భాగాల కోసం అమానుషంగా వాటిని కొందరు చంపేస్తున్నారు. అయినా ఆ భారీ జంతువులకు మనుషుల మీద కోపం రాలేదు. ఆకారం భారీగా ఉన్నా అందరితో ప్రేమగా మెదిలే ఏనుగులను కాపాడాలనే ఉద్దేశంతో 'ప్రపంచ ఏనుగుల దినోత్సవం' మొదలైంది.



ఏనుగమ్మ.. ఏనుగు

ఏనుగులు మనుషులతో ఇట్టే కలిసిపోతాయి. భారతీయ సంస్కృతిలోనూ ఏనుగులకు విశిష్ట స్థానం ఉంది. నాలుగు వేల సంవత్సరాల నుంచి మానవులతో మైత్రి కొనసాగిస్తున్న గజరాజులకు.. మానవుల వల్లే ప్రమాదం పొంచి ఉంది. గత పది సంవత్సరాల్లో ఏనుగుల సంఖ్య 62 శాతం తగ్గింది. ప్రతిరోజు దాదాపు 100కు పైగా ఏనుగులు చనిపోతున్నాయి. ఏనుగు మాంసం, శరీర భాగాలు, దంతాల కోసం వేటగాళ్లు వాటిని చంపుతున్నారు. ఇది ఇలానే కొనసాగితే మరో పదిహేను, ఇరవై సంవత్సరాల్లో ఏనుగులు అంతరించిపోతాయని అంటున్నారు పర్యావరణవేత్తలు. అరణ్యంలో దొరికిన అనాథ ఏనుగుల్ని 'టూరిజమ్ ఇండస్ట్రీ', 'సర్కస్', 'టూరిస్ట్ పార్కు'లకు విక్రయించడంతో పాటు, అడవుల సంఖ్య తగ్గడం వల్ల కూడా వీటి సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. ఇది గమనించిన కెనడియన్ ఫిల్మ్‌మేకర్ ప్యాట్రిసియా సిమ్స్, 'థాయ్‌లాండ్ రీ ఇంట్రడక్షన్ ఫౌండేషన్' సాయంతో ఆగస్టు 12న 'ప్రపంచ ఏనుగుల దినోత్సవా'న్ని జరుపుకోవాలని పిలుపునిచ్చాడు. ఏనుగులను కాపాడుకోవటం అందరి బాధ్యతంటూ సిమ్స్ అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాడు.



రక్షించుకుందాం !

- అరణ్యాల్లో పోలీసుల సంఖ్య పెంచడం వల్ల వేటగాళ్ల నుంచి ఏనుగులను రక్షించుకోవచ్చు.
- గాయపడ్డ ఏనుగులకు ప్రత్యేక చికిత్సలను అందిస్తే, ఎన్నో ఏనుగులను కాపాడుకోవచ్చు.
- అనాథ ఏనుగులను టూరిజం ఇండస్ట్రీకి ఇవ్వకుండా ప్రత్యేక చట్టాలను రూపొందించడం ద్వారా కూడా వీటిని రక్షించుకోవచ్చు.
- ఏనుగుల శరీర భాగాలను స్మగ్లింగ్ చేస్తున్న వారికి కఠిన శిక్షలు విధించడం వల్ల కూడా గజరాజులను కాపాడుకోవచ్చు.



ఎన్నెన్నో ఏనుగులు

ఆసియా ఏనుగులు:

- ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఏనుగుల్లో కేవలం పది శాతం మాత్రమే ఆసియా ఏనుగులున్నాయి. జన్యు వ్యత్యాసాల ఆధారంగా ఏనుగులను మూడు ఉపజాతులుగా విభజించారు. ఇవి ఇంచుమించు నాలుగు వేల నుంచి ఐదు వేల వరకు ఉన్నాయి.
- **శ్రీలంక ఏనుగు :** ఆసియా ఏనుగులన్నింటిలోనూ పెద్దది. ఇవి శ్రీలంకలో మాత్రమే ఉన్నాయి.
- **ఇండియన్ ఎలిఫెంట్ :** ఇవి భారత దేశం నుంచి ఇండోనేషియా వరకు విస్తరించి ఉన్నాయి. వీటి సంఖ్య దాదాపు 35 వేల వరకు ఉండొచ్చు.
- **సుమత్రా ఏనుగు :** ఇవి అన్నింటికన్నా చిన్న పరిమాణంలో ఉంటాయి.

ఆఫ్రికా ఏనుగులు :

- ఆఫ్రికా ఖండంలో 37 దేశాల్లో ఇవి విస్తరించి ఉన్నాయి.
- ఇవి ఆసియా ఏనుగులకంటే పెద్దవిగా ఉంటాయి. వీటి చెవులు చాలా విశాలంగా, చెవులు చూడటానికి ఆఫ్రికా ఖండం ఆకారంలో ఉండటం విశేషం.


టంగ్ ట్విస్టర్స్

1. I see a sea down by the seashore.But which sea do you see down by the seashore?
2. There those thousand thinkers were thinking where did those other three thieves go through.
3. Five frantic frogs fled from fifty fierce fishes.

నవ్వుల్ నవ్వుల్


తండ్రి : ఏరా! గౌరీ! ఆవుకి ఆ కళ్లద్దాలు ఎందుకు పెట్టావు రా?
గౌరి : ఈ రోజు పచ్చగడ్డి దొరకలేదు. అందుకే ఆవుకు ఎండుగడ్డి వేసి పచ్చ కళ్లద్దాలు పెట్టాను.
తండ్రి : !!!!!!!!!!!!

సుత్తివేలు : అరేయ్! నువ్వు నిద్రపోయి లేచేసరికి నీకో కోటి రూపాయలు వచ్చాయనుకో! ఏం చేస్తావ్?
మిస్టర్ మేధావి : మళ్లీ పడుకుని ఇంకో కోటి రూపాయలు వస్తాయేమో చూస్తా!
సుత్తివేలు : !!!!!!!!!!!!!!




ఔనా!

- గోల్డెన్ ఈగల్ గంటకు 250 కిలో మీటర్ల వేగాన్ని కూడా అందుకోగలదు.
- ఇది ఆరు వేల అడుగుల ఎత్తు వరకు ఎగరగలదు.



చుక్కలు కలపండి




సూక్తి

మనిషికి వివేకాన్ని సంపాదించి పెట్టేవి అతనికి తగిలే ఎదురుదెబ్బలే.

చెప్పగలరా?

పదిలో ఉన్నాను కానీ గదిలో లేను
గర్వంలో ఉన్నాను కానీ సర్వంలో లేను
వాలులో ఉన్నాను కానీ వారులో లేను
అయితే నేనెవర్నో చెప్పగలరా?

దారి కనుక్కోండి



పదాలు గుర్తించండి

R	B	Z	B	V	S	W	W	H	K	F	C	T	Q	C
R	S	G	U	O	C	A	W	F	M	O	E	S	F	L
Y	H	M	T	N	K	T	V	X	R	O	B	I	N	K
W	O	Y	T	O	Q	G	R	E	E	N	Y	Q	W	Z
O	W	Z	E	C	T	T	O	X	T	L	A	Z	P	A
T	E	Y	R	L	I	K	R	O	E	V	H	M	W	Y
G	R	Z	F	E	P	D	J	Z	A	T	V	O	Y	K
A	S	D	L	A	Q	A	Y	S	P	P	B	A	G	T
R	I	M	Y	N	G	N	W	E	Y	N	L	J	V	B
D	K	W	K	I	S	D	T	S	I	Q	Y	D	L	L
E	P	A	Z	N	M	E	M	A	Y	F	A	I	W	O
N	G	N	V	G	V	L	R	S	B	I	E	S	H	S
U	L	I	O	Y	K	I	K	J	B	I	Y	T	Y	S
Z	Y	N	R	F	L	O	W	E	R	S	C	K	E	O
Y	Q	K	P	I	C	N	I	C	W	O	B	N	U	M

జంతర్‌మంతర్

1. కచిలు ▸ ....
2. రుపుమ ▸ ....
3. పిపులు ▸ ....

జంబ్లింగ్ వర్డ్స్

1. STEA ▸ ....
2. RHUS ▸ ....
3. SLEA ▸ ....

జవాబులు

1. EAST/SEAT 2. RUSH 3. SALE/ SEAL

పంట బీమా చెల్లింపుల్లో ఇంత జాప్యమా..?

బ్యాంకర్లపై కలెక్టర్ ధనుంజయరెడ్డి ఆగ్రహం


బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కె. ధనుంజయరెడ్డి

కలెక్టరేట్/డేఅండ్‌నైట్ జంక్షన్: పంటల బీమా పరిహారం సంబంధిత రైతులకు సకాలంలో అందజేయని తీరుపై కలెక్టర్ కె. ధనుంజయరెడ్డి బీమా కంపెనీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం ఆయన బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రైతులకు సకాలంలో ఎందుకు బీమా పరిహారం చెల్లించడం లేదని ప్రశ్నించారు. ఇకనుంచి బీమా చెల్లింపుల్లో జాప్యం జరిగితే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. అలాగే.. ఉద్యానవన శాఖ అధ్వర్యంలో చేపట్టే పాలీహౌస్‌ల కార్యక్రమంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఖరీఫ్‌కు సంబంధించి పంట రుణాల జారీ 15 రోజులు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సకాలంలో రుణాలు అందించకపోతే రైతులు నష్టపోయే పరిస్థితి ఉందని వివరించారు. కౌలు రైతులకు 10 శాతం మేర రుణాలు తప్పని సరిగా ఇవ్వాలన్నారు. వ్యవసాయ అధికారులు బ్యాంకర్ల సమన్వయంతో కౌలు రైతులకు రుణాలు అందజేయాలని సూచించారు. ఈ ఏడాది పంటకాలాన్ని ముందుకు తీసుకురావటం జరిగిందని గుర్తుచేశారు. దీం తో రెండో పంటకు అకాశం ఉంటుందని వివరించారు. ముందుగా పంటలు వేసుకుంటే రైతులు తుఫాన్ నష్టాల నుంచి బయటపడే అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో ఆంధ్రాబ్యాంక్ జీఎం రాధాకిషన్‌రావు, లీడ్ బ్యాంక్ మేనేజర్ వెంకటేశ్వరరావు, వ్యవసాయ శాఖ జేడీ రామారావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఆదిత్యలక్ష్మి, బీసీ కార్పొరేషన్ ఈడీ రాజారావు ఉద్యానవన సహాయ సంచాలకుడు ఎం.ఎ. రహీమ్, డ్వామా పీడీ హెచ్. కూర్మారావు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కుంగ్‌ఫూ, కరాటే పోటీలకు సిక్కోలు క్రీడాకారులు

● అభినందించిన ఎమ్మెల్యే లక్ష్మీదేవి ● ఆర్థికసాయం అందజేత


ఎంపికైన క్రీడాకారులతో ఎమ్మెల్యే లక్ష్మీదేవి, కోచ్‌లు

శ్రీకాకుళం సిటీ: విశాఖపట్నంలో 13న నిర్వహించనున్న రాష్ట్రస్థాయి కుంగ్‌ఫూ, కరాటే పోటీలకు జిల్లా నుంచి 13 మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈమేరకు ఎంపికైన ఎన్.చంద్రరావు (కోచ్) కె.గాయత్రి, వి.జానకిరామరాజు, జి.హరికృష్ణ, కె.ప్రవీణ్‌కుమార్, మహ్మద్ అల్క్యామా, మహ్మద్ ఫయ్యాజ్, బి.గుణశేఖర్, జి.భరత్ కల్యాణ్, బి.వినోద్, డి.ప్రవీణ్‌కుమార్, బి.అమృత వర్షిణి, ఐ.పృథ్వీరాజ్ లను ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి శుక్రవారం అభినందించారు. రసవల్లిలోని తన స్వగృహంలో క్రీడాకారులకు అల్పాహార విందు ఏర్పాటు చేసి.. ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా క్రీడాకారులు కుంగ్‌ఫూ విన్యాసాలను ఎమ్మెల్యే ఎదుట ప్రదర్శించారు. కార్యక్రమంలో కోచ్ చంద్రరావు, టీడీపీ జిల్లా నాయకులు ఎస్వీ రమణమాదిగ, గుజ్జల శాంతీశ్వరరావు, మాజీ మున్సిపల్ కౌన్సెలర్ కేశవ రాంబాబు తదితరులు ఉన్నారు.

రణస్థలంలో కరాటే పోటీలకు ఎంపిక..

రణస్థలంలో 13న జరగనున్న జిల్లాస్థాయి కరాటే పోటీలకు జిల్లాలోని క్రీడాకారులు ఎంపికయ్యారు. మాస్టర్ కోచ్ ఎన్.చంద్రరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంపికల్లో బి.నవీన్ కుమార్, ఎస్.సాయికుమార్, పి.ఎర్రంనాయుడు, బి.రాజగోపాలరావు, ఎం.సిద్ధార్థ రామస్వామి, మోహిత్‌గౌతమ్, దుర్గాప్రసాద్ ఉన్నారు.

రక్తదానం చేయండి..ఆపన్నులను ఆదుకోండి..

● కలెక్టర్ ధనుంజయరెడ్డి సూచన ● సిక్కోలు యూత్, రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో మెగా రక్తదానశిబిరం


రక్తదాన శిబిరంలో కలెక్టర్ ధనుంజయరెడ్డి

శ్రీకాకుళం సిటీ: రక్తదానం చేయండి.. ఆపదలో ఉన్నవారిని ఆదుకోండని కలెక్టర్ కె. ధనుంజయరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక ఆదిత్యా డిగ్రీ కళాశాలలో శుక్రవారం జిల్లా రెడ్‌క్రాస్ సంస్థ, సిక్కోలు యూత్, గీతా శ్రీకాంత్ ఫౌండేషన్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అంతర్జాతీయ యువదినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. రక్తదానం వల్ల మరోవ్యక్తి ప్రాణాలను రక్షించినవారమవుతామని గుర్తుచేశారు. రక్తదానం చేయడంలో అపోహలు వీడాలని హితవు పలికారు. ఈ సందర్భంగా రక్తదానానికి ముందుకు వచ్చిన విద్యార్థులను కలెక్టర్ అభినందించారు. అనంతరం వెదుకుట.. రక్షించుట.., ప్రథమచికిత్స శిక్షణ పుస్తకాలను జిల్లా రెడ్‌క్రాస్ సంస్థ చైర్మన్ డాక్టర్ పి.జగన్మోహనరావుతో కలిసి కలెక్టర్ విడుదల చేశారు. కార్యక్ర మంలో భాగంగా కళాశాల ప్రాంగణంలో కలెక్టర్ మొక్కలు నాటారు. కార్యక్రమంలో సెట్‌శ్రీ సీఈవో ప్రసాదరావు ప్రిన్సిపాల్ లక్ష్మీపతి, శ్రీపెరంబుదూరు సూరిబాబు, విశ్రాంత డీఈవో బి. మల్లేశ్వరరావు, సిక్కోలు యువశక్తి ప్రతినిధులు, ఎ.సందీప్, టి.కూర్మారావు, వి.సతీశ్ వేణుగోపాల్, ఎంవీవీఎస్ శాస్త్రి, చైతన్యకుమార్ ఉన్నారు.

కిలిమంజారో ప్రాంతానికి చేరిన చిన్నమ్మలు


కిలిమంజారో ప్రాంతంలో పర్వతారోహకులు (ఇన్‌సెట్‌లో) చిన్నమ్మలు

వంగర: కె.మరువాడకు చెందిన గేదెల చి న్నమ్మలు శుక్రవారం ఉదయానికి ఆఫ్రికాలోని కిలిమంజారో పర్వతశ్రేణి ప్రాంతానికి చేరుకుంది. రెండు రోజుల పాటు విశ్రాంతి తీసుకున్న అనంతరం ఆగస్టు 15 సరికి కిలిమంజారో పర్వతానికి స్వాతంత్ర్య పతాకంతో అధిరోహించేందుకు సిద్ధమవుతున్నట్లు చిన్నమ్మలతో పాటు శిక్షణ ఇచ్చే నిర్వాహకుడు తెలిపారు.

‘ప్రతి వ్యక్తికీ జీవనైపుణ్యం కీలకం’


శిక్షణ తరగతులను ఉద్దేశించి మాట్లాడుతున్న కలెక్టర్

డేఅండ్‌నైట్ జంక్షన్: ప్రతి వ్యక్తీ జీవ నైపుణ్యాలను పెంపొందించుకోవాల్సిన వపరం ఉంది. జీవ నైపుణ్యం అత్యంత కీలకంగా భావించాలని కలెక్టర్ కె.ధనుంజయరెడ్డి అన్నారు. భారత ప్రభుత్వ యువజన సర్వీసులు-క్రీడా మంత్రిత్వశాఖ సౌజన్యంతో ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించనున్న నైపుణ్యాలపై శిక్షణ తరగతులను ఆయన శుక్రవారం ప్రారంభించారు. చిన మండలవీధిలోని బ్రహ్మకుమారీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కలెక్టర్ విచ్చేసి.. జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ జీవితాన్ని ఆస్వాదించాలని ఆకాంక్షించారు. వ్యక్తి ప్రవర్తన కుటుంబంపైన, పిల్లలపైన, వ్యవస్థపైన పడుతుందనీ... వ్యక్తిలో పరివర్తన వచ్చినప్పుడే.. వ్యవస్థ మారుతుందని అభిప్రాయపడ్డారు. ఎమ్మెల్యే లక్ష్మీదేవి మాట్లాడుతూ... పనిచేసే సమయంలో ఆ పని వల్ల జరిగే ప్రయోజనాల్ని ఆలోచించే కుశలత ఉండాలని పేర్కొన్నారు.

కార్యక్రమంలో అంబేద్కర్ వర్సిటీ విశ్రాంత రెక్టార్ డాక్టర్ మిర్యాల చంద్రయ్య, డీఈవో డాక్టర్ ఆబోతుల ప్రభాకరరావు, రెడ్‌క్రాస్ చైర్మన్ డాక్టర్ జగన్మోహనరావు, కోర్సు నిర్వాహకులు బీకే సుబ్రహ్మణ్య గుప్తా మాట్లాడారు. కార్యక్రమంలో విశ్రాంత జిల్లా న్యాయమూర్తి పి.జగన్నాథరావు, బ్రహ్మకుమారి కేంద్రనిర్వాహకురాలు బీకే శారద, బీకే జ్యోతి, శ్రీలక్ష్మి, శిక్షణకు హాజరైన యువతీయువకులు తదితరులు పాల్గొన్నారు.

సర్వేపల్లి విగ్రహానికి శంకుస్థాపన

పొందూరు: మండలంలోని కింతలి జడ్పీ ఉన్నత పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణ విగ్రహానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా సర్పంచ్ దవళ గణపతి మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో సర్వేపల్లి విగ్ర హం తప్పనిసరిగా ఉండాలన్నారు. గ్రామానికి చెందిన పైడిపెద్దిగారి సూర్యనారాయణ ఆర్థిక సహాయంతో విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారు. అనంతరం పాఠశాల మైదానంలో రన్నింగ్ ట్రాక్ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు.


శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

కానరాని నాణ్యతా ప్రమాణాలు

● ప్రారంభానికి ముందే బీటలు వారిన దూసి రక్షిత మంచినీటి పథకం
● అధికారుల పర్యవేక్షణ లేమి ● ఆందోళనలో ప్రజలు

దూసి(ఆమదాలవలస రూరల్): ప్రభుత్వ నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు కొరవడకుండా ఉండేందుకు ప్రభుత్వం సంబంధిత పర్యవేక్షణ అధికారులను నియమిస్తుంది. అయితే వీరు కాంట్రాక్టర్లతో కుమ్మక్కై శాశ్వత ప్రతిపదికన చేపట్టవలసిన నిర్మాణాలను నాసిరకంగా నిర్మిస్తున్నారు. ఇందుకు నిదర్శనం మండలంలో దూసి కాలనీలో నిర్మించిన రక్షిత నీటి పథకమే. గ్రామీణ ప్రాంతాలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే ధృఢ సంకల్పంతో ఆర్‌డబ్ల్యూఎస్ నిధులు రూ.23 లక్షలతో 40 వేల లీటర్ల సామర్థ్యంగల వాటర్ ట్యాంక్ నిర్మాణానికి పనులు ప్రారంభించారు. పనులు కూడా చివరి దశకు చేరుకున్నాయి. ప్రజాప్రతినిధులతో ప్రారంభానికి కూడా సిద్ధం చేస్తున్నారు. అయితే ప్రారంభానికి ముందుగానే ట్యాంక్ పునాదులు బీటలు వారడం.. ట్యాంకు నుంచి నీటి చెమ్మలు బయటకు రావడంతో గ్రామస్థులు అధికారుల తీరుపై పెదవి విరుస్తున్నారు. వీధుల్లో నీటి సరఫరాకు వేసిన పైపు లైన్లలో కూడా నాశిరకమైన పైపులను వాడారని ప్రజలు ఆరోపిస్తున్నారు. కాంట్రాక్టర్ తమ స్వలాభం కోసం నాణ్యతా ప్రమాణాలు పాటించలేదని, వాటికి అధికారులు వత్తాసు పలకడంతో ఇటువంటి నాణ్యతలేని నిర్మాణాలు జరుగుతున్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ గ్రామానికి నిత్యం తాగునీరు అందించాల్సిన ట్యాంక్ ఇలా నీటి చెమ్మలను వెదజల్లడంతో నివాసాల మధ్యన నిర్మించిన ట్యాంక్ ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికీ ప్రారంభం కాని వాటర్ ట్యాంక్ పూర్తి స్థాయిలో లీకులను అరికట్టిన తరువాతే ప్రారంభిస్తే మంచిదని గ్రామస్థులు అభిప్రాయపడుతున్నారు.


ట్యాంక్ కింది భాగంలో చెమ్మ పడుతున్న దృశ్యం


పునాదులు వద్ద బీటలు వారిన గోడ

'ఉపాధి' రికార్డులను సక్రమంగా నిర్వహించండి

బూర్జ: ఉపాధి హామీ పథకం రికార్డులను సక్రమంగా నిర్వహించాలని ఉపాధి హామీ ఏపీడీ లోకేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఉపాధి వేతనాలను చెల్లించే వేతన దారుల పూర్తి వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపరచాలన్నారు. ఆయా పంచాయతీల్లో ఉపాధి పనులను, పనులకు సంబంధించిన ప్రణా ళికలను సిద్ధం చేసుకోవాలని తెలిపారు. ప్రతి పంచాయతీలో ఫీల్డ్ అసిస్టెంట్‌లకు ఇచ్చిన మొక్కలను నాటించాలన్నారు. వెలుగు సిబ్బంది తో కలిసి ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, రహదారులకు ఇరువైపులా మొక్కలను నాటించి వాటి సంరక్షణ నిమిత్తం ఉపాధి వేతనదారులకు డబ్బు చెల్లిస్తామని చెప్పారు. దీనిపై లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. కొలతల్లో తేడాలు వస్తే సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం కార్యాలయంలో ఉన్న రికార్డులను పరిశీలించారు. ఈసమావేశంలో ఏపీవో సాయిరాం, ఈసీ పద్మజ, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.


రికార్డులు పరిశీలిస్తున్న ఏపీడీ

అసంఘటిత కార్మికులకు చంద్రన్న బీమా వరం

ఆమదాలవలస రూరల్: అసంఘటిత కార్మికులకు చంద్రన్న బీమా వరమని మున్సిపల్ చైర్‌పర్సన్ తమ్మి నేని గీత అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చంద్రన్న బీమా పరిహార ఉత్తర్వులను ఆమె శుక్రవారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పట్టణంలో ఇప్పటి వరకు చంద్రన్న బీమా మొత్తాలను 73 కుటుంబాలకు అందించామని చెప్పారు. చంద్రన్న బీమా లబ్ధి చేకూరాలంటే మృతి చెందిన వారి వివరాలను 24 గంటల లోపుగా కాల్ సెంటర్‌కు అందించాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రాంతీయ సంచాలకుడు కె.రమేష్, కమిషనర్ బి.రాము, బీమా మిత్ర టి.ధనలక్ష్మి, మెప్మా అధికారులు పాల్గొన్నారు.


బీమా ఉత్తర్వు పత్రాలు అందిస్తున్న దృశ్యం

ముమ్మరంగా పారిశుధ్య పనులు


పారిశుధ్య పనులు చేపడుతున్న దృశ్యం

చిగురువలస (సరుబుజ్జిలి): మండలంలోగల చిగురువలసలో పంచాయతీ సర్పంచ్ చిట్లు చిరంజీవి ఆధ్వర్యంలో శుక్రవారం పారిశుధ్య నిర్వాహణ చర్యలు చేపట్టారు. గ్రామాల్లో అంటు రోగాలు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా కాలువల్లో పూడికలను తీయించి రోడ్లను శుభ్రపరచి, బావుల్లోనూ, చేతి పంపుల చుట్టూ బ్లీచింగ్ వేయించారు. దోమలు వృద్ధి చెందకుండా మందులను పిచికారి చేయించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీదేవి, హెల్త్ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు జవాబుదారీతనం పెరగాలి

● విశాఖపట్నం ప్రాంతీయ సంచాలకుడు రమేష్

ఆమదాలవలస: పురపాలక సంఘంలో సమస్యల పరిష్కారంపై ఉద్యోగులకు జవాబుదారీతనం పెరగాలని విశాఖపట్నం ప్రాంతీయ సంచాలకుడు కె.రమేష్ అన్నారు. పురపాలక సంఘం ఉద్యోగులతో ఆయన శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పురసేవలో వచ్చే సమస్యలను ఈ-ఫైలింగ్ చేయాలని అధికారులను ఆదేశించారు. పుర సేవలో ఫిర్యాదులపై సకాలంలో స్పందించాలని, నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి రోజు రెవెన్యూ వసూలు చేయాలని సూచించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజనపై పూర్తిస్థాయిలో స్థితి గతులను అడిగి తెలుసుకున్నారు. పురపాలకసంఘంలో పారిశుధ్య పనుల నిర్వహణ, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణ వివరాలపై సమీక్ష నిర్వహించారు. ప్రణాళిక, ప్రణాళికేతర వ్యయంపై రికార్డులను పరిశీలించారు. అనంతరం 13వ వార్డులో ప్రీ స్కూల్‌గా మార్పు చెందిన అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి.రాము, మేనేజర్ కె.శ్రీనివాస్, ఏఈ డీబీ శ్రీనివాసరావు, టీపీఎస్ జి.సీతారం, ఆర్‌ఐ టి.గోవిందరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాదరావు, మెప్మా, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.


ప్రీస్కూల్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న రమేష్

రైతు సమస్యల పరిష్కారమే లక్ష్యం

ఇసుకల పాలెం (సరుబుజ్జిలి): రైతుల సమస్యలు పరిష్కారించడమే ప్రభుత్వ లక్ష్యమని ఇందులో భాగంగానే రైతు సేవలో రెవెన్యూ శాఖ కార్యక్రమం నిర్వహిస్తోందని తహసీల్దార్ ప్రభాకర్ జేమ్స్ అన్నారు. మండలంలోగల ఇసుకల పాలెం, తమ్మినాయుడు పేట గ్రామాల్లో శుక్రవారం గ్రామ సభలు నిర్వహించారు. కార్యక్రమంలో డీటీ ఎంఎన్ ప్రసాద్, సర్వేయర్ పీవీ సూర్యనారాయణ, ఆర్‌ఐలు, వీఆర్వోలు పంచాయతీ కార్యదర్శులు, పలు శాఖ సిబ్బంది, సర్పంచ్‌లు హాజరయ్యారు.

పొందూరు: రైతులు రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలని తహసీల్దార్ వరప్రసాదరావు అన్నారు. దళ్ళవలసలో శుక్రవారం రైతు సేవలో రెవెన్యూ శాఖ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ ఈశ్వరరావు, సర్పంచ్ ప్రతినిధి కె.అప్పలరాము పాల్గొన్నారు.


రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్న దృశ్యం

కార్పొరేషన్ రుణాలను వినియోగించుకోండి

సరుబుజ్జిలి: ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రత్యేకాధికారి బి.శ్రీహరి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఎం.పావని ఆధ్వర్యంలో శుక్రవారం రుణ లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ చేపట్టారు. గతంలో రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, కాపు వర్గాల అభ్యర్థుల ధ్రువ పత్రాలను పరిశీలించారు. 164 యూనిట్లకు గాను 462 దరఖాస్తులు అందినట్లు తెలియజేశారు. దీనిలో బీసీలకు 70, ఎస్సీలకు 23, కాపులకు 30 యూనిట్లు ఎంపిక చేశారని తెలిపారు. ఈ రుణాలను సక్రమంగా వినియోగించుకుంటే రెండేళ్ళ తర్వాత సబ్సిడీ వర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో బ్యాంకు అధికారులు ఎస్‌బీఐ బీఎం వి.ఉదయ భాస్కర్, ఏపీజీవీబీ బీఎం ఎస్.రమేష్, ఏడీవీ ఎస్‌బీఐ ఎఫ్‌వో నాగమల్లేశ్వరరావు, కమిటీ సభ్యులు శివ్వాల సూర్యనారాయణ, ఎన్.వెంకటలక్ష్మి తదితర లబ్ధిదారులు పాల్గొన్నారు.


ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న దృశ్యం

సమాచార లోపంతో లబ్ధిదారుల గైర్హాజరు..

బూర్జ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో లక్ష్మీభాయ్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన బీసీ, ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ ఇంటర్వ్యూలకు సమాచార లోపంతో లబ్ధిదారులు గైర్హాజరయ్యారు. 793 మంది లబ్ధిదారులు రుణాల కోసం దరఖాస్తు చేసుకోగా ఈ ఇంటర్వ్యూలకు 137 మంది మాత్రమే హాజరయ్యారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే పూర్తిస్థాయిలో లబ్ధిదారులు ఇంటర్వ్యూలకు హాజరుకాలేదని తెలుస్తోంది. 2015-16, 2016-17 సంవత్సరాలకు సంబంధించి ప్రభుత్వం అందజేస్తున్న వివిధ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈ ఇంటర్వ్యూలకు హాజరుకావల్సి ఉంది. అయితే అధికారుల లబ్ధిదారులకు ఇంటర్వ్యూల విషయమై సమాచారం అందించకపోవడంతో ఈ ఏడాది దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు మాత్రమే హాజరయ్యారు. ఈ ఇంటర్వ్యూలకు సంబంధించి అధికారులు, బ్యాంకర్లకు మధ్య పూర్తిగా అవగాహన లోపం కనిపించింది. ఇరువురు వద్ద ఉన్న లబ్ధిదారుల జాబితాలో కనీసం పదిశాతం మంది కూడా హాజరు కాకపోవడంతో ఇంటర్వ్యూలను తూతూ మంత్రంగా నిర్వహించారు.

స్వచ్ఛభారత్‌పై అవగాహన


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

సరుబుజ్జిలి: స్వచ్ఛభారత్ వారోత్సవాల్లో భాగంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి ఆర్టీసీ కాంప్లెక్సు వరకు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.పావని పాల్గొని మాట్లాడారు. ఈనెల 9నుంచి 15వతేదీ వరకు కలెక్టర్ ఆదేశాల మేరకు అన్ని పంచాయతీల్లో స్వచ్ఛభారత్ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలియజేశారు. ఈవోపీఆర్డీ ఎం.విజయ భాస్కర్, ఎంఈవో డి.బాలరాజు, జన్మభూమి కమిటీ మండల సభ్యుడు శివ్వాల సూర్యనారాయణ, పలు శాఖల అధికారులు హాజరయ్యారు.

ఘనంగా శ్రావణ శుక్రవారం

బూర్జ: మండలంలోని కేకే రాజపురం, లక్కుపురం గ్రామాల్లో గల శివాలయాల్లో శుక్రవారం వరలక్ష్మి వ్రతాలను ఘనంగా నిర్వహించారు. వేదపండితులు అంపోలు కేశవశర్మ, శ్రీనివాసశర్మల ఆధ్వర్యంలో మహిళలు సామూహిక కుంకుమ పూజల్లో పాల్గొన్నారు.

క్రషర్ వాహనాలపై విజిలెన్స్ దాడులు

పొందూరు: మండల పరిధిలో చిప్స్, రాయి లోడుతో వెళ్తున్న వాహనాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. విజిలెన్స్ సీఐ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో అధికారులు తనిఖీలు నిర్వహించి సరైన పత్రాలులేని 12 వాహనాలపై కేసులు నమోదు చేసి, సుమారు రూ.30 వేలు జరిమానా వసూలు చేశారు. సీఐతోపాటు మైనింగ్ అధికారి రమణ తదితరులు ఉన్నారు.

వాహనాలపై దాడులు చేసి జరిమానా విధిస్తున్న అధికారులు



ఊరూరా పశుగ్రాస క్షేత్రాలు

ఎస్ఎంపురం(ఎచ్చెర్ల): ఉపాధి హామీ పథకంలో భాగంగా ఊరూరా పశుగ్రాస క్షేత్రాలను ఏర్పాటు చేస్తున్నట్టు జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ (డెయిరీ) డాక్టర్ జయ ప్రకాష్, ఎస్ఎంపురం పశువైద్యాధికారి డాక్టర్ జి.సురేష్ కుమార్ తెలిపారు. మండలం ఎస్ఎంపురం పంచాయతీ బానోజీరావుపేటలో శుక్రవారం పశుగ్రాస క్షేత్రం ఏర్పాటుకు వర్క్ ఆర్డర్ నిర్వహించారు. మండలంలో 26 ఎకరాల్లో పశుగ్రాస క్షేత్రాల ఏర్పాటు చేయనున్నామని, తొలుత 6 ఎకరాల్లో పశుగ్రాస క్షేత్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

సర్కారు బడులకు 'రక్షణ' కరువు

● అరకొర సౌకర్యాలే గతి ● ఆక్రమణలకు గురవుతున్న వైనం
● ఇదీ.. ప్రభుత్వ పాఠశాల దుస్థితి ● పట్టించుకోని అధికారులు



రక్షణ గోడలేని ఎచ్చెర్ల ప్రాథమికోన్నత పాఠశాల

ఎచ్చెర్ల: పాఠశాల వాతావరణం ఆహ్లాదకరంగా ఉండాలి... రక్షణ గోడ తప్పనిసరి.. పాఠశాల ఆవరణంలో పచ్చటి మొక్కలు నాటడంతో పాటు తాగునీటి సౌకర్యం.. మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో కొన్ని పాఠశాలలకు వీటిని సమకూర్చినా.. ఇంకా చాలా పాఠశాలలు అసౌకర్యాల నీడలోనే మగ్గుతున్నాయి. నియోజకవర్గంలోని అనేక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టుగా మరుగుదొడ్లు లేకపోవడంతో పరిసరాలు కలుషితమవుతున్నాయి. ప్రాథమిక.. ప్రాథమికోన్నత పాఠశాలల సంగతి సరే.. చివరకు జడ్పీహెచ్‌స్కూల్లో కూడా కనీస సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమవుతోంది.



రక్షణ గోడలేని డి.మత్స్యలేశం ఉన్నత పాఠశాల

ఉన్నత విద్యను అందించడంతో పాటు పాఠశాలలను ఆకర్షిణీయంగా తీర్చిదిద్దుతామంటున్న పాలకుల మాటలు నీటిమూటలుగానే మిగిలిపోతున్నాయి. పాఠశాలలకు రక్షణగోడలు ఏర్పాటు చేయకపోవడంతో రాత్రి సమయాల్లో అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా మారుతున్నాయని ఉపాధ్యాయులు వాపోతున్నారు. ముఖ్యంగా ఎచ్చెర్ల మండలంలోని తీర గ్రామమైన డి.మత్స్యలేశం జడ్పీ ఉన్నత పాఠశాలకు రక్షణ గోడ లేకపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 2008లో ప్రారంభమైన ఈ పాఠశాలకు గతంలో 5 ఎకరాల స్థలం కేటాయించినట్టు రికార్డులు చెబుతున్నాయి. ప్రహరీ లేకపోవడంతో పాఠశాల ఆవరణం ఆక్రమణలకు గురవుతున్నట్టు తెలుస్తోంది. గతంలో పాఠశాల ఏర్పాటుకు స్వచ్ఛందంగా స్థలం ఇచ్చినవారు సైతం రేట్లు పెరగడంతో ఇప్పుడు వెనుకంజవేస్తున్నట్టు తెలుస్తోంది. దీని వల్ల ప్రహరీ నిర్మాణానికి వీల్లేకుండా పోతోంది. క్రీడా మైదానం కూడా లేకపోవడంతో విద్యార్థులు ఇక్కట్ల పాలవుతున్నారు. సుమారు 300 మంది విద్యార్థులు ఉన్న ఈ పాఠశాలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

విద్యుత్ లైన్లు మార్చాలి..

డి.మత్స్యలేశం ఉన్నత పాఠశాల పైనుంచి ఉన్న హెచ్‌టీ విద్యుత్ లైన్‌ను మార్చాలని స్థానికులు కోరుతున్నారు. బుధవారం ఉదయం విద్యుత్ స్తంభానికి ఉన్న కేసారం పొడవ్వడంతో విద్యుత్ తీగలు స్కూల్ ఆవరణంలో పడ్డాయి. ఆ సమయంలో విద్యార్థులు బయటలేక పోవడంతో ప్రమాదం తప్పిందని ఉపాధ్యాయులు, చెబుతున్నారు. ట్రాన్స్‌కో సిబ్బంది తాత్కాలికంగా సరిచేసినప్పటికీ విద్యార్థులు భయపడుతున్నారు. హెచ్ టీలైన్ శాశ్వత ప్రాతి పదికన మార్చాలని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

బహిరంగ మలవిసర్జన నిర్మూలిద్దాం

జి.సిగడాం: బహిరంగ మలవిసర్జన నిర్మూలనతోనే స్వచ్ఛ గ్రామాలు సాధ్యమని.. ప్రతి ఒక్కరూ మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఎంపీపీ డొంక సూరీడమ్మ అన్నారు. స్థానిక కస్తూర్బా గాంధీ పాఠశాలలో స్వచ్ఛభారత్ వారోత్సవాల్లో భాగంగా మానవహారం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఆమె మాట్లాడుతూ బహిరంగ మలవిసర్జన సాంఘిక దురాచారమని, దానిని రూపుమాపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఆమె అన్నారు. మరుగుదొడ్డి నిర్మించి, మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడుకోవాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ ఉపాధ్యక్షుడు భూపతి శ్రీరామ్మూర్తి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ కుమరాపు రవికుమార్, నాయిన సింహాచలం, ఎంపీడీవో పి.మురళీమోహన్‌కుమార్, ఎంఈవో ఎ.రవి, ఈవోపీఆర్డీ కె.భాస్కరమూర్తి, పాఠశాల ప్రత్యేకాధికారి తదితరులు పాల్గొన్నారు.

తెలుగుజాతి గౌరవం పెంచిన వెంకయ్యనాయుడు

బంటుపల్లి (రణస్థలం) : మండలం బంటుపల్లిలో నడుకుదిటి ఈశ్వరరావు ఆధ్వర్యంలో ఉపరాష్ట్రపతిగా వెంకయ్యనాయుడు పదవీ ప్రమాణ స్వీకరణ సందర్భంగా శుక్రవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. తొలుత కేక్ కటిచేసి అందరికి పంచిపెట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపరాష్ట్రపతిగా వెంకయనాయుడు ఎన్నికై తెలుగుజాతి గౌరవాన్ని పెంచారన్నారు. కార్యక్రమంలో టీడీపీ యువనేత కలమట సాగర్, పిషిని జగన్నాధం, ముల్లు కృష్ణ, అసిరినాయుడు, దన్నాన సత్తిబాబు పాల్గొన్నారు.

మొక్కుబడిగా రెవెన్యూ సదస్సులు



తిరుపతిపాలేంలో రైతు సదస్సు దృశ్యం

రణస్థలం : రైతులల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రైతు రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేసింది. అయితే కొంత మంది వీఆర్వోల నిర్లక్ష్యం వల్ల ఈ సదస్సులు మొక్కుబడిగా సాగుతున్నట్టు విమర్శలు వస్తున్నాయి. శుక్రవారం తిరుపతిపాలేంలో జరిగిన రెవెన్యూసదస్సే ఇందుకు నిదర్శనం. ఈ పంచాయతీ పరిధిలో ఉన్న పున్నాపాలెం రైతులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండానే రెవెన్యూ సదస్సు నిర్వహించారని పి నర్సింహులనాయుడు, ఎం రమణ, ఎం అప్పలనాయుడులు వాపోయారు. ఈ విషయమై తహసీల్దార్ శ్రీరామల దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం రైతుల నుంచి వచ్చిన అర్జీలను అందుకున్నారు.

డ్రైవర్లను అప్రమత్తం చేస్తున్న పోలీసులు

రణస్థలం: జాతీయరహదారిపై రాత్రివేళల్లో వాహనాలు నడిపే డ్రైవర్లను జేఆర్‌పురం పోలీసులు అప్రమత్తం చేస్తున్నారు. గురువారం అర్థరాత్రి జాతీయరహదారిపై వెళ్తున్న వాహనాలను ఆపి నిద్రమత్తులేకుండా డ్రైవర్ల ముఖంపై నీళ్లుచల్లారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ఇటువంటి చర్యలు చేపడుతున్నట్టు హైవే పెట్రోలింగ్ సిబ్బంది తెలిపారు.

బహిరంగ మలవిసర్జన- కలిగే ఇబ్బందులపై వ్యాసరచన పోటీలు

ఎచ్చెర్ల: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బహిరంగ మలవిసర్జన-దాని వల్ల కలిగే ఇబ్బందులపై మండల స్థాయి వ్యాసరచన పోటీలు శనివారం నిర్వహించారు. ఈ పోటీలను ఎంఈవో కారు పున్నయ్య పర్యవేక్షించారు. ఈ పోటీల్లో పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారని ఆయన తెలిపారు.

రెవెన్యూ సదస్సులను వినియోగించుకోండి

● ఆర్డీవో దయానిధి

ముద్దాడ(ఎచ్చెర్ల): రైతుల భూ సమస్యల పరిష్కారానికి రైతు సేవలో రెవెన్యూ శాఖ చక్కని వేదిక అని ఆర్డీవో దయానిధి అన్నారు. మండలం ముద్దాడలో రైతు సేవలో రెవెన్యూ శాఖ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రైతుల నుంచి వస్తున్న ఫిర్యాదులకు సత్వరమే పరిష్కారం చూపుతున్నామని ఆయన తెలిపారు. ఈ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ నెలాఖరుతో సదస్సుల నిర్వహణ పూర్తవుతుందన్నారు. అనంతరం రైతులకు పాసుపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కిమిడి రామ్మోహనరావు, రెవెన్యూ పరిశీలకులు కూన వైకుంఠరావు, మండల టీడీపీ అధ్యక్షుడు బెండు మల్లేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు బెండు రామా రావు, వీఆర్వో గుంట పురుషోత్తం పాల్గొన్నారు.



పాసుపుస్తకాలను పంపిణీచేస్తున్న ఆర్డీవో

ఒక టీకాతో.. రెండు వ్యాధులు నయం

జి.సిగడాం: ఒక్క టీకాతో.. రెండు వ్యాధులను దూరం చేయొచ్చని... ఎంఆర్ వాక్సిన్‌ను 15ఏళ్లలోపు పిల్లలు తప్పనిసరిగా వేయించుకోవాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారిని గౌతమీ ప్రియాంక అన్నారు. తన చాంబర్‌తో ఆమె విలేఖర్లతో శుక్రవారం మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు పీహెచ్‌సీ పరిధిలో ఈ నెల 1 నుంచి వచ్చే నెల 8 వరకు ఎంఆర్ వాక్సిన్ కార్యక్రమం చేపడుతున్నామని, ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. ఈమెతో పాటు పీహెచ్ఎన్ నారాయణమ్మ, ఫార్మసిస్టు గురుమూర్తి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగపర్చుకోండి

రణస్థలం : ప్రభుత్వం రాయితీపై మంజూరు చేస్తున్న రుణాలను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకొని, ఆర్థికంగా బలోపేతం కావాలని ఎంపీపీ గొర్లె విజయ్‌కుమార్ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో కార్పొరేషన్ రుణాలకు సంబంధించి ఇంటర్వ్యూలు శుక్రవారం నిర్వహించారు. ఎస్సీ కార్పొరేషన్‌కు సంబంధించి 68 యూనిట్లకు 450 దరఖాస్తులు, బీసీ కార్పొరేషన్‌కు సంబంధించి 162 యూనిట్లకు 510 దరఖాస్తులు, కాపు కార్పొరేషన్‌కు సంబంధించి 40 యూనిట్లకు 469 దరఖాస్తులు వచ్చాయని ఎంపీడీవో యూ.కుమార్‌పట్నాయిక్ తెలిపారు.

అర్హులకే రుణాల మంజూరు

జి.సిగడాం: ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ ద్వారా అందిస్తున్న రాయితీ రుణాలను అర్హులైన లబ్ధిదారులకే మంజూరుచేస్తామని ఎంపీడీవో పి మురళీమోహన్ కుమార్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఎంపిక కార్యక్రమం ఆయన శుక్రవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు రుణాలు పొందిన లబ్ధిదారులు యూనిట్లను విధిగా ఏర్పాటు చేసుకొని ఆర్థికంగా బలోపేతం కావాలన్నారు. ఈ యనతో పాటు ఎంపీపీ డొంక సూరీడమ్మ, ఎంఈవో ఎ.రవి, ఈవోపీఆర్డీ కె.భాస్కరమూర్తి పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న దృశ్యం

నేడు ఎచ్చెర్లకు విద్యుత్ అంతరాయం

ఎచ్చెర్ల: స్థానిక 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని కొయ్యాం ఫీడర్‌లో శనివారం జంగిల్ క్లియరెన్స్ కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏడీఈ మదన్‌కుమార్ తెలిపారు. ఎస్ఎస్ ఆర్‌పురం, బలిజిపేట, కుప్పిలి, అజ్జరాం, దారపువానిపేట, చినరావుపల్లి, బలిజిపేట గ్రామాలకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఆయన తెలిపారు. ఎచ్చెర్ల ఎస్సీ కాలనీలో లైన్లు మార్పుచేయడంతో పంచాయతీ వరకు సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

ఇంటింటా మరుగుదొడ్లు నిర్మించండి

నరసన్నపేట: ఆరుబయట మలవిసర్జన నిర్మూలనకు ప్రతి ఇంటిలో వ్యక్తిగత మరుగుదొడ్లు ఉండాలని ఎంపీడీవో విద్యాసాగర్ అన్నారు. ఈమేరకు శుక్రవారం అవగాహన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాహ్వానితుడు శిమ్మ పాపినాయుడు, ఎంఈవో ఉప్పాడ శాంతారావు, శిమ్మ చంద్రశేఖర్, చమళ్ల వామనమూర్తి, బోర్డు ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

దళితుల సమస్యలు పరిష్కరించండి


తహసీల్దార్ కార్యాలయ ఏఎస్‌వోకు వినతి పత్రం అందిస్తున్న దళిత సంఘ నాయకులు

పోలాకి: దళితులు సామాజికంగా ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.గణేష్, మండల స్థాయి ప్రతినిధులు గన్నయ్య, రాజారావులు డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో వారు శుక్రవారం ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఉరజాంలో దళితుల కోసం ఏర్పాటు చేసిన రహదారులు, శ్మశానవాటికలు ఆక్రమణ చేస్తున్నారన్నారు. ఆక్రమణదారులను ప్రశ్నిస్తే మరిన్ని దుర్భాషలాడుతున్నారని వారి ఆగడాలను అధికారులే అరికట్టాలని వారు కోరారు. వారం రోజుల్లోగా అధికారులు స్పందించకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం వారు సామాజిక పరంగా ఎదుర్కొంటున్న పలు సమస్యలను లిఖిత పూర్వకంగా తహసీల్దార్ కార్యాలయ ఏఎస్‌వో బుచ్చిరాజుకు వినతి పత్రం సమర్పించారు. వారి వెంట జె.గన్నయ్య, కె.నర్సింహ, డి.ప్రసాదరావు, రాజయ్య నరసింహులు, గోవిందరావు, సుబ్బారావు, కొండలరావు, ఇల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బూట్ల పంపిణీ

దీర్ఘాశి(పోలాకి): మండలంలోని దీర్ఘాశి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పూర్వ విద్యార్థి, విద్యావేత్త కేబీ మధుసాహు (గాంధీ) వితరణగా అందించిన బూట్లను గ్రామపెద్దలు శుక్రవారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా పాఠశాల ఉపాధ్యాయురాలు విజయలక్ష్మి మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి మాజీ ఎంపీటీసీ సభ్యుడు ప్రసాద్, సత్సంగ సంఘం నాయకుడు పల్లిశివ తదితరులు సహకరించారని చెప్పారు. కార్యక్రమంలో సింహాచలం, శ్రీనివాసరావు పాల్గొన్నారు.


బూట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

భక్తిభావం పెంపొందించండి

తలసముద్రం(పోలాకి): గ్రామీణ ప్రాంత ప్రజల్లో భక్తిభావం పెంపొందాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. తలసముద్రం గ్రామంలో రెండురోజులుగా నిర్వహిస్తున్న విజయగణపతి ఆలయ విగ్రహ శిఖర ప్రతిష్ఠ కార్యక్రమంలో ఆయన శుక్రవారం పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ యాగాటి శ్రీరాములు, ఎంపీటీసీ సభ్యురాలు బావన సుజాత, ధర్మకర్త దుప్పట్ల మధు, యువజన నాయకుడు బి.శ్రీను, మల్లేశ్వరరావు, బి.వైకుంఠరావు, లోళ్ల రమణయ్య, ప్రగడ సూరిబాబు, ఆలయ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.


పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బగ్గు

ఉపాధి పనుల రికార్డులు పక్కాగా ఉండాలి

జలుమూరు: మండలంలో నిర్వహించిన ఉపాధి పనుల రికార్డులు పక్కాగా ఉండాలని ఉపాధిహామీ ఏపీడీ ఎం.శైలజ తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో శుక్రవారం నిర్వహించిన టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్ల సమీక్ష సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గ్రామస్థాయిలో జరిగిన ఉపాధి పనులకు ఏడు రకాలైన రికార్డులు, మండల స్థాయిలో చేపట్టిన పనులకు 13 రకాలైన రికార్డులు ఉంటాయని ఆమె తెలిపారు. మస్తర్లనుంచి ఎంబుక్ నమోదుతో పాటు చెల్లింపులు రికార్డులు పూర్తిస్థాయిలో ఉండాలని టెక్నికల్ అసిస్టెంట్లను ఆదేశించారు. టెక్నికల్ అసిస్టెంట్లు తయారు చేసిన రికార్డులను ఏపీవో, ఎంపీడీవో పరిశీలించి అందుబాటులో ఉంచాలన్నారు. సమావేశంలో ఏపీవో తెంబూరు రవి, ఈసీ వైవీ రమణమూర్తి, పలువురు టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటరు ఆపరేటర్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏపీడీ శైలజ

నడగాం కాలువకు గండి

● **ముంపునకు గురైన ఎద పొలాలు**

మామిడివలస (నరసన్నపేట): జలుమూరు మండలంలో కూర్మనాథపురం వద్ద 3ఆర్ నడగాం కాలువకు గండి పడటంతో మండలంలోని మామిడివలస గ్రామ తుంపర భూముల్లోని ఎద పొలాలు వరదనీటిలో మునిగాయి. ఎగువ ప్రాంతం నుంచి వరదనీరు చేరడంతో శుక్రవారం ఉదయానికి పంట పొలాలు నీటిలో మునిగాయి. మూడేళ్ల తర్వాత మామిడివలస తుంపర భూములు వరదనీటిలో మునిగాయని గ్రామస్థులు చెబుతున్నారు. గండి పడ్డ కాలువను పూడ్చారని, శనివారం నాటికి వరదనీరు తగ్గుతుందని వంశధార డీఈఈ మురళీమోహనరావు చెప్పారు.


వరదనీటిలో మామిడివలస తుంపర భూములు

రైతులకు అండగా రెవెన్యూ శాఖ

గ్రామగ్రామాన రెవెన్యూ సదస్సులు


నరసన్నపేట.. రావులవలస, పోలాకి..చీడివలస, జలుమూరు.. జోనంకిలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్న దృశ్యం

రావులవలస (నరసన్నపేట): రైతులకు అండగా రెవెన్యూశాఖ ఉంటుందని తహసీల్దార్ జల్లేపల్లి రామారావు అన్నారు. రావులవలసలో శుక్రవారం చేపట్టిన రైతు సేవలో రెవెన్యూశాఖ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రైతు భూ సమస్యలను ఈసదస్సులో దరఖాస్తు చేసుకుంటే పదిహేను రోజుల్లో పరిష్కారం చేస్తామన్నారు. సర్పంచ్ మూకళ్ల శ్యామల అధ్యక్షతన జరిగే ఈసమావేశంలో ఎంపీటీసీ సభ్యుడు కింజరాపు సూర్యనారాయణ, వంశధార ఏఈ సురేష్, ఉద్యానవన శాఖ అధికారి అమరేశ్వరి, ఆర్ఐ వెంకునాయుడు తదితరులు పాల్గొన్నారు.

చీడివలస(పోలాకి): రైతు సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం గ్రామస్థాయిలో సదస్సులు నిర్వహిస్తుందని తహసీల్దార్ జెన్ని రామారావు అన్నారు. చీడివలస, కొండలక్కివలస గ్రామాల్లో శుక్రవారం రైతు సేవలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. కార్యక్రమంలో డీటీ ఎన్.అప్పారావు ఆర్ఐలు ఢిల్లీశ్వరరావు, త్రినాథరావు, సర్పంచ్ ముద్దాడ సరోజిని, యువజన నాయకుడు ముద్దాడరావు, ఎంపీటీసీ సభ్యుడు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

జలుమూరు: రైతు సమస్యల సత్వర పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని డిప్యూటీ తహసీల్దారు నారాయణరావు తెలిపారు. జోనంకి, వెంకటాపురం గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొని రైతులనుంచి అర్జీలు స్వీకరించారు. అలాగే పెద్దదూగాం గ్రామంలో తహసీల్దారు కె.ప్రవల్లికప్రియ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. పెద్దదూగాంలో 24, జోనంకిలో 25, వెంకటాపురంలో 10 అర్జీలు వచ్చినట్లు డెప్యూటీ తహసీల్దార్ నారాయణరావు తెలిపారు. ఈ రైతు సదస్సుల్లో రెవెన్యూ పరిశీలకులు రావాడ త్యాగరాజు, ఎస్.చిన్నారావు, సర్వేయరు చిన్నప్పన్న, వీఆర్వోలు డి.గోపి, అర్జునరావు, పలువురు రైతులు పాల్గొన్నారు.

నత్రజని ఎరువులు అధికంగా వాడితే అనర్థమే

నడగాం (నరసన్నపేట): నత్రజని ఎరువులు అధికంగా వాడటం వల్ల వరిలో దిగుబడి తగ్గడంతో పాటు చీడలు ఎక్కువయ్యే ప్రమాదం ఉంటుందని కృషివిజ్ఞాన్ కేంద్ర శాస్త్రవేత్త అనీల్ కుమార్ అన్నారు. నడగాంలో రైతులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. వరి ఎదలో కాలిబాటలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా చీడలను తగ్గించు కోవచ్చునన్నారు. నత్రజని ఎరువుల స్థానంలో పోషక ఎరువులను వినియోగించాలని ఆయన సూచించారు. విత్తన సంరక్షణ బాధ్యతను ఊబాలు దశనుంచే చేపట్టాలని మరో శాస్త్రవేత్త సౌజన్యకుమార్ సూచిం చారు. కార్యక్రమంలో నరసన్నపేట ఏవో శ్రీనివాసరావు కోమర్తి వంశధార ప్రాజెక్టు కమిటీ గౌరవ అధ్యక్షులు రాడ మెహనరావు, ఏఈవో చిరంజీవి పాల్గొన్నారు.


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న అనిల్ కుమార్

బలహీనవర్గాల అభ్యున్నతికి టీడీపీ కృషి

నరసన్నపేట: బడుగు, బలహీన వర్గాలకు టీడీపీ ప్రభుత్వం అండగా ఉంటుందని మండల ప్రత్యేకాహ్వానితుడు శిమ్మ పాపినాయుడు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బీసీ, ఎస్సీ, కాపులకు శుక్రవారం రుణమేళా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం బీసీ, ఎస్సీ, మైనార్టీ, కాపులకు గత మూడు సంవత్సరాల నుంచి రుణాలు ఇస్తుందన్నారు. బీసీలకు 158 యూనిట్లు, ఎస్సీలకు 31, కాపులకు, మైనార్టీలకు 16 యూనిట్లను మంజూరు చేయనున్నట్లు చెప్పారు. 11 గ్రూపులకు రుణాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో విద్యాసాగర్, జడ్పీటీసీ ప్రతినిధి చింతు పాపారావు, మేజర్ పంచాయతీ సర్పంచ్ గొద్దు చిట్టిబాబు, మండల ఉపాధ్యాక్షుడు చమళ్ల వామనమూర్తి, ఎంపీటీసీ సభ్యులు జామి వెంకట్రావు, పీస కృష్ణ, మాకివలస సర్పంచ్ యాళ్ల వేణుగోపాలరావు, బీసీ, ఎస్సీ కార్పొరేషన్ అధికారులతో పాటు వివిధ బ్యాంకులకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

రవీంద్రభారతిలో కృష్ణాష్టమి

నరసన్నపేట: స్థానిక నేతాజీవీధిలోగల రవీంద్ర భారతి పాఠశాలలో శుక్రవారం శ్రీకృష్ణాష్టమి వేడకులను వైభవంగా నిర్వహించారు. రానున్న సోమవారం కృష్ణాష్టమి సందర్భంగా పాఠశాలలో ముందస్తుగా వేడుకలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ వాసుదేవరావు సమక్షంలో జరిగిన కార్యక్రమంలో చిన్నారుల వేషధారణలు, నృత్యాలు అలరించాయి.

కృష్ణుడు, గోపిక వేషధారణలో చిన్నారులు



వ్యక్తిగత కక్షతోనే పంచాయతీ కార్యదర్శిపై సస్పెన్షన్ వేటు


మాట్లాడుతున్న సర్పంచ్‌లు

నరసన్నపేట: మాకివలస పంచాయతీ క్లస్టర్ కార్యదర్శి సూరప్పుడుపై వ్యక్తిగత కక్షతోనే డీపీవో సస్పెండ్ చేశారని మాకివలస క్లస్టర్ పరిధిలోగల సర్పంచ్‌లు యాళ్ల వేణుగోపాలరావు, ఎం.మహాలక్ష్మి, రువ్వ కృష్ణవేణిలు ఆరోపించారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం విలేఖర్ల సమావేశం నిర్వహించారు. కిల్లాం, మాకివలస, దేవాది పంచాయతీల్లో సంపూర్ణ పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టిన పంచాయతీ కార్యదర్శి సూరప్పుడును వేరొక ఉద్దేశ్యంతోనే డీపీవో కోటేశ్వరరావు సస్పెండ్ చేశారన్నారు. సూరప్పుడును వెంటనే విధుల్లోకి తీసుకో కపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కంబకాయి సర్పంచ్ పోగోటి ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ సమాచారం

నరసన్నపేట: స్థానిక హెచ్‌పీ గ్యాస్ వినియోగదారులు ఈనెల 6న బుక్‌చేసిన వారికి, ఈనెల 5న బుక్ చేసిన ఇండియన్ గ్యాస్ వినియోగదారులకు మంగళవారం గ్యాస్ పంపిణీ చేయనున్నారు.

నరసన్నపేటలో సినిమాలు

శ్రీదేవి - నేనే రాజు.. నేనే మంత్రి
రాజేశ్వరి - ఫిదా
శ్రీవెంకటేశ్వర - జయ జానకీ నాయక

ఇంటర్వ్యూలకు 253 మంది హాజరు

వీరఘట్టం: ఎంపీడీవో కార్యాలయంలో ఎస్సీ, బీసీ ట్రైకార్ రుణాలకు శుక్రవారం నిర్వహించిన ఇంటర్వ్యూకు 253 మంది అభ్యర్థులు హాజరయ్యారు. మండల ప్రత్యేక అధికారి వైవీ శ్యామ్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ ఇంటర్వ్యూలు నిర్వహించగా టీడీపీ మండల, పట్టణ అధ్యక్షులు రౌతు దామోదరరావు, జామి లక్ష్మీనారాయణ, పలు బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.


ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న అధికారులు

రెన్యూవల్ చేసుకుంటేనే కొత్త రుణాలు


మాట్లాడుతున్న ఎస్‌బీఐ మేనేజర్

కొండాపురం (పాలకొండ రూరల్): రైతులు తీసుకున్న రుణాలను రెన్యూవల్ చేసుకుని కొత్త రుణాలు పొందవచ్చని ఎస్‌బీఐ మేనేజర్ బి.గోపి అన్నారు. శుక్రవారం గ్రామంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు తీసుకున్న వ్యవసాయ రుణాలు గడువులోగా రెన్యూవల్ చేసుకుంటే తక్కువ వడ్డీతో కొత్త రుణాలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ ఏవీ మూర్తి, రైతులు పాల్గొన్నారు.

16న నువ్వుల బహిరంగ వేలం

వీరఘట్టం: చలివేంద్రికి చెందిన కోడూరు సత్యంనాయుడు వద్ద గతంలో స్వాధీనం చేసుకున్న 56 క్వింటాళ్ల నువ్వులను గ్రామంలో ఈనెల 16న బహిరంగ వేలం వేయనున్నట్లు తహసీల్దార్ ఎంవీ రమణ తెలిపారు. ఆరోజు మధ్యాహ్నం రెండు గంటలకు వేలం నిర్వహిస్తామన్నారు. నువ్వులు క్వింటా రూ.6 వేలు చొప్పున ప్రభుత్వం ధర నిర్ణయించిందని, ఎస్‌సీఎల్ లైసెన్స్ కలిగిన వారు ఈ ధరకు తగ్గకుండా బహిరంగ వేలంలో పాల్గొన వచ్చని పేర్కొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో 'సంకల్పసిద్ధి'


'సంకల్పసిద్ధి'లో పాల్గొన్న నాయకులు

పాలకొండ రూరల్: బీజేపీ పిలుపు మేరకు శుక్రవారం సంకల్పసిద్ధి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆ పార్టీ నాయకులు మాట్లాడుతూ.. క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో 2017 నుంచి 2022 కాలంలో పారిశుధ్యలోపం, పేదరికం, అవినీతి, ఉగ్రవాదం, కులతత్వం, మతతత్వం దేశం నుంచి పారదోలాల్సిన అవసరం ఉందన్నారు. 75 ఏళ్ల స్వాతంత్ర్య దినోత్సవం నాటికి దేశాన్ని ప్రపంచ దేశాల ముంగిట నిలిపేందుకు ప్రజలందరూ భాగస్వామ్యం అయ్యేందుకు ఈ సంకల్ప సిద్ధి కార్యక్రమం చేపట్టాలని ప్రధాని నరేంద్రమోదీ పిలుపునిచ్చారన్నారు. కార్యక్రమంలో నాయకులు వీవీ ఆర్‌మూర్తి, టంకాల దుర్గారావు, కె.కుమార్, కె.అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ రహిత పట్టణంగా పాలకొండ

● మున్సిపల్ ఆర్డీ పి.రమేష్

పాలకొండ టౌన్: పోస్టర్ రహిత పట్టణంగా పాలకొండను రూపొందించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మున్సిపల్ ఆర్డీ పి.రమేష్ అన్నారు. శుక్రవారం పట్టణంలో నిర్వహించిన స్వచ్ఛభారత్, పోస్టర్ రహిత పట్టణం అవగాహన ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యర్థాలను కాలువలు, రహదారులపై పారవేయకుండా మున్సిపల్ సిబ్బందికి అందజేసి పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అనంతరం కార్యాలయంలో నగర పంచాయతీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈఆర్‌పీ మాడ్యూల్స్, పురసేవతో పాటు పట్టణ ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. నిబంధనల మేరకు ధ్రువపత్రాలను జారీ చేయాలని సూచించారు. అందుబాటులో ఉన్న అభివృద్ధి నిధులతో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేయాలన్నారు. అనంతరం ఏలాం కూడలిలోని మోడల్ అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి కోటదుర్గ వస్త్రాలు, కిరాణా, కూరగాయల వర్తక సంఘాలు సమకూర్చిన యూనిఫారాలను పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ పల్లా విజయ నిర్మల, కమిషనర్ పి.బాలాజీ ప్రసాద్, అభివృద్ధి కమిటీ సమన్వయకర్త పల్లా కొండలరావు, గంటా సంతోష్‌కుమార్, ఏఈ సురేష్, టీపీవో వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


స్వచ్ఛ పాలకొండ ర్యాలీలో పాల్గొన్న ఆర్డీ రమేష్

గ్రామసభల్లో భూ సమస్యల పరిష్కారం


పాలకొండ టౌన్: మాట్లాడుతున్న తహసీల్దార్

నవగాం (పాలకొండ టౌన్): రైతు సేవలో రెవెన్యూ శాఖ' కార్యక్రమం ద్వారా ప్రభుత్వం గ్రామాల్లోని రైతుల భూ సమస్యలను పరిష్కరిస్తోందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ జి.మంగు అన్నారు. నవగాం, పొట్లి గ్రామాల్లో శుక్రవారం గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు వారి సమస్యలపై రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా అధికారులు గ్రామాలకు వస్తున్నారని, అక్కడే పరిష్కరిస్తారన్నారు. వివిధ భూ సమస్యలపై 18 దరఖాస్తులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో తిరుపతిరావు, ఆర్‌ఐలు తిరుపతిరావు, సీహెచ్ రమేష్‌బాబు, వివిధ శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.



భామిని: వినతి స్వీకరిస్తున్న తహసీల్దార్

నులకజోడు (భామిని): రైతుల భూ సమస్యలు పరిష్కరించి కంప్యూటర్‌లో అన్ని ధ్రువపత్రాలు జారీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దార్ బి.సత్యం తెలిపారు. నులకజోడులో శుక్రవారం రైతు సేవలో రెవెన్యూ శాఖ' గ్రామసభ నిర్వహిచారు. పట్టాదారు పాస్ పుస్తకాల్లో తప్పులను సరిచేసుకోవాలన్నారు. ఈసందర్భంగా 24 దరఖాస్తులు వచ్చాయని, వాటిని త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కె.ఆఫీసు, ఆర్‌ఐ ఎస్.రాంబాబు, వీఆర్వో కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే అగ్ని ప్రమాదాల నివారణ


అవగాహన కలిగిస్తున్న బలరాం

పాలకొండ రూరల్: అప్రమత్తంగా ఉండడం ద్వారా అగ్ని ప్రమాదాలను నివారించ వచ్చని, దీనిపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని అగ్ని మాపక శాఖ అధికారి పి.బలరాం అన్నారు. శుక్రవారం నవోదయ పాఠశాలలో అగ్ని ప్రమాదాల నివారణపై అవ గాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అగ్ని ప్రమాదాలు సంభవించినపుడు, విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగినపుడు తమను తాము రక్షించుకో వడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది గవరయ్య, జగదీష్, ఆర్‌ఎల్‌నాయుడు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఎంఆర్ వ్యాక్సిన్ తప్పనిసరి

ఎల్‌ఎల్‌పురం (పాలకొండ రూరల్): తొమ్మిది నెలల నుంచి 15 ఏళ్లలోపు విద్యార్థుకు ఎంఆర్ వ్యాక్సిన్ వేయించడం తప్పనిసరని ఎం.సింగుపురం పీహెచ్‌సీ వైద్యాధికారి లిల్లీరాణి అన్నారు. శుక్రవారం ఎల్.ఎల్ పురం, పెదకోటిపల్లి, గుడివాడ, చినకోటిపల్లి గ్రామాల పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఎంఆర్ టీకాలను వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఒక టీకాతో తట్టు, రుబెల్లా వంటి ప్రాణాంతకమైన వ్యాధులు రాకుండా చూడవచ్చన్నారు. వివేకానంద స్కూల్ విద్యార్థులకు ప్రిన్సిపాల్ జి.పారినాయుడు ఆధ్వర్యంలో ఎంఆర్ వ్యాక్సిన్ వేశారు. కార్యక్రమంలో ఎల్.ఎల్.పురం సర్పంచ్ వారాడ మంగమ్మ, వి.శశిధర్ నాయుడు, ఏఎన్ఎం టి.రత్నం, జయమ్మ, బి.రాధ, జ్యోతి, శ్రీనివాస రావు, ఎం.జయప్రదం, పి.సురేష్ పాల్గొన్నారు.


ఎంఆర్ టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

ఘనంగా శ్రావణ శుక్రవారం పూజలు



వీరఘట్టం: కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు, భామిని: తరలివచ్చిన భక్తులు



సీతంపేట, పాలకొండ ఆలయాల్లో సామూహిళ పూజలు చేస్తున్న మహిళలు

పాలకొండ టౌన్: శ్రావణ మాసం మూడో శుక్రవారం సందర్భంగా పలు దేవాలయాల్లో మహిళలు పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వేకువజాము నుంచే భక్తులు ఆలయాలకు చేరుకుని అష్టోత్తర, సహస్ర నామార్చనలు చేశారు. కోట దుర్గ ఆలయంలో ప్రధాన అర్చకుడు దార్లపూడి లక్ష్మీప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేశారు. సంతోషిమాత ఆలయంలో అర్చకుడు బంకుపల్లి నాగేశ్వరశర్మ, పురటాల పోలమ్మ దేవాలయంలో అర్చకుడు వేమకోటి రవిశర్మ మహిళలతో లక్ష్మీ పూజలు చేయించారు. గాయత్రీ ఆలయంలో ప్రధానార్చకుడు బంకుపల్లి చిట్టిబాబు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వీరఘట్టం: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో శ్రావణ మూడో శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. పైడితల్లి అమ్మవారి ఆలయంలో మహిళలు సామూహిక కుంకుమపూజలు చేశారు. ప్రముఖ యజ్ఞకర్త ఎస్‌వీఎల్‌ఎన్ శర్మయాజి ఆధ్వర్యంలో మహిళలు కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు.

బత్తిలి (భామిని): శ్రావణమాసం మూడో శుక్రవారం పురస్కరించుకొని బత్తిలి సంతోషిమాత ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ అర్చకులు రంపా తాతబాబు శర్మ, సీతారాంభట్లు ఆధ్వర్యంలో మహిళలు సామూహిక కుంకుమపూజలు, ఉద్యాపనలు చేశారు. లలితాదేవి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దాతలు భక్తులకు ఉచిత ప్రసాదం పంపిణీ చేశారు.

సీతంపేట: సంతోషిమాత ఆలయంలో శ్రావణ శుకవ్రారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు వేమకోటి సాయికృష్ణశర్మ ఆధ్వర్యంలో మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేశారు. మహాలక్ష్మి అవతారంలో కొలువుదీరిన అమ్మవారిని మహిళలు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

సినిమాలు

పాలకొండ

శ్రీరామ కళామందిర్: లై

వెంకటగౌరి: ఫిదా

వీరఘట్టం

బీఎంఆర్ థియేటర్: నేనే రాజు.. నేనే మంత్రి

పాతపట్నంలో వర్షం

పాతపట్నం: మండలంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. సీది గ్రామానికి చేరువలో ఓ చెట్టుపై పిడుగు పడింది. దీంతో అక్కడే ఉన్న అడప పోలమ్మ అనే మహిళ స్వల్పంగా గాయపడగా వైద్య సేవలందించినట్లు వీఆర్‌వో డి.ఆదినారాయణ తెలిపారు. కాగా పిడుగుపాటుకు స్థానిక పంచాయతీ కార్యాలయానికి చేరువలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పాడయింది. దీంతో దువ్వారవీధి మొదలుకొని శాంతినగర్ వరకూ విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మధ్యాహ్నం 3.30 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకూ విద్యుత్ సరఫరా లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

కొత్తూరు: గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంటేనే అందరూ సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని వెలుగు పీడీ విజయ్‌కుమార్ చెప్పారు. అందువల్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి విద్యార్థి కృషి చేయాలని కోరారు. బహిరంగ మలవిసర్జనకు వ్యతిరేకంగా చేపట్టిన వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి నాలుగు రోడ్ల జంక్షన్ వరకు విద్యార్థులు, అధికారులు, ప్రజా ప్రతినిధులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్వచ్ఛ భారత్ ఆవశ్యకతను వివరించారు. ప్రతి ఇంటా మరుగుదొడ్డి నిర్మాణం చేపట్టాలన్నారు. అనంతరం స్థానిక నాలుగు రోడ్ల జంక్షన్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'మరుగుదొడ్ల నిర్మాణాలు వేగవంతం కావాలి'

పాతపట్నం: మరుగుదొడ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని ఎంపీడీవో బి.చిన్నమ్ముడు అన్నారు. ఆమె ఉపాధి సిబ్బందితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. ఎస్‌బీఎం విధానంలో భాగంగా మరుగుదొడ్ల నిర్మాణాలు వేగవంతం చేసేందుకు చేపడుతున్న వివరాలు 11 పంచాయతీల నుంచి రావాల్సి ఉందని చెప్పారు. సీఎఫ్‌లు ప్రత్యేకదృష్టి సారించి నిర్మాణాలు వేగవంతం చేయించాలన్నారు. సమావేశంలో ఏపీడీ అప్పలసూరి, ఏపీవో నాగరాజు తదిరతులు పాల్గొన్నారు.



కొత్తూరు: మానవారంగా ఏర్పడిన విద్యార్థులు

'పాడితోనే రైతుల అభ్యున్నతి'



పెద్దపద్మాపురంలో పశువైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

పెద్దపద్మాపురం(మెళియాపుట్టి): పాడి పరిశ్రమ అభివృద్ధి చెందితేనే రైతుల అభ్యున్నతి సాధ్యపడుతుందని పాతపట్నం మార్కెట్ కమిటీ అధ్యక్షుడు కొంచాడ వీరభద్రరావు తెలిపారు. శుక్రవారం ఆయన పెద్దపద్మాపురంలో నిర్వహించిన పశువైద్య శిబిరంలో మాట్లాడారు. ప్రభుత్వం పాడి పరిశ్రమ అభివృద్ధికి పెద్దఎత్తున నిధులు వెచ్చిస్తోందని, దీన్ని రైతులు వినియోగించుకోవాలని కోరారు. పాల ఉత్పత్తితో రైతుల్లో ఆర్థికంగా ఎదుగుదల కనిపిస్తుందని, దీన్ని ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకొని పశుపోషణ వైపు దృష్టిసారించాలన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ ఉపాధ్యక్షుడు అనపాన రాజశేఖరరెడ్డి, సర్పంచ్ లింగాల సంజీవరావు, ఎంపీటీసీ సభ్యుడు రుక్మంధరరావు, మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

హిరమండలంలో షార్ట్ ఫిలిం చిత్రీకరణ



షార్ట్ ఫిలింకు క్లాప్ కొడుతున్న దృశ్యం

హిరమండలం: ఓ షార్ట్ ఫిలిం చిత్రీకరణ శుక్రవారం హిరమండలం పరిసర ప్రాంతాల్లో ప్రారంభమైంది. సుభలయలోని చెవిటమ్మతల్లి అవలంగి సర్పంచ్ లోలుగు లక్ష్మణరావు ముహూర్తపు షాట్‌కు క్లాప్ కొట్టారు. పెద్దింటి వారు పిల్లల్ని కనివదిలేస్తే వారు అనాథలుగా పడే కష్టాలు, పెద్దింటి అమ్మాయిలు అనాథలపై చూపే ప్రేమ ఇతివృత్తంగా ఈ షార్ట్ ఫిలిం నిర్మిస్తున్నట్లు నిర్మాతలు తెలిపారు. ఇందులో సుభలయకు చెందిన రమేష్, అప్పన్న, ఝాన్సీ, విశాఖకు చెందిన అనూష నటిస్తున్నట్లు చెప్పారు.

భూ సమస్యల పరిష్కా వేదిక రైతు సేవలో...



మాట్లాడుతున్న డిప్యూటీ తహసీల్దార్

గురండి(కొత్తూరు): గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న భూ సమస్యల పరిష్కారానికి రైతు సేవలో రెవెన్యూ శాఖ దోహదపడుతుందని డిప్యూటీ తహసీల్దార్ ఎం.శంకరరావు చెప్పారు. శుక్రవారం ఆయన గురండి గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో మాట్లాడారు. రైతుల భూముల రికార్డుల్లో తప్పిదాలు ఉంటే ఈ గ్రామసభల ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ వేణుగోపాలరావు, తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసిత గ్రామాల్లో రేషన్ పునరుద్ధరణ

హిరమండలం: వంశధార నిర్వాసిత గ్రామాల్లో రేషన్ సరఫరాను శుక్రవారం పునరుద్ధరించారు. ఈ గ్రామాల్లో ఈ నెల ఒకటో తేదీ నుంచి రేషన్ పంపిణీని నిలిపివేశారు. దీంతో ఆందోళన చెందిన నిర్వాసితులు అధికారులను ఆశ్రయించారు. కలెక్టర్‌తో ఇటీవల జరిగిన చర్చల్లో కుదిరిన అంగీకారం మేరకు శుక్రవారం నుంచి ముంపు గ్రామాల్లోనే రేషన్‌తో పాటు పింఛన్లు, ఇతర సంక్షేమ పథకాలు పంపిణీ చేస్తున్నట్లు తహసీల్దార్ ఎం.కాళీప్రసాదరావు చెప్పారు.

'పనిచేయని సిబ్బందిని సరెండర్ చేయండి'

ఎల్.ఎన్.పేట: మండల పరిషత్ కార్యాలయంలో బాధ్యతాయుతంగా పనిచేయని సిబ్బందిని జిల్లా పరిషత్‌కు సరెండర్ చేయాలని మండల ప్రత్యేకాధికారి ధనుంజయరావు అన్నారు. శుక్రవారం ఆయన మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల సిబ్బంది పనితీరు తెలుసుకుని వారి హజరు పట్టికను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల గ్రామాల్లో చేపట్టిన వ్యక్తిగత మరుగుదొడ్ల సర్వే వివరాలను ఈనెల 18వ తేదీలోగా ఆన్‌లైన్‌లోతప్పనిసరిగా నమోదుచేయాలన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలను దిగువ స్థాయి సిబ్బంది పాటించాలని స్పష్టం చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాలను పాటించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆయన వెంట ఎంపీడీవో సిహెచ్.మోహన్‌ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి ధనుంజయరావు

'జగన్ ఉన్మాదిలా వ్యవహరిస్తున్నారు'

పాతపట్నం: ప్రతిపక్ష నేత వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి ఉన్మాదిలా వ్యవహరిస్తున్నారని ఎమ్మెల్యే కలమట వెంకటరమణమూర్తి అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక విలేఖర్లతో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబును చంపినా, ఉరితీసినా ఫర్వాలేదని చేసిన వ్యాఖ్యలు ఆయన ఉన్మాదత్వాన్ని తెలియజేస్తోందని చెప్పారు. జగన్ కుటుంబం ఫ్యాక్షన్ రాజకీయాలే కోరుకుంటోందన్నారు. హుందాతనం లేని నాయకుడిని ప్రజలు ఎలా అంగీకరిస్తారని ప్రశ్నించారు. రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసి నంద్యాల ఉప ఎన్నికను వాయిదా వేయించేందుకు ప్రయత్నిస్తున్నట్లుందన్నారు. ఉపరాష్ట్రపతిగా వెంకయ్యనాయుడు ఎన్నికవడం తెలుగుజాతికి గర్వకారణమని అన్నారు. దేశంలోని అత్యున్నత పదవులు చేపట్టిన తెలుగువారి జాబితాలో వెంకయ్యనాయుడు పేరుండడం ఆనందదాయకమని చెప్పారు. సమావేశంలో టీడీపీ నేతలు పైల లక్ష్మయ్య, శివాల చిన్నయ్య, రేగేటి రమణ, శాసనపురి బుల్లిబాబు తదితరులు పాల్గొన్నారు.



విలేఖర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కలమట

'రిజర్వాయర్ పనులు వేగవంతం చేస్తాం'

హిరమండలం: వంశదార రిజర్వాయర్ పనులు వేగవంతం చేస్తామని ఉత్తరాంధ్ర ప్రాజెక్టుల చీఫ్ ఇంజినీర్ ఎం.టి.రాజు చెప్పారు. శుక్రవారం ఆయన వంశధార రిజర్వాయర్ పనులను పరిశీలించి అధికారులు, కాంట్రాక్టర్‌కు పలు సూచనలు చేశారు.

అనంతరం విలేఖరులతో మాట్లాడుతూ ప్రభుత్వం రిజర్వాయర్‌ను గడువులోగ పూ ర్తిచేసేందుకు చర్యలు చేపట్టిందని చెప్పారు. ప్రస్తుతం స్పిల్‌వే, గార్లపాడు వద్ద రిజర్వాయర్ గట్టు పనులు చే పట్టామన్నారు. స్పిల్‌వే పనులకు 12 లక్షల క్యూబిక్ మీట ర్లు, గార్లపాడు వద్ద గట్టుకు 12.5 లక్షల క్యూబిక్ మీటర్లు, తులగాం వద్ద గట్టు పనికి 7 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి అవసరమని, దీన్ని సేకరించే పనిలో ఉన్నామన్నారు.



కాంట్రాక్టర్‌కు సూచనలు ఇస్తున్న సీఈ రాజు

రుణాలకు ధ్రువపత్రాల పరిశీలన

ఎల్.ఎన్.పేట: బీసీ, ఎస్సీ, ఎస్టీ, కాపు కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసిన వారి ధ్రువీకరణ పత్రాలను శుక్రవారం పరిశీలించినట్లు ఎంపీడీవో సిహెచ్.మోహన్‌ప్రసాద్ తెలిపారు. బీసీల నుంచి 481, ఎస్సీల నుంచి 75, ఎస్టీల నుంచి 28, కాపుల నుంచి 84 దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. వీటిని పరిశీలించిన తరువాత అర్హుల దరఖాస్తులను సంబంధిత బ్యాంకులకు పంపిస్తామన్నారు. ఇన్‌చార్జి ఈవోపీఆర్‌డీ శేఖర్, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

'సమస్యలు పరిష్కరించాకే పనులు చేపట్టాలి'

హిరమండలం: వంశధార నిర్వాసితుల సమస్యలు పూర్తిగా పరిష్కరించి పునరావాసం కల్పించాకే రిజర్వాయర్ పనులు చేపట్టాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎం.కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన గార్లపాడులో నిర్వాసితులతో మాట్లాడారు. కాంట్రాక్టర్‌కు 2017 ధరల ప్రకారం బిల్లులు చెల్లించి సర్వం కోల్పోతున్న నిర్వాసితులకు 2005 నాటి ధరలు ఇవ్వడం శోచనీయమన్నారు. మంత్రి ఇంటి అద్దె నెలకు రూ.లక్ష చెల్లిస్తున్న ప్రభుత్వం నిర్వాసితుల ఇంటి నిర్మాణానికి రూ.53 వేలా ఇచ్చేదన్నారు. పోలవరం నిర్వాసితులకు ఇళ్ల నిర్మాణానికి ఇస్తున్నట్లే ఇక్కడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టుల నిర్మాణంపై హైకోర్టులో స్టేటస్‌కో ఉన్నప్పుడు రిజర్వాయర్ పనులు ఎలా చేపడతారని, ఇది కోర్టు ధిక్కారం కిందకు రాదా అని ప్రశ్నించారు. సమస్యల పరిష్కారం కోసం పోరాడితే నిర్వాసితులపై కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేయడంపై ఆవేదన వ్యక్తం చేశారు.

సబ్సిడీపై సూక్ష్మ పోషకాలు

ఎల్.ఎన్.పేట: మండలంలోని రైతులకు 50 శాతం సబ్సిడీపై సూక్ష్మ పోషకాలు పంపిణీ చేయనున్నట్లు వ్యవసాయాధికారి బొడ్డేపల్లి పద్మనాభం తెలిపారు. మోనోక్రోటోపాస్, డైక్లోరోవాస్, సూడోమోనాస్ హాజిటోబ్యాక్టర్, బయో ప్రొడక్ట్సుకు సంబంధించిన సూక్ష్మ పోషకాలను ఈ నెల 17వ తేదీ నుంచి బయోమెట్రిక్ విధానంలో అందించనున్నట్లు చెప్పారు. వీటిని కొనుగోలు చేసే వారికి జిప్సం, జింకు ఉచితంగా ఇవ్వనున్నట్లు తెలిపారు. అవసరమైన రైతులు వారి ఆధార్ కార్డు, పట్టాదారు పాస్‌పుస్తకం తీసుకుని రావాలని సూచించారు.

పాతపట్నంలో సినిమాలు

ఉమామహల్: నేనే రాజు నేనే మంత్రి

హిరమండలంలో..

వరలక్ష్మి : లై

కొత్తూరులో..

గౌరీశంకర : జయ జానకి నాయక
ఉమాశంకర: లై

డోలపేటలో పూడికతీత

రాజాంరూరల్: డోలపేట కాలువల్లో శుక్రవారం పూడికతీశారు. ఇన్‌చార్జి కమిషనర్ బొడ్డేపల్లి రాము, ఏఈ జి.సురేష్‌కుమార్ పనులను పరిశీలించారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. అన్ని వార్డుల్లో కాలువలను శుభ్రం చేయించి బ్లీచింగ్ చల్లించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.



పూడిక తీస్తున్న కార్మికులు

రుణాల ఎంపికకు తరలివచ్చిన యువత

● 190 యూనిట్లకు 708 మంది హాజరు



దరఖాస్తులు పరిశీలిస్తున్న కమిటీ సభ్యులు

రాజాంరూరల్: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఫెడరేషన్ రుణాలకు లబ్ధిదారుల ఎంపిక కార్యక్రమం మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ప్రత్యేకాధికారి స్వరూపారాణి ఆధ్వ ర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా 190 యూనిట్లకు 1,311 దరఖాస్తులు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో రాగా 708 మంది యువతీ యువకులు ఇంటర్వ్యూకు హాజరయ్యారు. యూనిట్లు తక్కువగా ఉండడం దరఖాస్తుదారులు ఎక్కువగా ఉండడంతో వచ్చిన వారిలో నిరాశ వ్యక్తమైంది. దరఖాస్తుల పరిశీలనకు ఆరు కౌంటర్లను ఏర్పాటు చేసి పంచాయతీ కార్యదర్శు లు, మండల సాక్షర భారత్ కోఆర్డినేటర్లను నియమించారు. ఎంపీపీ జడ్డు ఉషారాణి, జడ్పీ టీసీ సభ్యుడు టంకాల పాపినాయుడు, ఎంపీడీవో బి.వెంకటేశ్వరరావు, కమిటీ సభ్యులు బొత్స శంకరరావు, పంచిరెడ్డి వెంకటలక్ష్మి తదితరులు దరఖాస్తులను పరిశీలించారు. సాయంత్రం 6 గంటల వరకు దరఖాస్తుదారులు వస్తుండడంతో ఎవరినీ నిరాశ పరచకుండా వారి దరఖాస్తులను కూడా స్వీకరించి పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు చీడి రాజేశ్వరి, జడ్డు విష్ణుమూర్తి, మంగం రమేష్, గోనుపాటి దేవిక, వంగా వెంకటరావు, గురవాన నారాయణరావు, నక్క దశరథరాం, ఎస్సీ కార్పొరేషన్ సూపరింటెండెంట్ ఎస్.గురివినాయుడు, పలు బ్యాంకుల మేనేజర్లు పాల్గొన్నారు.

అంతర్గత రోడ్ల నిర్మాణం ప్రారంభించండి

వీవీఆర్‌పేట (వంగర): మండలంలోని అన్ని గ్రామాల్లో 13వ ఆర్థిక సంఘం, జనరల్ ఫండ్‌లతో అంతర్గత రోడ్ల నిర్మాణాలు వెంటనే ప్రారంభించాలని డీఈ ఎన్.సీతంనాయుడు అన్నారు. శుక్రవారం గ్రామం లో సీసీ రహదారి నిర్మాణాన్ని పరిశీలించారు. సర్పంచ్ మరిశర్ల విజయలక్ష్మి ప్రధాన మార్గంలో సీసీ రహదారి, కాలువల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని తీర్మానించగా డీఈ వెంటనే నిధులు మంజూరుచేశారు. మండలంలోని అన్ని గ్రామాలకు అంగన్‌వాడీ కేంద్రాలకు భవనా లు మంజూరయ్యాయన్నారు. ఆయన వెంట జేఈ ప్రభాకరరావు తది తరులున్నారు.



రోడ్డును పరిశీలిస్తున్న డీఈ

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడి



అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారి

గడిగుడ్డి (సీతంపేట): వరి సాగులో ఆధునిక పద్ధతులను పాటించడం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చని ప్రాజెక్టు వ్యవసాయాధికారి భవానీశంకర్ అన్నారు. శుక్రవారం గడిగుడ్డి గ్రామంలో ఆత్మ ప్రాజెక్టులో భాగంగా డ్రమ్ సీడర్‌తో వరి విత్తనాలు వేసే విధానాన్ని ప్రయోగాత్మకంగా వివరించారు. ఈ విధానంలో వరినాట్లు వేయడంతో తక్కువ ఖర్చు, ఎక్కువ ఉత్పత్తి సాధించవచ్చన్నారు. రైతులకు ఉచితంగా జింకు సల్ఫేట్ పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏవో ప్రసాదరావు, ఎంపీఈవోలు సాయిమహేష్, దేవి, వెంకటలక్ష్మి, సతీష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జింకు సల్ఫేట్‌ను వినియోగించండి

భామిని: జింకు సల్ఫేట్ లోపం వల్ల పంటలకు తెగుళ్లు సోకే అవకాశం ఉందని, అందువల్ల ప్రభుత్వం ఉచితంగా ఐదు ఎకరాల వరకు జింకు సల్ఫేట్ అందజేస్తోందని ఏవో ఎం.మురళీకృష్ణ తెలిపారు. రైతులు తమ ఆధార్‌ను బయోమెట్రిక్ విధానంలో నమోదు చేసుకొని ప్రభుత్వం అందజేస్తున్న జింకు సల్ఫేట్‌ను వినియోగించుకోవాలన్నారు. శుక్రవారం పలువురు రైతులకు జింకు సల్ఫేట్‌ను అందజేశారు.

పారిశుధ్య పరిరక్షణకు పాటుపడండి

రేగిడి: గ్రామాలను ఆరోగ్యకరంగా తీర్చిదిద్దేందుకు పారిశుధ్యాన్ని పరిరక్షించాలని, ఇది ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎంపీడీవో బి.శంకరరావు, తెలుగుయువత మండల అధ్యక్షుడు కిమిడి వినయ్‌కుమార్ అన్నారు. పారిశుధ్య వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రోడ్లు, కాలువల్లో చెత్త వేయ వద్దని, గ్రామ శివారు డంపింగ్‌యార్డులో వేయాలని సూచించారు. ఇంటి పరిసరాలతో పాటు గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. స్వచ్ఛంద సంస్థలు చొరవ చూపి పారిశుధ్యంపై గ్రామస్థులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.సూరమ్మ, ఏపీవో అరుణకుమారి, టీడీపీ నాయకులు టి.గోవిందరావు, టి.కృష్ణ, బెవర లక్ష్మీరాంబాబు తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ మల విసర్జన నేరం..

రాజాంరూరల్: బహిరంగ మలవిసర్జన నేరమని, అందువల్ల ప్రతి ఇంటిలో మరుగుదొడ్లు నిర్మించుకోవాలని ఎంపీపీ జడ్డు ఉషారాణి అన్నారు. స్వచ్ఛభారత్ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాజాం తదితర గ్రామాల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం ఈనెల 9 నుంచి 15 వరకు స్వచ్ఛభారత్ వారోత్సవాలు నిర్వహిస్తుందని, అన్ని గ్రామాల్లోను బహిరంగ మలవిసర్జన లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మరుగుదొడ్డి నిర్మాణానికి ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తుందన్నారు. దీనిని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి స్వరూపారాణి, ఎంపీడీవో బి.వెంకటేశ్వరరావు, జడ్పీటీసీ సభ్యుడు టంకాల పాపినాయుడు, పొగిరి సర్పంచ్ జడ్డు విష్ణు, నాయకులు నాగళ్ల అప్పలనాయుడు, సామంతుల తవిటినాయుడు, వంగా వెంకటరావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



రాజాంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



రేగిడిలో అధికారులు, నాయకుల మానవహారం

ఎంఆర్ వ్యాక్సిన్‌తో సంపూర్ణ ఆరోగ్యం





వంగర, రేగిడి మండలాల్లో వ్యాక్సిన్ వేస్తున్న వైద్య సిబ్బంది

మడ్డువలస (వంగర): పిల్లలకు ఎంఆర్ వ్యాక్సిన్ వేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తయారయ్యేందుకు అవకాశం ఉందని వైద్యాధికారి డి.అనిల్ అన్నారు. శుక్రవారం మడ్డువలస సాంఘిక గురుకుల పాఠశాలలో విద్యార్థులకు వ్యాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తొమ్మిది నెలల నుంచి 15 ఏళ్ల లోపు పిల్లలకు ఈ వ్యాక్సిన్ వేయడం వల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. సిబ్బందితో పాటు తల్లిదండ్రులు కూడా బాధ్యతగా వ్యవహరించి తమ పిల్లలకు వ్యాక్సిన్ వేయించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటరావు, సీహెచ్‌వో భాస్కరరావు, వైద్య, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్మీపురం (రేగిడి): ఒక టీకాతో రెండు వ్యాధులు నివారించవచ్చని రేగిడి పీహెచ్‌సీ వైద్యాధికారి పి. పవన్‌కుమార్ అన్నారు. శుక్రవారం లక్ష్మీపురం, దేవుదల, ఆడవరం, అప్పాపురం, గోపెంపేట, మజ్జిరాముడుపేట తదితర గ్రామాల్లోని పాఠశాలల విద్యార్థులకు ఎంఆర్ వ్యాక్సిన్ వేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ టీకా వేయడం ద్వారా తట్టు, రూబెల్లా వంటి వ్యాధులు దరిచేరవన్నారు. మండలంలో ఇంతవరకు 92.70 శాతం విద్యార్థులకు ఎంఆర్ వ్యాక్సిన్ వేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో సీహెచ్‌వో, పలువురు వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పూర్తిస్థాయి వైద్యాధికారుల నియామకానికి కృషి



మాట్లాడుతున్న గ్రీష్మాప్రసాద్

రాజాం అర్బన్: సామాజిక ఆసుపత్రిలో పూర్తి స్థాయిలో వైద్యాధికారుల నియామకానికి కృషి చేస్తానని, ఇప్పటికే ఈ విషయాన్ని మాజీ ఎమ్మెల్సీ కావలి ప్రతిభాభారతి ద్వారా సంబంధిత శాఖామంత్రి దృష్టికి తీసుకువెళ్లామని ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఛైర్‌పర్సన్ కావలి గ్రీష్మప్రసాద్ చెప్పారు. శుక్రవారం ఆమె విలేఖరులతో మాట్లాడుతూ.. ప్రజలకు పూర్తి స్థాయిలో వైద్యసేవలందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటు న్నామన్నారు. ప్రస్తుతం 60 పడకల ఆసుపత్రి రీతిలో వైద్యసేవలు అందిస్తున్నామని, 43మంది వైద్యాధికారులు, సిబ్బంది ఉండాలని అయితే 10 మంది వైద్యాధికారులు న్నారని, మిగిలిన వారి నియామకానికి కృషి చేస్తామన్నారు. ఈనెల 21న సర్జన్ జాయిన్ అవుతున్నారని ఆమె పేర్కొన్నారు.

భూ సమస్యల పరిష్కారమే ధ్యేయం

బొడ్డవలస (రేగిడి): గ్రామాల్లో అపరిష్కృతంగా ఉన్న రైతుల భూ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రభుత్వం 'రైతు సేవలో రెవెన్యూ శాఖ' కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ బి.సూరమ్మ, వ్యవసాయాధికారి మధుసూదనరావు కోరారు. సంకిలి, బొడ్డవలస, అప్పాపురం గ్రామాల్లో శుక్రవారం గ్రామ సభలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇపాస్ పుస్తకాల నిమిత్తం 'మీసేవ' కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మ్యూటేషన్ల కోసం వినతులిచ్చిన రైతుల వద్ద రిజిస్ట్రేషన్ పత్రాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. వారసత్వం, గిఫ్ట్ వంటి భూ సమస్యలు ధ్రువీకరణ పత్రాల ద్వారా పరిష్కరిస్తామన్నారు. ఈ సందర్భంగా రైతుల నుంచి 82 దరఖాస్తులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో ఆర్ఐలు ప్రసాదరావు, కంబాల శ్రీవిద్య, సీనియర్ అసిస్టెంట్ వావిలపల్లి రవికుమార్, వీఆర్వో అనంతరావు, పంచాయతీ కార్యదర్శి ఎం .సావిత్రి, సర్పంచ్‌లు, రైతులు పాల్గొన్నారు.



వంగర: అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

వీవీఆర్‌పేట (వంగర): రైతులు రెవెన్యూ పరంగా ఎదుర్కొంటున్న భూ సమస్యలను తక్షణం పరిష్కరించేందుకు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని ఇన్‌చార్జి తహసీల్దార్ బి.గోవిందరావు అన్నారు. శుక్రవారం వీవీఆర్‌పేట, జేకే గుమడల్లో గ్రామసభలు నిర్వహించారు. సర్పంచ్ విజయలక్ష్మితో పాటు పలువురు రైతులు మ్యూటేషన్, ఇపాస్‌పుస్తకాలకు దరఖాస్తులు చేసి రోజులు గడుస్తున్నా అధికారులు రికార్డులు అందజేయలేదని పేర్కొన్నారు. వెంటనే సమస్య పరిష్కరిస్తామని ఇన్‌చార్జి తహసీల్దార్ హామీ ఇచ్చారు.

మొగిలివలస (రాజాంరూరల్): భూ సమస్యల పరిష్కారమే 'రైతు సేవలో రెవెన్యూశాఖ' కార్యక్రమం ఉద్దేశమని తహసీల్దార్ వై.శ్రీనివాసరావు పేర్కొన్నారు. శుక్రవారం మొగిలివలస, అంతకాపల్లి గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా 18 వినతులను స్వీకరించారు. కార్యక్రమంలో స్థానికులు వాకముల్ల చిన్నారావు, సామంతుల చిరంజీవినాయుడు, ఆర్ఐ శ్రీకాంత్, సర్వేయర్ శంకరరావు, వీఆర్వో శశికుమార్ పాల్గొన్నారు.

మొక్కను దత్తత తీసుకుని సంరక్షించండి

రేగిడి: ప్రతి ఒక్కరు మొక్కను దత్తత తీసుకుని దానిని సంరక్షించాలని, ఇది భావి తరాలకు ఉపయోగపడుతుందని తెలుగుయువత మండల అధ్యక్షుడు కిమిడి వినయ్‌కుమార్, ఎంపీడీవో బాసూరి శంకరరావు, తహసీల్దార్ బి.సూరమ్మ అన్నారు. శుక్రవారం ఆర్ ఆమదాలవలస, వెలుగు కార్యాలయ ఆవరణల్లో 'వనం-మనం' నిర్వహించారు. సర్పంచ్ బెవర వెంకటలక్ష్మీ రాంబాబు, నాయకులు టంకాల గోవిందరావు, చిన్నపట్టాభిరామారావు, న్యాయవాది వైవీ రమణ, ఏపీవో జి.అరుణకుమారి పాల్గొన్నారు.


మొక్క నాటుతున్న దృశ్యం

శ్రావణ సందడి..!

- ఘనంగా వరలక్ష్మీ వ్రతాలు
- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు



రాజాంలోని నవదుర్గ మాతను దర్శించుకునేందుకు తరలి వచ్చిన భక్తులు


వంగరలో: సంగమేశ్వరునికి అభిషేకం

రాజాంఅర్బన్: శ్రావణ మాసం మూడో శుక్రవారం సందర్భంగా పట్టణంతో పాటు పలు గ్రామాల్లోని ఆలయాలు మహిళలతో కిటకిటలాడాయి.. నవదుర్గాలయం, వాగ్దేవి ఆలయం, డోలపేట, కూరాకుల వీధి ఉమారామలింగేశ్వర ఆలయాలు, రాణావీధి విష్ణు ఆలయం, పోలిపల్లి పైడితల్లి ఆలయాలతో పాటు షిర్డీసాయి, గణపతి ఆలయాలకు పెద్ద ఎత్తున మహిళలు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పలు ఆలయాల్లో సామూహిక కుంకుమ పూజలు చేశారు. నవదుర్గాలయంలో భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని షామియానులను ఏర్పాటు చేశారుజ ఈవో శ్యామలరావు, ఆలయ ధర్మకర్త వి.నర్సింగరావు, సభ్యుడు కె.వెంకటరావు, ప్రధాన అర్చకుడు వేమకోటి రవికిరణ్‌శర్మ భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పర్యవేక్షించారు.


రేగిడి: బూరాడలో పూజలు చేస్తున్న దృశ్యం

ఘనంగా వరలక్ష్మీ వ్రతాలు

రేగిడి: మండలంలోని పలు దేవాలయాల్లో శ్రావణమాసం మూడో శుక్రవారం సందర్భంగా మహిళలు వరలక్ష్మీ వ్రతాలను నిర్వహించారు. ఉంగరాడమెట్ట వెంకటేశ్వర, షిర్డీసాయి, గాయత్రీ ఆలయాల్లో అర్చకులు మురపాక ఉమామహేశ్వరరావు, తిరుమల శర్మ, బూరాడ సంతోషిమాత ఆలయంలో అర్చకుడు జాడ సంతోష్‌కుమార్ వరలక్ష్మీ వ్రతాలను మహిళలతో చేయించారు. ఈ సందర్భంగా కుంకుమ పూజలు, సహస్ర నామార్చనలు చేపట్టారు.

పవిత్ర స్నానాలు ఆచరించి...

వంగర: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం సంగాం సంగమేశ్వర ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. త్రివేణి సంగమంలో పవిత్ర స్నానాలను ఆచరించి స్వామిని దర్శించుకున్నారు. మడ్డువలస రిజర్వాయర్ గిరిపై సాయినాథుని ఆలయం, తలగాం ఉమారామలింగేశ్వరాలయం, పట్టువర్దనం దుర్గాలయాలకు భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

వీధిలైట్లు లేక రాకపోకలకు ఇక్కట్లు

రాజాంఅర్బన్: నగరపంచాయతీ పరిధి డోలపేట-పొనుగుటివలస కూడలి నుంచి జీఎం ఆర్ కేర్ ఆసుపత్రి కూడలి వరకు వీధి లైట్లు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి.. లైట్లు లేకపోవడంతో రాత్రి సమయాల్లో రాకపోకలకు ఇక్కట్లకు గురవుతున్నామని పలువురు వాపోతున్నారు. రాజాం-పాలకొండ ప్రధాన రహదారి కావడంతో బస్సులతో పాటు ప్రైవేట్ వాహనాలు, ద్విచక్ర వాహనాలు నిత్యం రాత్రింబవళ్లు తిరుగుతుంటాయని, చీకటిగా ఉండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని వారంటున్నారు. పాదచారులను ద్విచక్రవాహనచోదకులు ఢీకొన్న సంఘటనలు కూడా ఉన్నాయని వాపోతున్నారు. ఇప్పటికైనా నగరపంచాయతీ అధికారులు స్పందించి వీధి దీపాలు వేసేందుకు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

అంకిత భావంతో విద్యాబోధన

సంతకవిటి: పాఠశాలలకు బదిలీపై వచ్చిన హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు అంకిత భావంతో విద్యాబోధన చేయాలని ఎంఈవో శాంతికుమారి అన్నారు. శుక్రవారం స్థానిక ఎమ్మార్సీ భవనంలో హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించా రు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 90 శాతం వరకు పాఠశాలల్లో ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలు బదిలీపై వచ్చిన వారేనని, పాఠశాలలను బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వచ్చే విద్యాసంవత్సరం నాటికి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగాలంటే ఈ ఏడాది చేసిన బోధన వల్లే సాధ్యపడుతుందన్నారు.ఈ దిశగా పాటుపడాలన్నారు.

విద్యార్థులకు బూట్లు పంపిణీ

జావాం ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు జీఎంఆర్ వీఎఫ్ ఆధ్వర్యంలో 150 మందికి బూట్లు పంపిణీ చేశారు.


బూట్లు అందజేస్తున్న ఉపాధ్యాయులు

స్వచ్ఛంద సంస్థలు విద్యార్థులకు సౌకర్యాలు కల్పించడం అభినందనీయమని హెచ్‌ఎం నారాయణరావు అన్నారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, జీఎంఆర్‌వీఎఫ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

జెమ్స్‌లో నర్సింగ్ కోర్సుకు ప్రభుత్వ అనుమతి

శ్రీకాకుళం సిటీ: రాగోలు జెమ్స్ బోధనాస్పత్రికి జనరల్ నర్సింగ్ అండ్ మిడ్‌వైఫరీ కోర్సు నిర్వహించేందుకు ప్రభుత్వం అనుమతించింది. ఈ మేరకు శుక్రవారం వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కమిషనర్ పూనం మాలకొండయ్య జీవో నెంబర్ 135 జారీ చేశారు. 50 సీట్లు కేటాయించి కోర్సు నిర్వహించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి కళాశాలలో ఈ కోర్సు నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాలు, బోధన, వసతి, పుస్తకాలు నిబంధనల ప్రకారం సమకూర్చాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఎంపిక ప్రక్రియ, మౌలిక వసతులు, ఇతర వ్యవహారాల బాధ్యతను ప్రభుత్వం జాయింట్ కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబుకు అప్పగించింది.

విద్యార్థుల స్వాతంత్ర్యోత్సాహం



నృత్యాలను ప్రాక్టీసు చేస్తున్న విద్యార్థినులు



(శ్రీకాకుళం సిటీ)

పాఠశాల విద్యార్థుల్లో ఉత్సాహం ఉరకలేస్తోంది. పూర్తిస్థాయిలో చదువులో నిమగ్నమైన విద్యార్థులకు పంద్రాగస్టు రూపంలో ఆటవిడుపు లభించింది. చదువు కాస్త పక్కనపెట్టి ఆటపాటల్లో, బడుల ముస్తాబులో నిమగ్నమయ్యారు. నగరంలోని ప్రభుత్వ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలతో పాటు పలు పాఠశాలల్లో విద్యార్థులు తమ బడులను ముస్తాబు చేసే పనిలో నిమగ్నమయ్యారు. మరికొందరు ఆటపాటలు, నృత్యాల పోటీల్లో నిమగ్నమయ్యారు. వారిలో దే శభ క్తితో పాటు ఆనందోత్సాహాలు, పోటీతత్వం వెల్లివిరుస్తోంది. ఎక్కడ చూసినా విద్యార్థుల హడావుడి కనిపిస్తోంది. పంద్రాగస్టు సందడితో పాఠశాలల్లో సందడి వాతావరణం కనిపిస్తోంది.





బాలికోన్నత పాఠశాలలో వేడుకలకు జాతీయ పతాకాన్ని సిద్ధం చేస్తున్న దృశ్యం..విద్యార్థుల శ్రమదానం



పాఠశాలలను శుభ్రపరిచే పనిలో..

రిమ్స్ ఆస్పత్రి సమాచారం

రూమ్ నంబర్	అందే సేవలు
1, 1ఏ, 1బీ	ఓపీ , అత్యవసర వైద్యం, ప్రాథమిక తనిఖీ
2	ఫిజియోథెరపీ
3	ఎముకల విభాగం
4	శస్త్రచికిత్స విభాగం
5	కట్లు కట్టు విభాగం
6	ఇంజక్షన్లు ఇచ్చే విభాగం
7	ప్రసూతి, స్త్రీ వైద్యం
8	కుటుంబ సంక్షేమ విభాగం
9	ఆల్ట్రా సౌండ్ విభాగం
10	ఎక్స్‌రే విభాగం
11	నేత్ర విభాగం
12	మందులు ఇచ్చే విభాగం
13	జనరల్ మెడిసిన్
14, 14ఏ	టీబీ, కెళ్ల పరీక్ష విభాగం
15, 15బీ, 15ఏ	పిల్లల విభాగం, పౌష్టికాహార పునరావస కేంద్రం
16	చర్మ వ్యాధుల విభాగం
17	మానసిక వైద్య విభాగం
18	రక్త పరీక్షలు (ల్యాబ్)
19	రక్తనిధి (బ్లడ్ బ్యాంక్)
20	చెవి, ముక్కు, గొంతు..
21	దంత వైద్య విభాగం
22, 23	హెచ్‌ఐవీ,వీసీటీసీ,పీపీటీసీటీ
24	ఆరోగ్యసేవలు
25	డయాలసిస్
26	సిటీస్కాన్, అత్యవసర చికిత్స
27	ట్రామాకేర్

సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు

క్యాజువాలిటీ---08942-279161

రిమ్స్ డైరెక్టర్---9701501067

సూపరింటిండెంట్--9701501070

మెడికల్ ఆఫీసర్--9440550558

శ్రీకాకుళం రైతుబజార్ ధరలు

కూరగాయలు	ధర(కిలో) రూ...
టమోటా	రూ. 46
వంకాయలు	రూ. 33
బెండకాయలు	రూ. 32
పచ్చిమిర్చి	రూ. 55-62
బీరకాయలు	రూ. 26
కాలీఫ్లవర్	రూ. 35
క్యాబేజీ	రూ. 16
క్యారెట్	రూ. 26
దొండకాయలు	రూ. 30
పచ్చిబఠాని	రూ. 32
ఉల్లి	రూ. 20
బీన్స్	రూ. 45
గోరుచిక్కుడు	రూ. 34
బంగాళదుంప	రూ. 12
అరటికాయ(జత)	రూ. 18
చామదుంప	రావడం లేదు
ఎర్రదుంపలు	రూ. 25
నూల్‌కోల్ దుంప	రూ.20
బీట్‌రూట్	రూ. 29
కీర	రూ. 25
ఫ్రెంచ్‌బీన్స్	రూ. 40
కాకరకాయలు	రూ. 28
అల్లం	రూ. 50
గోల్కొండచిక్కుల్లు	రూ. 34-42
స్వీట్‌పొ	రూ. 16
వెల్లులి	రూ. 55
క్యాప్సీకం	రూ. 50

కృష్ణాష్టమి వేడుకలు

పాత శ్రీకాకుళం: వరుసగా నాలుగు రోజులు సెలవుల కారణంగా నగరంలోని పాఠశాలల్లో ముందుగానే కృష్ణాష్టమి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జోయ్‌కిడ్స్ పాఠశాలలో ప్రిన్సిపాల్ రేచల్ ఆధ్వర్యంలో బాలబాలికల వేషధారణలు ఆకట్టుకున్నాయి. రాధాకృష్ణుల వేషధారణలో చిన్నారులు అలరించారు. కృష్ణాష్టమి విశిష్టతను ఉపాధ్యాయులు వివరించారు.



రాధాకృష్ణుల వేషధారణలో చిన్నారులు



నృత్యాలు చేస్తున్న దృశ్యం

ఈఎస్ఐ ఆస్పత్రిని నిర్మించండి

(శ్రీకాకుళం సిటీ)

జిల్లాలో ఈఎస్ఐ వందపడకల ఆసుపత్రిని నిర్మించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.గోవిందరావు డిమాండ్ చేశారు. ఆసుపత్రిని నిర్మించాలంటూ శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం నిర్వహించారు. కలెక్టరేట్‌లోనికి దూసుకెళ్లేందుకు ప్రయత్నించగా ఒకటో పట్టణ పోలీసులు అడ్డుకున్నారు. సీఐటీయూ నేతలను అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా గోవిందరావు మాట్లాడుతూ జిల్లాలో దాదాపు రెండు లక్షలమంది కార్మికులు ఉన్నా ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటుచేయకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ఈ ఆందోళనలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు తేజేశ్వరరావు, డివిజన్ కార్యదర్శి ఎన్వీ రమణ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

నగరపాలక సంస్థ అధికారుల ఫోన్ నంబర్లు

పీఏ శోభ ఐఏఎస్ - కమిషనర్ - 9849905787

నూకేశ్వరరావు - సహాయ కమిషనర్ -9849908099

డి.భాస్కరరావు- ప్రజారోగ్య అధికారి -9849906972

జి.వేంకటేశ్వరరావు - ఇంజనీర్ -9000902338

దేవకుమార్ - సహాయ సిటీ ప్లానర్ - 9949996081

కిశోర్‌కుమార్- ప్రణాళిక అధికారి - 8897626999

జగన్మోహనరావు-మెప్మా అధికారి - 9701385743

అప్పలస్వామి - పట్టణ సర్వేయర్ -9849906967

డి.గణేష్- శానిటరీ ఇన్‌స్పెక్టర్ - 8919228847

ప్రకాష్- శానిటరీ ఇన్‌స్పెక్టర్ - 9849908966

14న వీహెచ్‌పీ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు

డేఅండ్‌నైట్ జంక్షన్: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నగరంలో ఈ నెల 14 కృష్ణాష్టమి వేడుకలు నిర్వహిస్తున్న వీహెచ్‌పీ జిల్లా శాఖ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని ఎల్‌బీఎస్ కాలనీలోగల కృష్ణం వందే జగద్గురుమ్ మందిరంలో ఉదయం ఆరు గంటల నుంచి వేడుకలు ప్రారంభమవుతాయని చెప్పారు. ప్రత్యేక పూజలతో పాటు సంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. బాలబాలికలకు వేషధారణ గావించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో భాగంగా విశ్వహిందూపరిషత్ లక్ష్యసాధనపై రాష్ట్ర కార్యదర్శి సందేశం ఉంటుందని చెప్పారు. మధ్యాహ్నం 3 గంటలనుంచి వేదిక నుంచి శోభాయాత్ర నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.









విరిగిన తలుపులు..దయనీయ స్థితిలో మురుగుదొడ్లు..ఎప్పుడు జారిపడుతుందో తెలియని వాష్ బేసిన్

కళా విహీనం..
బాపూజీ కళా మందిరం

ఆంధ్రజ్యోతి ఫోకస్



విరిగిపోయిన కుర్చీలు



కళా విహీనంగా కనిపిస్తున్న ప్రాంగణం



వర్షానికి చిమ్ముతున్న గోడలు

(డేఅండ్‌నైట్ జంక్షన్)

కళా, సాంస్కృతిక ప్రదర్శనలకు, సమాజహిత కార్యక్రమాలకు చక్కటి వేదిక నగరంలోని బాపూజీ కళామందిరం. సభలు, సదస్సులు, శతావధానాలకు, అధికార,అనాధికార కార్యక్రమాలు అంటే ముందుగా గుర్తొచ్చేది ఈ మందిరమే. ఒక విధంగా చెప్పాలంటే కళాకారులకు ఇదొక నిలయంగా మారింది. రాష్ట్రస్థాయి కళాకారులకు సిక్కోలు అంటే ముందుగా గుర్తొచ్చేది బాపూజీ కళామందిరే. అటువంటి చరిత్ర కలిగిన మందిరం ప్రస్తుతం దీనావస్థలో ఉంది. విరిగిన కుర్చీలు, స్టాండ్లు, దుమ్ముపట్టిన ఫ్యాన్‌లు, విరిగిన తలుపులు, పెచ్చులూడిన శ్లాబ్‌లు, అధ్వానస్థితిలో మరుగుదొడ్లు దర్శనమిస్తున్నాయి. కుర్చీలు ఉండి కూడా కూర్చోలేని పరిస్థితి. పరిసరాలు పుట్టలమయం, కానరాని స్వచ్ఛభారత్ ఇదీ బాపూజీ కళామందిర్ ప్రస్తుత వైభవం.. నగరం నడిబొడ్డున ఉన్న ఈ వేదికపైన ఎంతో మంది పురప్రముఖులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, కళాకారులు, పండిత ప్రముఖులు సన్మానాలందుకున్నారు. సన్మానగ్రహీతలు, అధికారులు, ప్రజాప్రతినిధులు ఆధునీకరించి ఏసీ సౌకర్యం కల్పిస్తామని, అత్యంత సుందరంగా తీర్చిదిద్దుతామని ఎన్నోసార్లు హామీ ఇచ్చారు. కానీ చప్పట్ల హోరులో మరిచిపోయినట్లు ఉన్నారు. ఇప్పటికైనా యంత్రాంగం కళ్లు తెరిచి ఆధునీకరిస్తే నగరానికే తలమానికం అవుతుందనడంలో ఎటువంటి అతిశయోక్తిలేదు..

ఓటమి భయంతోనే జగన్ అనుచిత వ్యాఖ్యలు

శ్రీకాకుళం సిటీ:నంద్యాలలో ఓటమి భయంతోనే జగన్ సీఎం చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని టీడీపీ నగరఅధ్యక్షుడు మాదారపు వెంకటేష్ ఆరోపించారు. శుక్రవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నంద్యాల ఉప ఎన్నికలో వైసీపీకి ఘోర పరాజయం తప్పదని తెలుసుకున్న జగన్ వివేకం కోల్పోయి మాట్లాడుతూ రాక్షసత్వాన్ని ప్రదర్శిస్తున్నారన్నారు. ఇటువంటి భావజాలమున్న నాయకులకు బుద్ధి చెప్పడానికి ప్రజలు తమ ఓటు ద్వారా సిద్ధంగా ఉన్నారన్నారు. చంద్రబాబుపై ప్రజలకు అపారమైన నమ్మకం, విశ్వాసం ఉన్నాయన్నారు. రానున్న సాధారణ ఎన్నికల్లో కూడా వైసీపీ చిత్తుగా ఓడుతుందని ఆయన స్పష్టంచేశారు.

బూత్ కమిటీలతో టీడీపీ పటిష్టం

శ్రీకాకుళం సిటీ: తెలుగుదేశం పార్టీ బలంగా ఉండడానికి బూత్ కమిటీలు సంస్థాగతంగా చక్కగా పనిచేయడమే కారణమని నగర తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మాదారపు వెంకటేష్ పేర్కొన్నారు. నగరంలోని 15వ డివిజన్‌లో డివిజన్ అధ్యక్షుడు ఇప్పిలి భారతి, రాష్ట్ర హస్తకళల డైరెక్టర్ ఇప్పిలి తిరుమలరావు ఆధ్వర్యంలో జరిగిన బూత్ కమిటీ సమావేశం నిర్వహించారు. చంద్రబాబు, లోకేష్ ఆధ్వర్యంలో పార్టీకి పూర్వవైభవం సంతరించుకుందన్నారు. శ్రీకాకుళం నియోజకవర్గంలో ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి కొట్లరూపాయలతో అవినీతి రహిత అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. బాబాసాహెబ్, ఇల్లా ఆనందరావు, హేమంత్‌కుమార్ పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకం

● న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శ్యామలాదేవి



సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్యామలాదేవి

శ్రీకాకుళం లీగల్ : దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకమని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.శ్యామలాదేవి అన్నారు. స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆమె మాట్లాడుతూ దేశప్రగతిలో యువత భాగస్వామ్యం ఎంతో కీలకమైనదన్నారు. యువత చెడు అలవాట్లకు బానిసగా మారి తమ భవిష్యత్‌ను నాశనం చేసుకొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.



హాజరైన విద్యార్థులు

మత్తుపదార్థాల వాడుక నిషేధిత చట్టాన్ని అనుసరించి మత్తు పదార్థాలను వాడినా, వాటిని కలిగి ఉన్నా నేరమన్నారు. మంచి అలవాట్లను నేర్చుకొని యువత దేశప్రగతిలో భాగస్వామ్యం కావాలని ఆమె హితవు పలికారు. అలాగే కళాశాలలో స్నేహపూరిత వాతావరణాన్ని ఏర్పరచాలన్నారు. తోటి విద్యార్థులను శారీరకంగా లేదా మానసికంగా ఎటువంటి ఇబ్బందులకు గురిచేసినా నేరమన్నారు. విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడితే వారికి శిక్ష తప్పదని ఆమె తెలిపారు. తెలియక చేసినా... తెలిసి చేసినా నేరానికి శిక్ష తప్పదన్న విషయాన్ని విద్యార్థులు గుర్తించాలన్నారు. చట్టాలపై అవగాహన తప్పనిసరిగా ఉండాలన్నారు. అనంతరం బాల్యవివాహాల నిరోధ చట్టం, వివాహాల నమోదు చట్టం, ఉచితన్యాయ సహాయం తదితర వాటిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆ తర్వాత నిర్వహించిన ప్రశ్నావళిలో సరైన సమాధానాలు చెప్పిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీరాములు, వైస్ ప్రిన్సిపాల్ జ్యోతీఫెడరిక్, న్యాయవాది ఇందిరాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాగేశ్వరరావు

నైతిక విలువలు పెంపొందించుకోవాలి

పాతశ్రీకాకుళం: నైతిక విలువలు పెంపొందించుకోవాలని విద్యార్థులకు యోగా గురువు బి.నాగేశ్వరరావు సూచించారు. శుక్రవారం నగరంలో బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో శివసుందర్ భవన్‌లో సాయంత్రం యువత- మీచేతుల్లోనే భవిత అనే అంశంపై అవగాహన కల్పించారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ యువత ఆదర్శంగా ఆలోచించాలని సూచించారు. మహనీయుల అడుగుజాడల్లో నడవాలన్నారు. కార్యక్రమంలో సుమారు 150 మంది యువత పాల్గొన్నారు.



హాజరైన యువకులు

మాజీ సైనికులు భూముల వివరాలు అందించండి

శ్రీకాకుళం సిటీ: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉత్తర్వులు జీవో ఎంఎస్ నంబర్ 743 ప్రకారం మాజీ సైనికులు 5ఎకరాలు మెట్టు లేదా 2.50 పల్లం ప్రభుత్వ బంజరుభూమి పొందుడానికి అర్హులని జిల్లా సైనిక సంక్షేమాధికారి జి.సత్యానందం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పై ఉత్తర్వులు ప్రకారం జిల్లాలో మాజీసైనికులు ఎవరు ప్రభుత్వం నుంచి భూమిని పొందారో వారు దానికి సంబంధించిన పట్టాదారు పాస్‌పుస్తకం....వాటి వివరాలు జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయం నందు సెప్టెంబర్ 15వ తేదీలోగా అందజేయాలన్నారు. భూమిని పొందిన తరువాత మాజీ సైనికులు చనిపోయిన పక్షంలో అతడి భార్య, వారసులు ఈ భూమిని సాగుచేసుకొంటున్నట్లయితే వారి వివరాలు కార్యాలయం నందు తెలిజేయాలని సత్యానందం ప్రకటనలో పేర్కొన్నారు.

16న రుణాల మంజూరుకు ఇంటర్వ్యూలు

శ్రీకాకుళం సిటీ: శ్రీకాకుళం నగర పాలక సంస్థ పరిధిలో 2017-18 సంవత్సరానికి సంబంధించి ఎస్సీ, బీసీ, కాపు, మైనార్టీ,క్రిస్టియన్ కార్పొరేషన్‌ల ద్వారా రుణాలు పొందేందుకు ఓబీఎంఎంఎస్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు బ్యాంకర్లు, స్క్రీనింగ్ కమిటీ ద్వారా నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని కమిషనర్ పీఏ శోభ శుక్రవారం తెలిపారు. ఈ నెల 16న శ్రీకాకుళం బాపూజీ కళామందిర్‌లో ఉదయం 10 గంటలకు ఈ ఇంటర్వ్యూలు ప్రారంభమవుతాయన్నారు. లబ్ధిదారులంతా వారి ఆన్‌లైన్ దరఖాస్తులతో పాటు రేషన్ కార్డు, ఆధార్‌కార్డు, కుల ధ్రువీకరణ ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరుకావాలని సూచించారు.

నగరంలో శ్రావణ శుక్రవారం పూజలు


పుష్పాలంకరణలో సంతోషిమాత

పాత శ్రీకాకుళం: శ్రీకాకుళం నగరంలో శుక్రవారం శ్రావణ శుక్రవారం పూజలు ఘనంగా నిర్వహించారు. విశాఖ బి కాలనీలో ఉన్న షిర్డీసాయిబాబా మందిరంలో 108 మందిచే పారాయణం నిర్వహించారు. శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో బాబాకు క్షీరాభిషేక పూజలు, కాగడా హారతి నిర్వహించారు. నానుబాలవీధిలో దుర్గాదేవిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. పాతశ్రీకాకుళంలో ఉన్న సంతోషిమాత ఆలయంలో ఆలయ అర్చకులు మోదుకూరి కిరణ్‌శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివబాలాజీ అలయంలో అర్చకులు సంతోష్‌శర్మ ఆధ్వర్యంలో.... చిన్నబజార్‌లో ఉన్న కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. చిన్నబరాటం వీధిలో ఉన్న నీలమ్మతల్లి ఆలయంలో, ముత్యాలమ్మ ఆలయంలో నిర్వహించిన పూజా కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


ప్రత్యేక అలంకరణలో దుర్గామాత


శివబాలాజీ ఆలయంలో భక్తుల సందడి


ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

రామచంద్రాపురం (గార): రామచంద్రాపురం పంచాయతీ అంబటివానిపేటలో శుక్రవారం రైతుసేవలో రెవెన్యూశాఖ గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఎ.సింహాచలం మాట్లాడుతూ రైతులకు సంబంధించిన భూముల సమస్యలు ఉంటే వాటిని పరిష్కరించేందుకే ఈ గ్రామసభలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్ అంబటి అంబిక, ఎంపీటీసీ ప్రతినిధి అంబటి చక్రధరరావు, అంబటి చిన్నబాబు, ఆర్ఐ సుజాత, వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

గారలో స్వచ్ఛభారత్ మానవహారం

గార: గారలో శుక్రవారం స్వచ్ఛభారత్ మానవహారం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ ర్యాలీ చేపట్టిన...అనంతరం మూడురోడ్ల కూడలివద్ద మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ ప్రతినిధి గుండ భాస్కరరావు, ఎంపీడీవో పక్కి కాంతారావు మాట్లాడుతూ పల్లెల్లో పారిశుధ్యం మెరుగుపరచడం ద్వారా స్వచ్ఛభారత్ లక్ష్యాన్ని సాధించవచ్చని పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ స్వచ్ఛభారత్ యజ్ఞంలో భాగస్వాములు కావాలని కోరారు.కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు జల్లు రాజీవ్, మండల ప్రత్యేకాధికారి పీజేఎస్ఎన్ పట్నాయక్, ఏపీవో నారాయణరావు, ఏపీఎం జి.శ్రీధర్ , జడ్పీ హైస్కూల్ హెడ్‌మాస్టర్ ఎస్.దాలయ్య, ఎంఈవో ఎం.భాస్కరరావు, ఐసీడీఎస్, మండలపరిషత్ కార్యాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


పోస్టల్ అకౌంట్ బుక్‌లను అందజేస్తున్న దృశ్యం

గార మండల అధికారుల ఫోన్ నంబర్లు

ఎ.సింహాచలం	తహసీల్దారు	8499886055
పక్కి కాంతారావు	ఎంపీడీవో	8790007906
బి.గణేష్	సబ్ ఇన్‌స్పెక్టర్	9440795821
పైల నవీన్	వ్యవసాయాధికారి	8886612700
రామ్మోహనరావు	ఈవోపీఆర్డీ	8978914770
జి.శ్రీధర్	వెలుగు ఏపీఎం	8008803885
సీహెచ్ నారాయణరావు	ఏపీవో	8790007882
ఎం.భాస్కరరావు	ఎంఈవో	9502599890
ఫణీంద్రకుమార్	ట్రాన్స్‌కో ఏఈ	9440812431
శంకరరావు	హౌసింగ్ ఏఈ	7093930244
పి.గోవిందరావు	మండల ఇంజనీర్	9441478870
సీహెచ్ గోవిందరావు	ఆర్అండ్‌బీ ఏఈ	9440416921
కె.నారాయణమూర్తి	పశు వైద్యాధికారి	9985109363
డాక్టర్ పి.జగదీష్	ఆయుష్ వైద్యులు	9493764553

సుకన్య సమృద్ధి పథకంపై అవగాహన

వాడపాలెం (గార): మండలం కె.మత్స్యలేశం (పోర్టు కళింగపట్నం) పరిధిలోగల ప్రాథమికోన్నత పాఠశాలలో బేటీ బచావో... బేటీపడావో.. (ఆడపిల్లలను రక్షించుకుందాం.. ఆడపిల్లలను చదివిద్దాం...) అనే నినాదంలో భాగంగా సుకన్య సమృద్ధి పథకంలో భాగంగా అవగాహనా కార్యక్రమం నిర్వహించారు.పోస్టు ఖాతాలను తెరిపించి నెలకు ఒక్కొక్కరికి రూ. వెయ్యితో అకౌంట్లను ప్రారంభించారు. పంచాయతీ దత్తతదారులు కెప్టెన్ మైలపిల్లి జనార్దనరావు, సర్పంచ్ లక్ష్మీజనార్దనరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా పోస్టల్ సూపరింటిండెంట్ ఉరిటి నాగాదిత్య కుమార్, కళింగపట్నం పోస్ట్‌మాస్టర్ వాసుదేవ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాంబమూర్తి, మైలపిల్లి రామారావు, గుంటు రామచంద్రరావు, గంగాడ మాధవరావు, సూరాడ గురుమూర్తి, వాసు, డిల్లీరావుతోపాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యక్తిగత కక్షతోనే పంచాయతీ కార్యదర్శిపై సస్పెన్షన్ వేటు

నరసన్నపేట: మాకివలస పంచాయతీ క్లస్టర్ కార్యదర్శి సూరప్పడుపై వ్యక్తిగత కక్ష తోనే డీపీవో సస్పెండ్ చేశారని మాకివలస క్లస్టర్ పరిధిలోగల సర్పంచ్‌లు యాళ్ల వేణు గోపాలరావు, ఎం.మహాలక్ష్మి, రువ్వ కృష్ణవేణిలు ఆరోపించారు. మండల పరిషత్ కార్యా లయంలో శుక్రవారం విలేఖర్ల సమావేశం నిర్వహించారు. కిల్లాం, మాకివలస, దేవాది పంచాయతీల్లో సంపూర్ణ పారిశుధ్య కార్య క్రమాలు చేపట్టిన పంచాయతీ కార్యదర్శి సూరప్పడును వేరొక ఉద్దేశ్యంతోనే డీపీవో కోటేశ్వరరావు సస్పెండ్ చేశారన్నారు. సూరప్పడును వెంటనే విధుల్లోకి తీసుకోకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమం లో కంబకాయి సర్పంచ్ పోగోటి ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

దళితుల సమస్యలు పరిష్కరించండి

పోలాకి: దళితులు సామాజికంగా ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.గణేష్, మండల స్థాయి ప్రతినిధులు గన్నయ్య, రాజారావులు డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో వారు శుక్రవారం ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఉరజాంలో దళితుల కోసం ఏర్పాటు చేసిన రహదారులు, శ్మశానవాటికలు ఆక్రమణ చేస్తున్నారన్నారు. ఆక్రమణదారులను ప్రశ్నిస్తే మరిన్ని దుర్భాషలాడుతున్నారని వారి ఆగడాలను అధికారులే అరికట్టాలని వారు కోరారు. వారం రోజుల్లోగా అధికారులు స్పందించకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయ ఏఎస్‌వో బుచ్చిరాజుకు వినతి పత్రం సమర్పించారు. వారి వెంట జె.గన్నయ్య, కె.నర్ససింహ, డి.ప్రసాదరావు, రాజయ్య నరసింహులు, గోవిందరావు, సుబ్బారావు, కొండలరావు, ఇల్లయ్య తదితరులు పాల్గొన్నారు.


ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న అధికారులు, కమిటీ సభ్యులు

రుణ ఎంపికకు ఇంటర్వ్యూలు

గార: బీసీ కార్పొరేషన్, ఇతర బీసీ ఫెడరేషన్‌ల ద్వారా రుణాలు పొందేందుకు ఇటీవల దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులకు శుక్రవారం మండలపరిషత్ కార్యాలయం వద్ద ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండలానికి 168 యూనిట్లు మంజూరుకాగా... 1,221 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని ఎంపీడీవో పి.కాంతారావు తెలిపారు. ఈ ఇంటర్వ్యూలను మండలప్రత్యేకాధికారి పీజేఎస్ఎన్ పట్నాయక్, ఎంపీడీవో కాంతారావు, కమిటీ సభ్యులు గోర సురేష్, కోరాడ వెంకటరావు నిర్వహించారు. సంబంధిత బ్యాంక్ మేనేజర్లు, సిబ్బంది, కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

చిన్నారులకు ఎంఆర్ వ్యాక్సిన్ తప్పనిసరి

వాడపాలెం (గార): కె.మత్స్యలేశం (పోర్టు కళింగపట్నం) పంచాయతీ వాడపాలేం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, కళింగపట్నం పంచాయతీ లిటిల్‌స్టార్ స్కూల్ విద్యార్థులకు శుక్రవారం కళింగపట్నం పీహెచ్‌సీ వైద్యులు డా. జి.వెంకటరావు పర్యవేక్షణలో ఎంఆర్ వ్యాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 9 నెలల వయసు నుంచి 15 సంవత్సరాల్లోపు ఉన్న విద్యార్థులకు ఈ వ్యాక్సిన్‌ను తప్పనిసరిగా వేయించాలని తల్లిదండ్రులకు సూచించారు.


చిన్నారులకు వ్యాక్సిన్ వేస్తున్న సిబ్బంది

'ప్రభుత్వ సెలవులు పాటించని పాఠశాలలపై చర్యలు'

కోటబొమ్మాళి: పాఠశాలలకు ప్రభుత్వం ప్రకటించిన సెలవులు పాటించకపోతే ఆయా పాఠశాలలపై చర్యలు తీసుకుంటామని ఎంఈవో నారాయణరావు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలు ఉల్లంఘించి సెలవు రోజుల్లో కూడా పాఠశాలలు తెరిచినట్లయితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇప్పటికే కొన్ని పాఠశాలలు ప్రభుత్వ ఉత్తర్వులు పాటించనందున ప్రభుత్వం తాజాగా ఈ ఉత్తర్వులు జారీచేసిందని తెలిపారు. ఇకనుంచి సెలవు రోజుల్లో కూడా అన్ని పాఠశాలలపై నిఘా పెడతామని పేర్కొన్నారు.

టెక్కలి ఆర్టీసీ కాంప్లెక్స్ ఆధునికీకరణ దిశగా అడుగులు

● మోడల్ బస్టాండ్‌గా తయారుచేసేందుకు సన్నాహాలు ● మంత్రి ఆదేశంతో ప్రతిపాదనలు

టెక్కలి: రవాణా శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న టెక్కలిలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ఆధునికీకరణకు అధికారులు చర్యలు చేపట్టారు. జిల్లాలోనే మోడల్ ఆర్టీసీ కాంప్లెక్స్‌గా తయారుచేసేందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. కాంప్లెక్స్ అభివృద్ధికి అవసరమైన నిధులు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నానని మంత్రి ప్రకటించడంతో కాంప్లెక్స్ ఆధునికీకరణ పనులకు అధికార యంత్రాంగం సమాయత్తమైంది. జూన్ 27న టెక్కలి ఆర్టీసీ కాంప్లెక్స్‌ను మంత్రి ఆర్టీసీ ఉన్నతాధికారులతో పరిశీలించి దిశ నిర్దేశం చారు. ఆర్టీసీ కాంప్లెక్స్‌కు ప్రత్యేక శోభ తీసుకురావాలని మంత్రి ఆదేశించారు. ప్రస్తుతం ఉన్న భవనం స్థానంలో వినూత్న తరహాలో కాంప్లెక్స్, షాపింగ్ కాంప్లెక్స్ వంటివి ఏర్పాటుచేయాలని, ఆదిశగా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. మంత్రి ఆదేశించిన నేపథ్యంలో చిన్నపాటి వర్షపు జల్లులకు కూడా జలమయమై అధ్వానంగా ఉండే కాంప్లెక్స్‌లో యుద్ధ ప్రాతిపదికన పనులు జరిపిస్తున్నారు. మట్టిని తెచ్చి గోతులను నింపే పనిని ఆర్టీసీ ఇంజినీరింగ్ అధికారులు జరిపిస్తున్నారు. త్వరలో కాంప్లెక్స్ ఆధునికీకరణ పనులకు మంత్రి అచ్చెన్నాయుడు భూమిపూజ చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కాంప్లెక్స్ ఆవరణలో చకచకా అభివృద్ధి పనులు జరుగుతుండడంతో స్థానికులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.


నాడు వర్షపు నీటితో ఇలా...


నేడు ఇలా...

'సేంద్రియ ఎరువులపై దృష్టిపెట్టాలి'

లక్ష్మీపురం(సంతబొమ్మాళి): రైతులు సేంద్రియ ఎరువులపై దృష్టి పెట్టాలని రీసోర్స్‌పర్సన్ బి.జగన్నాథరావు అన్నారు. శుక్రవారం ఆయన సంతబొమ్మాళి పంచాయతీ లక్ష్మీపురంలో రైతులకు శిక్షణ ఇచ్చారు. రసాయనిక ఎరువులపై ఎక్కువ ఆధారపడుతుండడంతో పెట్టుబడులు పెరిగిపోతున్నాయన్నారు. అదే రైతులకు అందుబాటులో ఉండే సేంద్రియ ఎరువులను సొంతంగా తయారుచేసుకొని వాడితే మంచి దిగుబడి లభిస్తుందని చెప్పారు. అందుకోసం ఎంపికచేసిన గ్రామాల్లో సేంద్రియ ఎరువుల వాడకంపై రైతులకు శిక్షణ ఇస్తున్నామన్నారు మొదటగా లక్ష్మీపురంలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి సత్యన్నారాయణ పాల్గొన్నారు.


రైతులకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

దిమ్మిడిజోలలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు


సామూహిక వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న భక్తులు

దిమ్మిడిజోల(నందిగాం): దిమ్మిడిజోలలో శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండల ధర్మప్రచారక్ మల్లారెడ్డి శ్రీనివాస్ భాగవతార్ నేతృత్వంలో స్థానిక రామాలయ ప్రాంగణంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కాపుతెంబూరుకు చెందిన దత్తాశ్రమ పీఠాధిపతి నిర్విశ్వానంద స్వామీజీ ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నాగమ్మ కృష్ణారావు, భక్తిమండలి సభ్యులు, డివిజనల్ సమరసత సేవా ఫౌండేషన్ కన్వీనర్ గేదెల చంద్రశేఖరరావు తదితరులు పాల్గొన్నారు.

'మహిళల్లో చైతన్యం అవశ్యం'



గొప్పిలిలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

గొప్పిలి(మెళియాపుట్టి): మరుగుదొడ్ల నిర్మాణంపై మహిళల్లో చైతన్యం రావాలని ఎంపీడీవో ఎన్.రమేష్‌నాయుడు అన్నారు. శుక్రవారం ఆయన గొప్పిలిలో బహిరంగ మలవిసర్జన నుంచి విముక్తి వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన ర్యాలీనుద్దేశించి మాట్లాడారు. ప్రభుత్వం మరుగుదొడ్ల నిర్మాణానికి అవకాశం ఇచ్చిందని, దీన్ని వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఇంట్లో మరుగుదొడ్డి ఉంటే కుటుంబ సభ్యులంతా ఆరోగ్యకరంగా ఉంటారని చెప్పారు. నేలబొంతు, జాడుపల్లిలో ఈవోపీఆర్‌డీ ప్రసాద్‌పండా ర్యాలీలు నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచ్‌లు మాలతి రుషికేంద్రమణి, జయరాం, ప్రసాదరావు, కార్యదర్శులు డిల్లేశ్వరరావు, రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

హిరమండలం: ఈ ఆర్థిక సంవత్సరంలో వివిధ కార్పొరేషన్ల ద్వారా రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ కాపులకు 40, బీసీలకు 106, ఎస్సీలకు 42, ఎస్టీలకు 20 యూనిట్లు మంజూరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు త్వరితగతిన పరిష్కరించుకోవాలి

● ఆర్డీవో వెంకటేశ్వరరావు

నందిగాం: రెవెన్యూపరంగా రైతులకు ఎదురవుతున్న సమస్యల్ని త్వరితగతిన పరిష్కరించుకోవాలని ఆర్డీవో ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం మండలంలోని నందిగాం, పెద్దగురువూరు, చిన్నగురువూరు, చిన్నతామరాపల్లి, పోతులూరు గ్రామాల్లో తహసీల్దార్ ఎస్‌వీ నాగేశ్వరరావు, ఉప తహసీల్దార్ వి.లక్ష్మీనారాయణ, ఆర్ఐ పి.కామేశ్వరరావు బృందాలుగా సభలు నిర్వహించారు. నందిగాంలో ఆర్డీవో మాట్లాడుతూ ప్రతి రైతు 1బీ, అడంగల్‌ను తమవద్దనున్న పట్టాదారు పాసుపుస్తకంతో పరిశీలించుకొని తేడా ఉంటే రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకువస్తే వాటిని సకాలంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటారని చెప్పారు. రైతుకు ఎదురవుతున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చేందుకు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు అడంగల్, పట్టాదారు పాసుపుస్తకాల మధ్య ఉన్న తేడాలపై దరఖాస్తు రూపేణా అందించారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ జోగారావు, ఆర్ఐ జగన్మోహనరావు, నందిగాం ఎంపీటీసీ-2 ఎన్.శ్రీరామ్మూర్తి, జె.జయరాం, వీఆర్‌వోలు రామ్‌జీ, కె.నగేశ్వరరావు, సురేష్, ఎం.మురళీరావు, చంద్రశేఖర్, సర్పంచ్ టి.నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆర్డీవో వెంకటేశ్వరరావు

'ప్రజల కళ్లల్లో ఆనందం'

మెళియాపుట్టి: వైసీపీ నుంచి టీడీపీలోకి వెళ్లిన తరువాత నియోజకవర్గంలో అభివృద్ధి చూసి ప్రజల కళ్లల్లో ఆనందం చూస్తున్నానని ఎమ్మెల్యే వెంకటరమణమూర్తి తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేఖర్లతో మాట్లాడారు. నియోజకవర్గంలో బీటీ రోడ్ల నిర్మాణానికి ఎన్నడూ లేనివిధంగా రూ.41 కోట్లు మంజూరు చేయడం ఆనందదాయకంగా ఉందన్నారు. 30 ఏళ్లుగా రోడ్లు నిర్మించాలని విన్నవిస్తున్నా ప్రయోజనం లేకుండాపోయిందని, అది నేడు ప్రజల కలలు నెరవేరాయని చెప్పారు. మంత్రి లోకేష్ పాతపట్నం నియోజకవర్గానికి ప్రాధాన్యం ఇవ్వడం అభినందనీయమన్నారు. ప్రతి పంచాయతీ ఆదర్శంగా ఉండాలని ప్రజలను సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు అనపాన రాజశేఖరరెడ్డి, మాజీ వైస్‌ఎంపీపీ బమ్మిడి జగన్నాథం, బమ్మిడి భాస్కరరావు, లావన్న, తేజారావు, భాస్కర్‌గౌడ్, గంగారత్నం, వాకాడ మోహనరావు, కదంబాల పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేను అభినందిస్తున్న సర్పంచ్‌లు, ఎంపీటీసీలు

'బహిరంగ మలవిసర్జనను నిర్మూలించాలి'

ఎల్.ఎన్.పేట: బహిరంగ మలవిసర్జనను నిర్మూలించాలని ఎంపీడీవో సిహెచ్.మోహన్‌ప్రసాద్ అన్నారు. ఈ విషయమై ప్రజలకు అవగాహన కల్పించేందుకు శుక్రవారం మండల కేంద్రంలో అధికారులు, విద్యార్థులతో కలిసి మానవహారం నిర్వహించి మాట్లాడారు. పారిశుధ్యం మెరుగుపడాలంటే ప్రతి ఇంటా మరుగుదొడ్డి ఉండాల్సిందేనన్నారు. ఇందుకోసం సంబంధిత అధికారులకు ప్రజాప్రతినిధులు, ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కె.అప్పారావు, ఎంఈవో ఎన్.శ్రీనివాసరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వై.ప్రశాంతిరెడ్డి, ఎం.జనార్దనరావు, విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు, అధికారులు

'తపాలా సేవలను వినియోగించుకోండి'


మాట్లాడుతున్న శ్రీకర్‌బాబు

జర్జంగి(కోటబొమ్మాళి): తపాలా సేవలను సద్వినియోగం చేసుకోవాలని టెక్కలి సహాయ సూపరింటెండెంట్ ఎస్.శ్రీకర్‌బాబు కోరారు. శుక్రవారం జర్జంగిలో నిర్వహించిన తపాలా పొదుపు ఖాతాల మేళాలో మాట్లాడారు. ప్రధాన మంత్రి అటల్ పెన్షన్, సురక్ష బీమా యోజన వంటి పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నెలకు రూపాయి చొప్పున చెల్లిస్తే రూ.2 లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందని, పొదుపు ఖాతాదారులకు, మహిళలకు ఉండే వివిధ పథకాల కోసం వివరించారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ టి.చిన్నారావు, కె.రామారావు, ఎ.గురునాథరావు, సర్పంచ్ అన్నెపు తులసీబాయి తదితరులు పాల్గొన్నారు.

'కాలి బాటలు తప్పనిసరి'

దొండమానుగూడ(కొత్తూరు): పొలాల్లో కాలి బాటలు వేస్తే ఎంతో మంచిదని, దీనివల్ల అధికదిగుబడులు సాధ్యపడతాయని వ్యవసాయాధికారి భవానీశంకర్ అన్నారు. శుక్రవారం ఆయన దొండమానుగూడ, కారిగూడ గ్రామాల్లో పర్యటించి గిరిజన రైతులతో సమావేశమయ్యారు. పొలం గట్లపై కంది, చోడి, ఇతర అపరాల పంటలను పండించేందుకు ప్రభుత్వం ఉచితంగా విత్తనాలు సరఫరా చేస్తోందని చెప్పారు. వ్యవసాయాధికారుల సూచనల మేరకు తగిన మోతాదులో ఎరువులు వినియోగించి అధిక దిగుబడులు సాధించాలన్నారు. కార్యక్రమంలో సూర్యనారాయణ, సుధాకర్‌రావు, ఈశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

'మొక్కలు పెంచి ప్రకృతి సమతుల్యం కాపాడాలి'

టెక్కలి: మొక్కలను పెంచి ప్రకృతి సమతుల్యాన్ని కాపాడాల్సిన బాధ్యత విద్యార్థి లోకంపై ఉందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్.తిరుపతిరావు అన్నారు. శుక్రవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో వనం-మనం కార్యక్రమంలో భాగంగా ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రాణాధారానికి మొక్కలు దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఆర్.గోపాలరావు, ఎన్ఎస్ఎస్ పీవోలు డాక్టర్ సంపతిరావు ధర్మారావు, బి.విజయేశ్వర్, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణ సామాజిక బాధ్యత

● డీటీసీ శ్రీదేవి

కె.కొత్తూరు(టెక్కలి): ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యత వహించాలని జిల్లా రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ సిహెచ్.శ్రీదేవి అన్నారు. శుక్రవారం ఆమె కె.కొత్తూరు దరి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో ప్రైవేట్ విద్యా సంస్థల యాజమాన్య ప్రతినిధులు, డ్రైవర్లతో నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. ప్రమాదానికి డ్రైవర్ ఒక్కరే కారణం కాదని, వాహనం ఫిట్‌నెస్, తదితర అంశాలు ఉంటాయన్నారు. డ్రైవర్ లైసెన్స్ బాధ్యతను రవాణాశాఖ చూడాలని, విద్యార్థుల క్షేమంగా ఇంటికి చేరేవరకు ప్రిన్సిపాళ్ల బాధ్యత వహించాలన్నారు. విద్యార్థులు బస్సుల్లో మితిమీరిన అల్లరిచేస్తే డ్రైవర్ ఏకాగ్రత కోల్పోయే అవకాశం ఉందని, ఇది ప్రమాదానికి దారితీయవచ్చునని చెప్పారు. పాఠశాల బస్సుల్లో ఆడియో, వీడియో పరికరాలు వినియోగించకుండా తనిఖీలు నిర్వహించాలని ఇందన శకట తనిఖీ అధికారులకు ఆదేశించారు. స్కూల్ బస్సు డ్రైవర్లకు, ఇతర వాహనాల డ్రైవర్లకు చాలా తేడా ఉందని, స్కూల్‌బస్సు డ్రైవర్లకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఆయా యాజమాన్యాలపై ఉందన్నారు. ప్రమాదాల మరణాల్లో శ్రీకాకుళం జిల్లా రాష్ట్రంలో మొదటి స్థానంలో ఉందని తెలిపారు. ముఖ్యమంత్రి ప్రమాదాలకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఆటోల్లో నలుగురు కంటే ఎక్కువ ప్రయాణం చేయకుండా చర్యలు తీసుకోవాలని, ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణనష్టం జరగకుండా ఉండేందుకు ప్రాథమిక చికిత్స నేర్చుకోవాలని డ్రైవర్లకు సూచించారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌కు చెందిన 'కాల్ అంబులెన్స్' ఆధ్వర్యంలో క్లైంట్ రిలేషన్ షిప్ మేనేజర్ మామిడూరు హరిప్రియ వివిధ ప్రైవేట్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, యాజమాన్యాలు, డ్రైవర్లకు ప్రథమ చికిత్సపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో టెక్కలి, పలాస వాహన తనిఖీ అధికారులు ఎ.వి.రమణ, కె.వి.ప్రకాష్, డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు, డీన్ ప్లానింగ్ అండ్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ డి.విష్ణుమూర్తి, వాకాడ భుజంగరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రమాదాల నివారణ అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీటీసీ శ్రీదేవి

'శౌచాలయాలతోనే స్వచ్ఛ భారత్ సాధ్యం'


టెక్కలిలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

టెక్కలి: బహిరంగ మలవిసర్జన రహిత ప్రాంతాలుగా తీర్చిదిద్దడమే మన ముందున్న కర్తవ్యమని మండల పరిషత్ ఉపాధ్యక్షుడు హనుమంతు రామకృష్ణ అన్నారు. బహిరంగ మలవిసర్జన విమోచన వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం టెక్కలిలో మానవహారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది చివరి నాటికి మండలంలో శతశాతం వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం జరిపేదిశగా ప్రతి ఒక్కరు కృషిచేయాలని కోరారు. స్వచ్ఛభారత్ సాధ్యపడాలంటే ప్రతి ఇంటికి వ్యక్తిగత మరుగుదొడ్డి అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ ఎస్.హరిహరరావు, మండల పరిషత్ సిబ్బంది, కార్యదర్శులు గనియా విష్ణు, శేఖర్, రవి, సోమేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణ శుక్రవారం పూజలు


రద్దీగా ఉన్న సంతోషిమాత ఆలయం

టెక్కలి: శ్రావణ శుక్రవారం సందర్భంగా స్థానిక సంతోషిమాత ఆలయం భక్తులతో కిక్కిరిసింది. అర్చకులు మహిళలతో కుంకుమ పూజలు చేయించారు. దీంతో ఆలయ ప్రాంగణాల్లో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. దేవాదాయ శాఖ అధికారులు భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు. అనంతరం తీర్థప్రసాదాలను అందించారు. శ్రావణమాసం మూడో శుక్రవారం కావడంతో మహిళలు పెద్దఎత్తున ఈ పూజల్లో పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే...


రైతులకు 1బి పంపిణీ చేస్తున్న దృశ్యం

కోటపాడు(సంతబొమ్మాళి): రైతుల భూ సమస్యలు పరిష్కారానికి రైతు సేవలో రెవెన్యూ శాఖ చక్కటి అవకాశమని తహసీల్దార్ బి.రామారావు అన్నారు. శుక్రవారం ఆయన కోటపాడులో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాని భూ సమస్యలు ఈ కార్యక్రమంలో పరిష్కరిస్తున్నామని చెప్పారు. రైతులు పాస్‌పుస్తకాలు, టైటిల్‌డీడ్, 1బీ, అడంగల్‌కు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చాట్ల అప్పలరాజు, వీఆర్వోలు వెంకటరమణ, నాగరాజు, కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పాముకాటుతో మహిళకు అస్వస్థత

పాలవలస(నందిగాం): పాము కాటువేయడంతో నరేంద్రపురం పంచాయతీ పరిధి పాలవలస గ్రామానికి చెందిన పెంట్ల సోయమ్మ అస్వస్థతకు గురయ్యింది. ఈమె శుక్రవారం ఉదయం పనుల్లో భాగంగా బయటకు వెళ్లగా తోటలో పాము కాటువేసింది. దీంతో కుటుంబసభ్యులు నందిగాం 108 వాహనంలో సోయమ్మను చికిత్స నిమిత్తం టెక్కలి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈఎంటీ శ్రీనివాసరావు సపర్యలు చేశారు. ప్రస్తుతం ఈమె ఆసుపత్రిలో కోలుకుంటోంది.

'పశుగ్రాస క్షేత్రాల లక్ష్యాలు పూర్తిచేయండి'

టెక్కలి: ఊరూరా పశుగ్రాస క్షేత్రాల నిర్దేశించిన లక్ష్యాలు పూర్తిచేయాలని, పంచాయతీకి ఐదు ఎకరాలను ఇందుకోసం గుర్తించాల్సిన బాధ్యత పశు వైద్యులదేనని పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకుడు డాక్టర్ మంచు కరుణాకర్ చెప్పారు. శుక్రవారం ఆయన టెక్కలిలో డివిజన్ స్థాయి పశు వైద్యులు, సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఏడాదికి ఎకరాకు రూ.18 వేలు లీజ్‌గా చెల్లిస్తామని, ఏకవార్షికానికి రూ.15 వేలు, బహువార్షికానికి రూ.70 వేలు చొప్పున ఉపాధి హామీ పథకం ద్వారా ఇవ్వనున్నట్లు తెలిపారు. సెక్స్‌డ్ సెమెన్ డోస్‌లు జర్సీ 200, హెచ్ఎఫ్ఎక్స్ 40 డోసులు సిద్ధంగా ఉన్నాయని, అవసరమైన వారు పశు వైద్యాధికారులకు సంప్రదించాలని, పశు వైద్యాధికారి రూ.250 చెల్లించి జిల్లా పశు వైద్య వీర్య కేంద్రం ద్వారా తీసుకురావాలని తెలిపారు. పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు త్వరలో వేస్తామని, దానికి సిబ్బంది సిద్ధంగా ఉండాలన్నారు. పశుమిత్ర, అభ్యుదయ రైతులు గొర్రెలు, మేకలకు నట్టల నివారణ ఆప్‌లోడింగ్ కార్యక్రమం శతశాతం చేసినందుకు అభినందించారు. సమావేశంలో నాబార్డు కన్సల్టెంట్ ఇంజినీర్ పాపారావు, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఉపసంచాలకుడు కరుణాకర్

'ప్రతి ఇంటా మరుగుదొడ్డి ఉండాల్సిందే'

కోటబొమ్మాళి: ప్రతి ఇంటా మరుగుదొడ్డి ఉండాల్సిందేనని మండల ప్రత్యేకాధికారి కె.శ్రీదేవి చెప్పారు. మరుగుదొడ్డి నిర్మించని వారి జాబితాను ఈనెల 18లోగా మండల పరిషత్ కార్యాలయానికి అందజేయాలని సూచించారు. శుక్రవారం ఆమె ఎంపీడీవో ఎం.రేణుక అధ్యక్షతన ఉపాధి హామీ పథకం క్షేత్రసహాయకులు, టెక్నికల్ అసిస్టెంట్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పంచాయతీల వారీగా ఇంకా ఎన్ని నిర్మించాలి, ఇంకా ఎన్ని అవసరం వంటి అంశాలపై సమీక్షించారు. గత మూడు సమావేశాల్లోనూ జాబితాలు ఇవ్వాలని కోరినప్పటికీ ఎందుకు జాప్యం చేస్తున్నారని క్షేత్రసహాయకులను నిలదీశారు. జాబితాలు తయారుచేసి అందజేస్తే అవసరమైన నిధులు మంజూరు చేసేందుకు వీలుంటుందని చెప్పారు. ఈ విషయంలో అలక్ష్యం వహించే వారిపై చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో జి.హరిప్రసాద్, స్వచ్ఛ భారత్ మండల కో-ఆర్డినేటర్ పల్లి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి శ్రీదేవి

'రుణాలు పొంది యూనిట్లు స్థాపించండి'


ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న దృశ్యం

సంతబొమ్మాళి: రుణాలు పొందిన వారు వెంటనే యూనిట్లు స్థాపించాలని రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ ఎల్.ఎల్.నాయుడు అన్నారు. శుక్రవారం ఆయన సంతబొమ్మాళిలో బీసీ కార్పొరేషన్ రుణాలకు నిర్వహించిన ఇంటర్వ్యూల్లో ముఖ్యఅతిథిగా మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతను ఆర్థికంగా అభివృద్ధి చేయాలనే ధ్యేయంతో 50 శాతం సబ్సిడీతో రుణాలు అందిస్తోందని చెప్పారు. రుణాలు పొందిన వారు యూనిట్లు స్థాపించి మరో పదిమందికి ఉపాధి కల్పించాలని కోరారు. మండలంలో మౌలిక వసతులు ఉన్న యూనిట్లను ఎన్నుకొని వాటి ద్వారా ఆర్థికంగా పరిపుష్టి చెందాలన్నారు. అర్హులైన ప్రతి నిరుద్యోగికీ రుణం ఇవ్వడమే లక్ష్యంగా బీసీ కార్పొరేషన్ పనిచేస్తున్నట్లు తెలిపారు. మండలానికి 199 యూనిట్లు మంజూరవగా 450 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు లమ్మత లక్ష్మి, ఎంపీడీవో ఎం.ప్రభావతి, కర్రి విష్ణుమూర్తి, ఆసిరినాయుడు పాల్గొన్నారు.

చంద్రన్న బీమా అందజేత

టెక్కలిటౌన్: స్థానిక చిన్నబ్రాహ్మణవీధికి చెందిన మోహన్‌జెన్నా ఇటీవల మృతిచెందడంతో భార్య మాధురీ జెన్నాకు చంద్రన్న బీమా తక్షణ సహాయంగా రూ.5 వేల నగదును ఎంపీటీసీ సభ్యుడు మామిడి రాము, బర్ల తవిటయ్య శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి ఈ పథకాన్ని ప్రవేశపెట్టారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.


బీమా పరిహారం అందజేస్తున్న దృశ్యం

టెక్కలిలో సినిమాలు

సుదర్శన్	: నేనే రాజు నేనే మంత్రి
భవాని	: జయ జానకి నాయక

కోటబొమ్మాళిలో..

శివకృష్ణ	: లై
అనుపమ	: నేనే రాజు నేనే మంత్రి